ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 93 పేజీలు: 10+4 వెల: 6.50

నేడు రాష్ట్రానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2
భారత్ నౌకలను అనుమతించబోం: పాక్ 5

మోడీ స్టైల్ మీకు తెలిసిందే..
## ప్రజలు కోరుకున్నది పక్కా జరిగి తీరుతుంది
రక్షణమంత్రి రాజ్‌నాథ్



**న్యూఢిల్లీ, మే 4:** భారత్‌పాకిస్థాన్‌లమధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్న తరుణంలో కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలుచేసారు.భారత్‌పై దాడులకు >>2

## పాక్ కోసం 'ఇగ్లా'లు
శతృసేనలను తుదముట్టించేందుకు భారత సైన్యంలోకి క్షిపణులు



**న్యూఢిల్లీ, మే 4:** సంక్షోభం, విపత్కర పరిస్థితుల్లో వాడేందుకు వీలుగా భారత్‌స్వల్ప శ్రేణి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను సిద్ధం చేస్తోంది. కొన్నాళ్ల క్రితమే రష్యా తయారీ ఇగ్లా ఎస్ మిసైల్స్ ను దిగుమతిచేసుకున్న భారత్ స్వల్పదూరం >>2

## కోహినూర్ వచ్చేస్తుందా?
అన్నీ సానుకూలంగా ఉంటే రావొచ్చన్న బ్రిటన్ మంత్రి



**న్యూఢిల్లీ, మే 4:** బ్రిటన్ రాణి కిరీటంలో పొదిగిన కోహినూర్ భారత్‌కు తిరిగి ఇస్తారా అన్న ప్రశ్నపై బ్రిటన్ సాంస్కృతిక మీడియా క్రీడల మంత్రి లీసా నాండి స్పష్టత >>2



ఎయిర్‌చీఫ్‌తో ప్రధాని
## అత్యవసర సమావేశం

**న్యూఢిల్లీ, మే 4:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ సైనికాధికారులతో వరుస భేటీలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తో ప్రధాని భేటీ అయ్యారు. ఢిల్లీలోని ప్రధాని నరేంద్రమోదీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఉగ్రదాడికి ప్రతిగా భారత సైన్యం తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ముందురోజు భారత నౌకాదళాధిపతి, అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠీ కూడా ప్రధానితో సమావేశమయ్యారు. ప్రధాని నివాసానికి వెళ్లి >>2

భూ భారతి.. రైతులకు
## రక్షణ కవచం



నేటి నుంచి 28 మండలాల్లో సదస్సులు
రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు
రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,మే 4 ప్రభాతవార్త:** తెలంగాణ భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి నాంది పలికిన భూభారతి చట్టాన్ని దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే సోమవారం నుంచి 20వ తేదీవరకు రాష్ట్రంలోని జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాకోణంలో తీసుకువచ్చిన ఈ భూభారతి చట్టంపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు ఆయా మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిష్కరించడమే ఈ రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతికలెక్టర్ రెవెన్యూ సదస్సులకు హాజరై అక్కడ రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్ధమయ్యే భాషలో వివరించి పరిష్కారం చూపాలని చెప్పారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలని కలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సమాజంలో >>2


మావోయిస్టులతో
## మాటల్లేవ్.. లొంగిపోవాల్సిందే..



చర్చల ప్రసక్తే లేదు.. నక్సల్స్ తుపాకీ వీడాల్సిందే..
కేంద్ర కులగణన నిర్ణయం చారిత్రాత్మకం: కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ రూరల్, మే 4 ప్రభాతవార్త:** "మావోయిస్టులతో మాటల్లేవు... మాట్లాడుకోవడాల్లేవ్. నిషేధిత సంస్థతో చర్చల ప్రసక్తే లేదు.. వాళ్లతుపాకీ వీడాల్సిందే. పోలీసులకు లొంగిపోవాల్సిందే. వాళ్ల ప్రవర్తన మార్చుకోవాల్సిందే."అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మావోయిస్టు సమస్యను సామాజిక కోణంతో చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆపరేషన్ కగార్ ను ఆపాలంటూ కేసీఆర్‌చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. "తుపాకులు చేతపట్టి అమాయక ప్రజలను, గిరిజనులను కాల్చిచంపడాన్ని సామాజిక కోణంతో చూడాలనడం ఏం పద్ధతి. బాంబులు (క్లైమోర్ మైన్స్) అమర్చి పోలీసులను తునాతునలు చేసి చంపుతుంటే సామాజిక కోణంతో చూడాలా? అసలు మావోయిస్టులపై నిషేధం విధించిందే కాంగ్రెస్ పాలకులు కదా? ఇప్పుడు సామాజిక కోణం, చర్చలంటూ సన్నాయి నొక్కులు నొక్కడమేంది? ఎంతో మంది ప్రజలను, గిరిజనులను, పోలీసులను కాల్చి చంపినప్పుడు మీకు ఈ విషయం గుర్తుకురాలేదా?"అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మావోయిస్టులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా?అని సవాల్ విసిరారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో మండల కేంద్రంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ సంచలన వాఖ్యలు చేశారు. ఆపరేషన్ కగార్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు విడ్డూరం. నక్సల్స్ సమస్యను సామాజిక కోణంతో చూస్తున్నామని చెప్పడమేంది? ఇదెక్కడి పద్ధతి? >>2

పాక్‌ను అన్నివైపుల నుంచి
## దిగ్బంధిస్తోన్న భారత్
బాగ్‌లిహార్ డ్యామ్ నుంచి నీరు నిలిపివేత



**న్యూఢిల్లీ, మే 4:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌ను అన్ని వైపుల నుంచి భారత్ దిగ్బంధిస్తోంది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపేసిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా బాగ్‌లిహార్ ఆనకట్ట నుంచి దాయాది దేశానికి నీటి సరఫరాను నిలిపివేసింది. పొరుగు దేశాన్ని ఎండగట్టే చర్యల్లో ఇది రెండోదిగా చెప్పాలి. ఓ క్షిపణిని పరీక్షించిన నేపథ్యంలో ఆ విషయం బయటకు వచ్చింది. నీటి ప్రవాహాన్ని ఆపేందుకు బాగ్‌లిహార్ డ్యామ్ స్లూయిస్ స్పిల్‌వేపై ఉన్న గేట్లను కిందకు దించేశారు. దీంతో పాక్‌లోని >>2



ఆదివారం హైదరాబాద్‌లోని ఓ పరీక్షాకేంద్రం వద్ద వేచి ఉన్న నీట్ అభ్యర్థులు

## నీట్ పరీక్షలో కఠినంగా బయాలజీ ప్రశ్నలు!
నిమిషం ఆలస్యంతో పరీక్షకు అనుమతించని అధికారులు
కరీంనగర్‌లో అధికారుల కాళ్లు మొక్కిన మహిళ
సికింద్రాబాద్‌లో ఆలస్యంతో వెనుదిరిగిన బాలిక

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్‌తోపాటు బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2025 యూజీ కోర్సు పరీక్ష ఆదివారం దేశ వ్యాప్తంగా జరిగింది. నీట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా సుమారు 22.7 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా .. వారి కోసం 5453 కేంద్రాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ఏర్పాటు చేసింది. మొత్తం 13 భాషల్లో పరీక్షను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి నీట్-2025కి 72,507 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు >>2

## సంక్షేమంతో ముందుకు
యువతకు ఉపాధికోసం సాంకేతిక విద్యలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లు
హుజూర్‌నగర్‌లో అర్హులకు చెక్కులను అందజేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్



ఆదివారం హుజూర్‌నగర్‌లో అర్హులకు చెక్కులను అందజేసిన నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


**హుజూర్‌నగర్‌టౌన్, మే 4, ప్రభాతవార్త:** అభివృద్ధి, అన్నివర్గాల ప్రజల సంక్షేమంతో తెలంగాణ ముందుకు వెళుతుందని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపిడివో కార్యాలయంలో 231 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 30 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రా ష్ట్ర ప్రజల ఆదాయ వనరులు పెంచేందుకు అవసరమైన ఎన్నో ఉపాధి అభివృద్ధి కార్యక్రమాలను తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మహిళల అభివృద్ధి కోసం వడ్డీలేని రుణాలు, విద్యార్థి, యువతకు ఉపాధి కోసం సాంకేతిక విద్యలో భాగంగా ఐటిఐ, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు, అలాగే రూ.12 కోట్లతో జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధునాతనమైన తరగతి గదులను నిర్మించి పేద విద్యార్థులు చదువుకునేందుకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం చివరి ఆయకట్టు వరకు సాగునీరు, వేల కోట్ల రూపాయలతో ఎత్తిపోతల పథకాలు, ధాన్యానికి మద్దతుధర ఇస్తున్న గొప్ప ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. పేదల కోసం పట్టణంలోని ఫణిగిరి గట్టు వద్ద 2,160 సింగిల్ బెడ్‌రూం ఇండ్లు పూర్తి చేయిస్తు త్వరలో పేదవారి సొంతింటి కలను నెరవేర్చబోతున్నామన్నారు. సొంత జాగా ఉండి ఇల్లు కట్టుకునే పేద, మధ్య తరగతి వర్గాలకు రూ.5 లక్షల ఆర్ధిక సహాయం అందిస్తున్నామన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలోని మారుమూల ప్రతి గ్రామానికి రాక పోకల కోసం చక్కని రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. తెలంగాణలోని 84శాతం మందికి ఉచితంగా సన్నబియ్యం అందించి వారికి చక్కటి భోజనం అందిస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయలేని ఎన్నో అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకెళుతున్న ప్రభుత్వ కార్యక్రమాలల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి.శ్రీనివాసులు, తహసిల్దార్లు నాగార్జునరెడ్డి, కమలాకర్, ఎంపిడివో లావణ్య, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ దేశ్‌ముఖ్ రాధికా అరుణ్‌కుమార్, కాం గ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, మోతీలాల్ నాయక్, మంజునాయక్, గూడెపు శ్రీనివాస్, ఇతర అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు ప్రజల కల నెరవేర్చాం
ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించాం..
హైటెక్ తరహాలో ఆరు నెలల్లో బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు
ములుగు లో 4.80 కోట్లతో శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

**ములుగు, మే 4, ప్రభాతవార్త:** ములుగు జిల్లా ప్రజల దశాబ్దాల కళ జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ ఏర్పాటుతో నెరవేర్చబోతున్నామని, హైటెక్ తరహాలో నూతన బస్టాండ్‌ను ఆరు నెలల లోపు పూర్తి చేసి ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలన్నింటికీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో, రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.లతో కలిసి నాలుగు కోట్ల 80 లక్షల రూపాయలతో చేపట్టనున్న నూతన బస్టాండ్ నిర్మాణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. జిల్లాకు చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గట్టమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రులు భారీ ర్యాలీగా జిల్లా కేంద్రానికి చేరుకోగా అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల అభిప్రాయం మేరకే ప్రజా పాలన ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని, తాము ఇచ్చిన హామీలను కాకుండా నూతన పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ 1989లో నిర్మించగా ప్రస్తుతం బస్టాండ్ పరిస్థితి బాగాలేదని సోదరీమణి సీతక్క తెలుపగానే నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించామని, మంగపేట మండలంలో 50 లక్షల రూపాయలతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి అవుతున్నాయని అన్నారు. రానున్న రోజులలో మంగపేట మండల కేంద్రంలోని నూతన బస్టాండును ప్రారంభించడమే కాకుండా ఏటూరు నాగారం మండల కేంద్రంలో ఏడు కోట్ల రూపాయలతో చేపట్టనున్న బస్ డిపో పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రేమనగర్ వద్ద గిరిజన >>2



ఆదివారం ములుగులో బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క



## 12న ఎప్‌సెట్ ఫలితాలు!
ప్రశాంతంగా ముగిసిన ఎప్ సెట్ పరీక్షలు
వెబ్‌సైట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రాథమిక కీ
నేడు ఇంజినీరింగ్ ప్రాథమిక కీ విడుదల

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్(ఈఏపి) సెట్-2025 పరీక్షలు ఆదివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఏప్రిల్ 29, 30 తేదిల్లో అగ్రికల్చర్, ఫార్మస పరీక్షలు జరగగా.. మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరిగాయి. ఇందుకు సంబంధించిన ఫలితాలను ఈ నెల 12న విడుదల చేసేందుకు ఎప్ సెట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని ఇప్పటికే వెబ్‌సైట్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్టు ఎప్ సెట్-2025 అధికారులు తెలిపారు. ఇంజినీరింగ్ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని నేడు అప్‌లోడ్ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించి సబ్జెక్టు నిపుణులతో పరిశీలించిన అనంతరం ఫైనల్ కీని విడుదల చేసి ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ నెల 12న ఎప్‌సెట్ >>2



ప్రపంచంలోనే మొట్టమొదటి రెండు జన్యుసవరించిన వరి రకాలను ఆదివారం న్యూఢిల్లీలో విడుదల చేస్తున్న కేంద్ర వ్యవసాయం మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

# పాక్ కోసం 'ఇగ్లా'లు

>> ఎయిర్‌డిఫెన్స్‌కోసం వీటిని వాడాలని నిర్ణయించింది. సైనిక దళాలకు ప్రభుత్వం ఇచ్చిన అత్యవసర ప్రొక్యూర్‌మెంట్ పవర్స్ వాడి వీటిని కొనుగోలుచేసారు. కొన్ని వారాలక్రితమే ఇవి భారత్‌కు చేరాయి. ఈ క్రమంలో సంక్షోభం తలెత్తడంతో ప్రత్యర్థులకు జవాబిచ్చేందుకు వీటిని సిద్ధంచేస్తోంది. ఈ స్వల్పశ్రేణి క్షిపణులతో ఫైటర్‌జెట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, చాపర్స్,డ్రోన్లను ధ్వంసంచేయవచ్చని రక్షణశాఖ చెపుతోంది. సుమారు 260 కోట్ల వ్యయంతో కొనుగోలుచేసారు. పశ్చిమ సెక్టారులో సరిహద్దులవద్ద వాడేందుకు ఇవి అత్యంత అనువుగా ఉంటాయి. భారత వాయుసేన అమ్ములపొదిలో కూడా ఇవి ఉన్నాయి.
ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్‌కింద ఇటీవలికాలంలో ఆయుధాల విడిభాగాలు కూడా దిగుమతిచేసుకుంటున్నారు. దళాలను యుద్ధ సన్నద్ధతగా ఉంచడానికి ఇవి ఉపకరిస్తునాననయి. తాజాగా కూడా 48 లాంచర్లు, 90 ఇగ్లాఎస్ క్షిపణులకోసం సైన్యం టెండర్ జారీచేసింది. వీటిని ఫాస్ట్‌ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ కిందనే కొనుగోలుచేస్తోంది. కొత్తతరం ఇగ్లాలపైనా దృష్టిపెట్టారు. ఇవి లేజర్ బీమ్ రైడింగ్ సామర్థ్యంతో ఉంటాయి. 1990నుంచి ఇగ్లాను భారత్ సైన్యం వినియోగిస్తోంది. దేశీయంగా ఉన్న సంస్థలు వీటిల్లో మార్పుతో ఇగ్లాఎస్ వెర్షన్ సిద్ధంచేసాయి. పాక్‌సైన్యం పలురకాలడ్రోన్లు యుఎవిలు వినియోగిస్తోంది. ఈ క్రమంలో ఇగ్లా ఎస్ క్షిపణుల అవసరం భారత్‌కు ఎక్కువ ఉండొచ్చనిభావిస్తున్నారు. వీటితోపాటు మన దళాలు దేశీయంగా అభివృద్ధిచేసిన ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్‌కూడా మొహరించనుంది.

# కోహినూర్ వచ్చేస్తుందా?

>> ఇచ్చారు. భారత్‌బ్రిటన్‌లమధ్య సాంస్కృతిక కళాఖండాల మార్పిడికోసం ఉన్నతస్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నాయని, అన్నీ సానుకూలంగా జరిగితే అందరికీ ఆమోదయోగ్యం అయిన నిర్ణయం రావచ్చని పరోక్షంగా వ్యాఖ్యలుచేసారు. ఇదే అంశంపై భారత్ సాంస్కృతిక శాఖమంత్రితోనూ చర్చించామన్నారు. అధికారిక పర్యటనలో లీసా నాండీ ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్నారు. సృజనాత్మకత, సాంస్కృతిక క్రీడా రంగాల్లో భారత్‌లో దృఢమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు లీసా తెలిపారు. సినిమా టివి, మ్యూజిక్, క్రీడా రంగాల్లోబ్రిటన్ దూసుకుపోతోంది. ఆయా రంగాలకు సంబంధించిన బ్రిటన్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్నారు.
భారత్‌సహకరిస్తే వాటినిమరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లగలమన్న నమ్మకం మాకుందని అన్నారు. అందుకు భారత్‌కూడా మద్దతిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తంచేసారు. భారతపర్యటనకోసం రెండురోజులక్రితమే ఢిల్లీచేరినామె సాంస్కృతికశాఖకు సంబంధించిన పలు ఒప్పందాలపై కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో చర్చలుజరుపుతున్నారు. పహల్గాం ఉగ్రదాడిపైనా ఆమె స్పందించారు. ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించారు. ఇలాంటి చర్యలు ఉపేక్షించకూడదని, ఉగ్రవాదం నిర్మూలనకు ప్రపంచదేశాలన్నీ కలిసిరావాలన్నారు. భారత్‌కు చెందిన 108 క్యారెట్ల విలువైన కోహినూర్ వజ్రాన్ని 1849లో మహారాజ్ దులీప్‌సింగ్, విక్టోరియా మహారాణికి ఇచ్చారు. అప్పటినుంచి ఆవజ్రం వారి అధీనంలోనే ఉంది. రాణి కిరీటంలో అమర్చారు. దానిని తిరిగి తీసుకోవాలని భారత ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ప్రయత్నించినప్పటికీ అది కార్యరూపంలోకి రాలేదు.

# పక్కా జరిగి తీరుతుంది

>> ప్రయత్నించేవారికి తగిన రీతిలోసమాధానం చెపుతామని హెచ్చరించారు. దేశ సరిహద్దుల భద్రతతోపాటు సైనికులను కాపాడుకోడం రక్షణమంత్రిగా తన బాధ్యత అన్నారు. ప్రధాని నరేంద్రమోడీప నితీరు, పట్టుదలగురించి అందరికీ తెలుసన్న రాజ్‌నాథ్ ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగాజరిగి తీరుతుందని తాను హామీ ఇస్తున్నానన్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తపరిస్థితులు పాక్‌పై ప్రతీకార చర్యలను కేంద్రం పరిశీలిస్తున్న తరుణంలో రాజ్‌నాథ్ వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఢిల్లీలోజరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్‌లో ఆయన మాట్లాడారు.
మన వీర సైనికులు నిరంతరం దేశ భౌతిక స్వరూపాన్ని కాపాడుతుంటే రుషులు, జ్ఞానులు, దేశ ఆధ్యాత్మిక రూపాన్ని పరిరక్షిస్తున్నారు. ఒకవైపు మన సైనికులు యుద్ధభూమిపై పోరాడుతుంటే సాధువులు జీవనభూమిపై పోరాడుతున్నారు. దేశ సరిహద్దులభద్రతతోపాటు సైనికులను కాపాడటం నాబాధ్యత. దేశంపై దాడికి ప్రయత్నించేవారికి తగిన రీతిలో బదులివ్వడం నావిధి అన్నారు.
మీకు ప్రధాని గురించి బాగా తెలుసు. ఆయన వర్కింగ్ స్టైల్ ఏటో పట్టుదల ఏంటో తెలుసు.ఆయన సారథ్యంలో మీరు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుందని మీకు హామీ ఇస్తున్నా. భరాత్‌శక్తిసాయుధ దళాల్లోనేకాదని, సంస్కృతి, ఆధ్యాత్మికతలోకూడా ఉందని అన్నారు.

# ప్రధాని అత్యవసర సమావేశం

>> ఆయనను కలిశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కూడా రెండుసార్లు సమావేశమైంది. తొలి భేటీలో భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు సింధూ జలాల పంపిణీని నిలిపివేయాలని, ఉగ్రదాడికి ప్రతిగా ధీటైన జవాబు చెప్పాలని నిర్ణయించారు. రెండో భేటీలో ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్లు ప్రకటించారు. దాడి చేయాల్సిన లక్ష్యాలు, దాడి సమయం త్రివిధ దళాలే నిర్ణయిస్తాయని తెలిపారు. గతవారం యుద్ధ సన్నద్ధతలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది. 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత వాయుసేన పాకిస్థాన్‌లోకి ప్రవేశించి దాడి చేసింది. నాటితో పోల్చుకొంటే రఫెల్ యుద్ధ విమానాలు, ఎస్400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ఐఎఫ్ శక్తి గణనీయంగా పెరిగింది.

## నేడు రాష్టానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

### వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి నితిన్ గడ్కారి సోమవారం రాష్ట్రంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సోమవారం ఉదయం కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్ వద్ద జాతీయ రహదారులకు సంబంధించి శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 4గంటలకు బిహెచ్‌ఈఎల్, 5.30గంటలకు అంబర్‌పేట ఫ్లైఓవర్‌లను పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారు. సాయంత్రం 5.30గంటలకు అంబర్‌పేట మున్సిపల్ ప్లేగ్రౌండ్‌లో పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొనున్నారు. కేంద్రమంత్రి నితిన్‌గడ్కారి వెంట రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లు పాల్గొంటున్నారు.

## ఎప్‌సెట్ ఫలితాలు!

>> ఫలితాలను విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఫలితాల విడుదలకు ప్రభుత్వ అనుమతి రాగానే ఈ నెల 12 లేదా 13న విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎప్ సెట్-2025 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎప్ సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్, జేఎన్‌టియూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం జరిగిన పరీక్షలకి 94.4 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈఏపీ సెట్-2025కి 3,06,796 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో ఇంజనీరింగ్‌కి 2,20,049 దరఖాస్తులు వచ్చాయి. పరీక్షల నిర్వహణ కోసం 124 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు .. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఇంజనీరింగ్ పరీక్షకి ఉదయం సెషన్‌లో 36,172 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 34,116 మంది హాజరయ్యారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 94.32 శాతం మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో 36,173 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 34,189 మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 94.52 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు.

## వారం - వర్జ్యం

తేది : 05-05-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
అష్టమి ఉ.7.37
ఆశ్లేష మ.2.05
వర్జ్యం రా.3.00-తె.4.43
దు.మ.12.31-మ.1.22, 2) మ.3.04-3.55
రాహుకాలం - ఉ.7.30-9.00

## వారఫలం

**మేషం:** ఉద్యోగాలు నిదానిస్తాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** కొత్త ఋణ యత్నాలు చేస్తారు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:** ఉద్యోగాలలో పనిభారం పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గుంటారు.

**సింహం:** కొత్త వ్యక్తుల పరిచయాలు పెరుగుతాయి. పాతబాకీలు వసూలవుతాయి. వస్తువులు సేకరణ.

**కన్య :** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు పొందుతారు. ఇంటా బయటా అనుకూలం.

**తుల :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఆప్తుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** నూతన పరిచయాలు విస్తరిస్తాయి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహనయోగం.

**ధనుస్సు:** వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా సాగుతారు. వస్తులాభం.

**మకరం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**కుంభం:** ఋబాధలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా సాగుతాయి.

**మీనం:** గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మావోయిస్టులతో మాటల్లేవ్..

>> మావోయిస్టుల చేతిలో తుపాకులున్నాయి. గిరిజనులను, అమాయకులను కాల్చి చంపుతున్నారు. బాంబులు పెట్టి పోలీసులను చంపుతున్నారు. ఇంత జరుగుతుంటే సామాజిక కోణంతో చూడాలని చెప్పడమేంది? కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలే కదా మావోయిస్టులను నిషేధించింది. కానీ ఇప్పుడు మళ్లీ ఆ కాంగ్రెస్ నాయకులే నక్సల్స్ తో చర్చలు జరపాలని చెప్పడం వాళ్ల ద్వంద్వ నీతికి నిదర్శనం కాదా? "అసలు ఇక్కడ మావోయిస్టులపై నిషేధం ఉంది కదా? నిషేధం విధించింది ఇక్కడి పాలకులే కదా. మరి మావోయిస్టులపై నిషేదం తొలగించే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? సమాధానం చెప్పాలి. నిషేధం తొలగించకుండా, తుపాకీతో పట్టుకుని అమాయకులను కాల్చి చంపుతున్నోళ్లతోని చర్చలేంది? గిరిజనుల చేతిలో తుపాకులుండవ్ కదా? వాళ్లు ఎవరినీ చంపరు. వాళ్లు మనుషులను చంపడానికి బాంబులు పెట్టరు. అవన్నీ చేసేది మావోయిస్టులే. ఆ నిషేధిత సంస్థతో ప్రభుత్వం ఎట్లా చర్చలు జరుపుతుంది? మాజీ ముఖ్యమంత్రికేసీఆర్ ఎప్పుడో ఒకసారి బయటకు వస్తడు,మళ్ళీ కనబడడు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ కలిసి పోటీ పడి నక్సల్స్ గురించి మాట్లాడుతున్నరు. మహాముత్తారంలో ఎస్ఐ భార్య శ్రీమంతం చేసుకునే సమయంలో బాంబులు పెట్టి నక్సల్స్ ఆ ఎస్ఐని చంపేశారు. అప్పుడే కానిస్టేబుల్ ను చంపేశారు. దూరదర్శన్ జర్నలిస్టును చంపేశారు. బీజేపీ నాయకుడు సామ జగన్మోహన్ రెడ్డి, మధుసూదన్ గౌడ్, రామన్నగోపన్నలను చంపేశారు. అంతెందుకు కాంగ్రెస్ నాయకులను ఎంతో మంది చంపేశారు. శ్రీపాదరావు వంటి అజాత శత్రువును కూడా నక్సల్స్ చంపేశారు. కేసీఆర్ టీడీపీలో ఉండగా ఆ పార్టీ నాయకులను ఎంతోమందిని చంపేశారు. అప్పుడెందుకు మీరు మాట్లాడలేదు. బాంబులు అమర్చి పోలీసులను తునాతునకలు చేసి నక్సల్స్ చంపుతుంటే రేవంత్ రెడ్డి, కేసీఆర్ సమర్థిస్తారా?... గిరిజనులను, అమాయక ప్రజలను ఇన్ ఫార్మర్ల పేరుతో కాల్చి చంపుతుంటే సమర్థిస్తారా? సమాధానం చెప్పాలి. మేం మాత్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదు. తుపాకీ వీడాల్సిందే. పోలీసులకు లొంగిపోవాల్సిందే. వారి వైఖరి మారాల్సిందే. వాళ్లతో చర్చలు జరిపే సందర్భమే రాదు.పాకిస్తాన్ పౌరులను తిరిగి పంపే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చింది. దేశమంతా ఈ విషయంపై సీరియస్ గా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడం సరికాదు. ఇప్పటికీ చాలా మంది పాస్ పోర్టు, వీసాల్లేకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు సమాచారముంది. రోహింగ్యాలు చాలా మంది ఇక్కడే నివసిస్తున్నారు. రోహింగ్యాలపై వైఖరిని తెలియజేయాలి. దీనిని శాంతిభద్రతల సమస్యగా చూడాలే తప్ప మతం కోణంతో, రాజకీయ లబ్ది కోణంతో చూస్తే హైదరాబాద్ టెర్రరిస్టులకు అడ్డాగా మారే ప్రమాదముందనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. శాంతి భద్రతల సమస్యను రాజకీయం చేయడం సరికాదు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి వారం రోజులైంది. నిన్నటిదాకా ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని బుకాయిస్తూ వచ్చారు. మరి నివేదిక వచ్చి వారం దాటింది. చర్యలెందుకు తీసుకోవడం లేదు. ఎందుకంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే. ప్రజలను మభ్యపెట్టడానికి డ్రామాలాడుతున్నయ్. అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ కాపాడుతోంది. 6 గ్యారంటీల వైఫల్యాలపై మాట్లాడకుండా బీఆర్ఎస్, కాంగ్రెస్ ను కాపాడుతోంది. ఇప్పుడు ఆ రెండు పార్టీలు మావోయిస్టులతో చర్చలు జరపాలని పోటీలు పడుతూ ప్రజా సమస్యలను, 6 గ్యారంటీలను దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కేంద్ర కులగణన నిర్ణయం చారిత్రాత్మకం. కాంగ్రెస్ విజయమని చెప్పడం విడ్డూరం. ఎందుకంటే కాంగ్రెస్ కులగణన సర్వేకు, మోదీ కులగణను పొంతనే ఉండదు. కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. 52 శాతం జనాభా ఉన్న బీసీలను 46 శాతంగా చూపారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేస్తున్నామని చెప్పి...అందులో నుండి 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు కేటాయించారు. నిజానికి కాంగ్రెస్ బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానంటోంది. అయినా ఇప్పటికే మోదీ ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. ఇక కాంగ్రెస్ చేసిందేముంది? బీసీల జనాభాను తగ్గించి చూపారు. అందుకే కాంగ్రెస్ మాయ మాటలను జనం నమ్మడం లేదని వివరించారు...

# భూ భారతి.. రైతులకు రక్షణ కవచం

>> భూమి కీలకమైన అంశం, గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల రాష్ట్రంలో ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఒక కుట్రపూరితంగా, దురుద్దేశ్యంతో తీసుకొచ్చిన ధరణితో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ధరణితో ప్రజల జీవితాలను ఆగమాగం చేసింది. ఎన్నో రైతు కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని తెలిపారు.గత ప్రభుత్వ పెద్దలే ధరణి దందాలకు అండదండలుగా నిలిచారు. ప్రజల ఆలోచనలకు భిన్నంగా గత పదేండ్లలో రాష్ట్రంలో భూ హక్కుల విధ్వంసం జరిగి రైతులకు రెవెన్యూ సేవలు దుర్భరంగా మారాయన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనలు, ఆలోచనలకు అనుగుణంగా రైతు కళ్లల్లో ఆనందం చూడాలనే సంకల్పంతో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు.చట్టాన్ని తీసుకురావడం ఒక ఎత్తు కాగా దానిని అమలు చేయడం మరో ఎత్తు. ప్రజలు , ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతో విజయవంతంగా అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో భూ సమస్యపై కోర్టుకెళ్లడం తప్ప మరో మార్గం ఉండేదికాదు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అధికార యంత్రాంగం రైతుల దగ్గరకు వచ్చి వారి సమస్యను పరిష్కరిస్తుందన్నారు.

**భూ భారతి అమలు కానున్న 28 మండలాల వివరాలు ఇవే...**

ఆదిలాబాద్‌లోని భరోజ్, భద్రాద్రి కొత్తగూడెంలోరి సుజాతనగర్,హనుమకొండలోని నడికుడి,జగిత్యాలలోని బుగ్గారం,జనగాంలోని ఘన్‌పూర్,జయశంకర్ భూపాలపల్లిలోని రేగొండ,జోగులాంబలో గద్వాల్ ఇటిక్యాల్, కరీంనగంలోని సైదాపూర్,కొమరంభీం ఆసిఫాబాద్‌లోని పెంచికల్‌పేట్,మహబూబాబాదలోని దంతాలపల్లె మహబూబ్ నగర్‌లోని మూసాపేట్,మంచిర్యాలలోని భీమారం,మెదక్‌లోని చిల్పిచిడ్,మేడ్చల్ మల్కాజిగిరి లోని కీసర,నాగం్కర్నూల్ లోని పెంట్లవల్లినల్గొండలోని నక్రేకల్,నిర్మల్‌లోని్ కుంతాల,నిజామాబాద్‌లోని మెండోరా,పెద్దపల్లిలోని ఎలిగేడ్,రాజన్న సిరిసిల్లలోని రుద్రంగి,రంగారెడ్డిలోని కుందుర్గ్.సంగారెడ్డిలోని, కొండాపూర్‌సిద్ధిపేట అక్కన్నపేట, సూర్యాపేటలోని, గరిడేపల్లెవికారాబాదలోని ధరూర్,వనపర్తిలోని గోపాల పేట, వరంగల్‌లోని, వర్ధన్నపేట్,యాదా ద్రి భువనగిరిలోని ఆత్మకూర్ మండలాల్లో భూ భారతి అమలవుతుందని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.



ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆనందోత్సాహాల్లో ముంబయిలోని ఓ నవ్వుల క్లబ్ సభ్యులు

# ములుగు ప్రజల కల నెరవేర్చాం

>> యూనివర్సిటీ, సమీకృత కలెక్టరేట్ కార్యాలయం, వైద్య కళాశాల ఉన్న కారణంగా ఎకరం స్థలంలో 45 లక్షల రూపాయలతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. మహిళలను ఆర్థికంగా బలోపితం చేయడానికి మహిళా సంఘాల వారిచే 600 బస్సులను కొనుగోలు చేసి బస్సు యజమానులుగా చేశామని, ములుగులో చేపట్టనున్న నూతన బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టిన ప్రగతిని ప్రతినెల అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్ గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, రాష్ట్రంలో తాము కుల గణన చేయడంతోనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి దేశవ్యాప్తంగా కులగనన చేయడానికి ముందుకు వచ్చిందని, దీనిపై కేంద్ర మంత్రులు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ములుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మంత్రి సీతక్క చొరవ చూపడం అర్శించదగ్గ విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు ప్రాంతం ఒకప్పుడు గ్రామీణ ప్రాంతంగా అనంతరం మండల ప్రాంతంగా జిల్లా ప్రాంతంగా ఏర్పడిన అనంతరం ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ప్రభుత్వం గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ములుగు జిల్లాలో పలు ప్రాంతాలలో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు చేయడానికి నిధులు కేటాయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి నేడు రాష్ట్రంలో బీసీల పాలిట దేవుడు గా మారి 42 శాతం రిజర్వేషన్ సాధించడం గొప్ప విషయమని, జిల్లా కైంద్రాన్ని రోల్ మాడల్ గా తీర్చిదిద్దడానికి రానున్న రోజులలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ములుగు ప్రాంతం పర్యాటక ప్రాంతంగా మారడంతో ఎలాంటి పనులకైనా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నిధులు కేటాయిస్తున్నారని, మిస్ వరల్డ్ కార్యక్రమంలో భాగంగా సుందరిమణులు రామప్పను సందర్శించనున్న దృశ్య ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. నూతన బస్టాండు నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోనున్నాయని హర్షం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాల్మన్ రాజ్, డిప్యూటీ ఆర్ ఎం ఓ భాను కిరణ్, ఆర్డీవో వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్, డిపో మేనేజర్లు జ్యోత్స్న, రవి చందర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని హిందూమతం నుంచి బహిష్కరిస్తున్నాం..

### బద్రీనాథ్ స్వామీ అవిముక్తేశ్వరానందజీ సంచలనం

**డెహ్రాడూన్, మే 4:** కాంగ్రెస్ నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ శ్రీరాముడిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈక్రమంలో జ్యోతిర్మఠానికి చెందిన శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి సంచలన ప్రకటనచేసారు. రాహుల్ గాంధీ ఇకపై హిందూ మతంలో భాగం కాదని అన్నారు. ఆతడిని హిందూ మతంనుంచి బహిష్కరిస్తామని ప్రకటించారు. బద్రీనాథ్‌లోని శంకరాచార్య ఆశ్రమంలో స్వామి అవిముక్తేశ్వరానంద మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నిత్యం హిందువుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా వ్యాఖలుచేస్తున్నారని, మనుస్మృతికి సంబంధించి రాహుల్‌గాంధీ పార్లమెంటులోచేసిన ప్రకటన సనాతన ధర్మ అనుచరులందరినీ బాధకు గురిచేసిందన్నారు. అత్యాచార నిందితులను రక్షించే సూత్రంమనుస్మృతిలో ఉందని రాహుల్‌గాంధీ పార్లమెంటులో చెప్పారని శంకరాచార్య గుర్తుచేసారు. ఈ అంవంపై మూడునెలల క్రితం రాహుల్‌గాంధీకి నోటీసు పంపామని, మనుస్మృతిలో ఏంరాశారో స్పష్టంచేయాలనికోరినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకూ తమకు సమాధానం రాలేదని స్వామీజీ చెప్పారు. ఒక వ్యక్తి హిందూ గ్రంథాలను తరచూ అవమానిస్తూ అందుకు సంబంధించి వివరణ ఇవ్వకుండా ఉంటే ఆతడికి హిందూమతంలోస్థానం ఉండదన్నారు. తనను తాను హిందువు అని చెప్పుకునే అర్హత రాహుల్‌గాంధీకి ఇక లేదన్నారు.
శంకరాచార్యచేసిన ఈప్రకటన రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. భారతీయులు ఇష్టంగాపూజించే దైవం శ్రీరాముడు. ఈ దేశంలోని ఏ ఊరికి వెళ్లినా రామాలయం ఉంటుంది. అలాంటి రాముడిగురించి కాంగ్రెస్ నేతలు తరచూ తమ ఇష్టం వచ్చినట్లు మాట్లాడేస్తుంటే భారతీయ భక్తులు ఆవేదన చెందుతున్నారని స్వామీజీ అన్నారు.

# దిగ్బంధిస్తోన్న భారత్

>> పంజాబ్ ప్రావిన్స్‌కు ఇక్కడ నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇది స్వల్పకాల చర్యగా అక్కడి అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో అవసరమైతే భారత్ కఠిన చర్యలు తీసుకోగలదని పాక్‌కు తెలియజేసినట్లైందని చెప్పారు. బాగ్లిహార్ డ్యామ్‌ను 900 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి నిమిత్తం చినాబ్ నదిపై 2008లో నిర్మించారు. డ్యామ్ పొడవు దాదాపు 145 మీటర్లు కాగా, సింధు జలాల ఒప్పందం కింద పాక్‌కు అత్యధిక వాటా నీళ్లు లభించిన నదుల్లో చినాబ్ కూడా ఒకటి. పంజాబ్ ప్రావిన్స్‌లో ఎక్కువగా పంటపొలాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి. ఉగ్రదాడి జరిగిన తర్వాత ఏప్రిల్ 26న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపేసింది. ఆ తర్వాత 29 నాటికే ఈ డ్యామ్ నుంచి పాకిస్థాన్‌కు వెళుతున్న జలాలు నిలిచిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు బయటకు వచ్చాయి. పాక్‌లోని సియాల్ కోట్ వద్దకు వచ్చేసరికి చినాబ్ పూర్తిగా ఎండిపోయింది. పాక్‌లోని పంజాబ్‌లో పత్తి, వరి సాగుకు ఈ నీరు చాలా ముఖ్యం. గతవారం జీలంనది వరద ప్రవాహం పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భయపెట్టింది. అక్కడి ముజఫరాబాద్ సమీపంలో గతవారం జీలంనదిలో నీటిమట్టం ఒక్కసారిగా కొన్నిఅడుగులు పెరిగిపోయింది.దీంతోస్థానిక అధికారులు హట్టియాన్ బాలాఅనే ప్రాంతంలోఎమర్జెన్సీప్రకటించాల్సి వచ్చింది.

# బయాలజీ ప్రశ్నలు!

>> నిర్వహించారు. నీట్ ప్రశ్నాపత్రం గత ఏడాది కంటే కష్టంగా ఉన్నట్టు పరీక్షకు హాజరైన విద్యార్థులు చెబుతున్నారు. ప్రధానంగా బయాలజీ ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని.. దాంతోపాటు కెమిస్ట్రీకి చెందిన ప్రశ్నలు కూడా కొంచెం కష్టంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఈ సారి నీట్‌లో గత ఏడాది వచ్చినన్ని అత్యధిక మార్కులు రావనే అభిప్రాయాన్ని విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. అయితే దేశంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నీట్ పరీక్షను నిర్వహించారు. పరీక్షా కేంద్రానికి నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు పరీక్షా కేంద్రంలోనికి అనుమతించ లేదు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష మొదలవగా.. అరగంట ముందుగానే(1.30 గంటలకు) పరీక్షా కేంద్రాల గేట్లను మూసేశారు. ఇదే విషయాన్ని హాల్ టికెట్లలో ముందుగానే పేర్కొన్నప్పటికీ.. పలువురు అభ్యర్థుల పట్ల ఈ నిబంధన శాపంగా మారింది. పరీక్షా కేంద్రాల వద్దకు పలువురు అభ్యర్థులు ఒకటీ రెండు నిముషాల ఆలస్యంగా చేరుకోవడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. కరీంనగర్‌లో చోటుచేసుకున్న ఘటన హృదయవిదారకంగా ఉంది. వేములవాడకు చెందిన ఓ విద్యార్థిని కరీంనగర్‌లోని ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో నీట్ పరీక్ష రాసేందుకు తల్లిని వెంటబెట్టుకొని వచ్చింది. వారు పరీక్షా కేంద్రానికి 3 నిముషాల ఆలస్యంగా రావడంతో విద్యార్థిని అధికారులు లోపలికి అనుమతించలేదు. దీంతో తమ కూతురును లోపలికి అనుమతించాలని ఆమె తల్లి అధికారుల కాళ్ళవేళ్ళా పడటం చూసే వారి కంటతడి పెట్టించింది. తన బంగారం అమ్మి కూతురికి కోచింగ్ ఇప్పించానని, తన ఒక్కగానొక్క బిడ్డని డాక్టర్‌ను చేయాలనేది తమ కల అని కంటతడి పెట్టుకుంటూ అధికారులను వేడుకున్నది. దయచేసి లోపలికి అనుమతించాలని ఎంత వేడుకున్నా అధికారులు మాత్రం నిబంధనల ప్రకారం తాము ఏమీ చేయలేమని లోపలికి అనుమతించలేమని స్పష్టం చేయడంతో బాలిక, తల్లి ఇద్దరూ ఏడ్చుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సికింద్రాబాద్‌లోని వైఎంసిఏలోని న్యూగవర్నమెంట్ జూనియర్ కాలేజీలో నీట్ పరీక్షకు ఒక బాలిక నిమిషం ఆలస్యంగా వచ్చింది. అప్పటికే కాలేజీ గేట్లను మూసివేయడంతో.. అధికారులను కోరగా.. తాము అనుమతించలేమని చెప్పడంతో చేసేదిలేక వెనుదిరిగి వెళ్లిపోయింది.
ఆదివారం జరిగిన నీట్ పరీక్ష సందర్భంగా రాచకొండ పోలీసులు సకాలంలో జోక్యం చేసుకోవడంతో పొరపాటున వేరే పరీక్షా కేంద్రానికి వచ్చిన నీట్ అభ్యర్థిని ఆలస్యం చేయకుండా తనకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి చేర్చారు.

## భారత్‌పై అణుబాంబులతో దాడిచేస్తాం

### రష్యాలో కూర్చుని భారత్‌పై వాగుడు

**మాస్కో, మే 4:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఏ క్షణమైనా భారత ఆర్మీ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేయొచ్చు, లేదా రెండు దేశాల మధ్య యుద్ధ రావొచ్చు అనే విధంగా ఉంది ప్రస్తుత పరిస్థితి. ఈ క్రమంలో ఇండియాపై కచ్చితంగా అణుబాంబు దాడి చేస్తామంటూ పాకిస్థాన్ అంబాసిడర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒక విధంగా ఇండియాను రెచ్చగొట్టేలా ఆయన ప్రసంగించారు. అది కూడా రష్యా దేశంలో కూర్చొని ఆయన మాట్లాడారు. భారత్, పాకిస్థాన్‌లోని కొన్ని చోట్ల దాడులు చేస్తుందనే సమాచారం ఉందని అలా చేస్తే భారత్‌పై అణుబాంబులతో దాడి చేస్తామని రష్యాలోని పాకిస్థాన్ అంబాసిడర్ మహ్మద్ ఖలీద్ జమాలీ అన్నారు. భారత్ దాడి చేస్తే తాము పూర్తిస్థాయిలో దాడికి దిగుతామంటూ వార్నింగ్ ఇచ్చారు. మరి ఈ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో దీనికి పాకిస్థాన్ ప్రభుత్వం ఏ విధంగా వివరణ ఇస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గిరిజాప్రియదర్శిని కన్నుమూత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** హైకోర్టు న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. గిరిజా ప్రియదర్శిని మృతి పట్ల తోటి జడ్జిలు, న్యాయవాదులు, హైకోర్టు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఎపిలోని విశాఖపట్నంకు చెందిన గిరిజా ప్రియదర్శిని.. 1995లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. విశాఖ జిల్లా కోర్టులో ఏడేళ్లు ప్రాక్టీస్ చేశారు. 2008లో జిల్లా అడిషనల్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం ఫ్యామిలీ కోర్టులో మూడేళ్లు, విజయనగరం మొదటి అదనపు జడ్జిగా, నంద్యాలలో అదనపుజిల్లా జడ్జిగా పనిచేశారు. 2017లో ఒంగోలు జిల్లా కోర్టు చీఫ్‌గా పదోన్నతి పొందారు. ఆదిలాబాద్ జిల్లాకోర్టు చీఫ్‌జడ్జిగా పనిచేశారు. ఆ తర్వాత కరీంనగర్ జిల్లాకోర్టు చీఫ్‌జడ్జిగా పనిచేశారు. ఆ తర్వాత 2022లో హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు.

# పాక్‌తో యుద్ధం అనివార్యమైతే సొంత బలంతో చేయాలి

### అన్నింటిని తట్టుకునే దృఢత్వం ఉండాలి: నిపుణుల వెల్లడి

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్తాన్‌పై భారత్ దాడికి దిగుతుందని, దీనికి ప్రతిగా పాక్ కూడా భారత్‌పై దాడి చేస్తుందని, దీని పర్యవసానంగా ఇరు దేశాల మధ్య యుద్ధం వస్తుందని వార్తలు వస్తుండడం తెలిసిందే. ప్రధాని మోదీ పహల్గాం ఉగ్రదాడి తరువాత త్రివిధ దళాల అధికారులతో వరుసగా భేటీ అయి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రకటించడం విదితమే. ఇదే సమయంలో పాకిస్తాన్‌లో అయితే పరిస్థితులు భిన్నంగా వున్నాయి. భారత్ తమపై కచ్చితంగా దాడి చేస్తుందని, తాము ప్రతీకారం తీర్చుకుంటామని, అవసరమైతే అణ్వాయుధాలు వాడుతామని అక్కడి మంత్రులు, సైన్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్, పాక్‌ల మధ్య నిజంగానే యుద్ధం వస్తుందా? ఒకవేళ వస్తే పరిస్థితులు ఎలా వుంటాయి? అనే దానిపై నిపుణులు పలు రకాలుగా స్పందించారు. ఇందులో 2017-23 మధ్య పాకిస్తాన్‌లో భారత రాయబారిగా పనిచేసిన అజయ్ బిసారియా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ పాకిస్తాన్‌తో యుద్ధం అంటూ వస్తే ప్రజల భావోద్వేగాలు, మానసిక పరిస్థితులు దీనిని నిర్దేశించకూడదని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా యుద్ధం కానీ దాని టైమింగ్ కానీ ఉండకూడదని ఆయన తెలిపారు. యుద్ధం అంటూ సంభవిస్తే, ఇది విజయవంతం కావాలంటే మూడు అంశాలు ముఖ్యమని ఆయన తెలిపారు. ఇందులో వేగంతో పాటు శత్రువులు ఊహించని విధంగా అనూహ్యంగా దాడులు చేయడం, దాడులకు సంబంధించిన అంశాలు గోప్యంగా ఉంచడం ముఖ్యమని బిసారియా తెలిపారు. యుద్ధం అనివార్యమైతే సొంతంగా నిర్ణయాలు తీసుకోవాలని, సొంత బలంతోనే యుద్ధం చేయాలని, ఇతర దేశాలు సహాయం చేస్తేనే యుద్ధం కొనసాగించే పరిస్థితులు ఉండకూడదని ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో యుద్ధ సమయంలో ఎదురయ్యే ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా తట్టుకునే సామర్థ్యం ఉండాలని ఆయన వెల్లడించారు.

ఒక్కోసారి పరిస్థితులు అదుపుతప్పితే సుదీర్ఘకాలం యుద్ధాన్ని చేయాల్సి ఉంటుందని, ఇందుకు పటిష్టమైన రాజకీయ సంకల్పం, జాతి సంకల్పం, మద్దతు అవసరం ఉంటుందని ఆయన విశ్లేషించారు. అయితే యుద్ధం వల్ల ఒక్కోసారి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని వ్యూహాత్మక వ్యవహారాల నిపుణుడు సుశాంత్ సరీన్ వెల్లడించారు. ఇరు దేశాలు ఒకరిపై మరొకరు క్షిపణులతో దాడులకు దిగే పరిస్థితులు ఏర్పడితే ఇరు దేశాలకు చెందిన కొన్ని నగరాలపై దీని ప్రభావం ఉంటుందని ఆయన హెచ్చరించారు. క్షిపణుల దాడులు జరిగితే పాక్‌లో లాహోర్, ఇస్లామాబాద్, కరాచీ, రావల్పిండి నగరాలు, భారత్‌లో ముంబయి, ఢిల్లీ నగరాలు దాడులకు గురయ్యే వీలుంటుందని ఆయన తెలిపారు.

అనేక సందర్భాల్లో భారత్‌కు బాసటగా నిలిచే రష్యా భారత్‌కు ఈ సమయంలో అండగా నిలిచే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో పాక్‌కు అన్ని రకాలుగా అండగా వున్న చైనా కూడా ఆ దేశానికి నేరుగా సహాయం చేయకపోవచ్చని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు ఇందుకు కారణంగా ఆయన అభివర్ణించారు.

## 16న అమెరికాకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 16 నుంచి 23వరకు అమెరికాలో పర్యటించనున్నారు. తమ కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్సీ కవిత–అనిల్ దంపతులు ఈ నెల 16న అమెరికాకు బయలుదేరనున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత ఈ నెల 23న తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. అయితే, ఈ విదేశీ పర్యటనకు ఢిల్లీలోని రౌజ్ ఎవెన్యూ సిబిఐ ప్రత్యేకకోర్టు అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

## నేటి నుండి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రైతాంగానికి సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించేవిధంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే నూతన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 5 నుండి జూన్ 13 వరకు రాష్ట్రంలోని సుమారు 1200 గ్రామాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి దాదాపు 200 పైగా వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. దక్షి ణ తెలంగాణ మండలాల్లో సుమారు 100 బృందాలు, ఉత్తర మరియు మధ్య తెలంగాణ మండలాల్లో దాదాపు 50 బృందాలు పాల్గొంటాయన్నారు. ఒక్కో బృందం వారి రోజూవారి కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు, వారంలోని పని దినాలలో ఉదయం 8 నుండి 12 గంటల వరకు ఎంపిక చేసుకున్న గ్రామాలలోని రైతు వేదికలతో పాటు, ఇతర ప్రదేశాల్లో రైతులకు యూరియా, రసాయనాల వినియోగం, సాగు నీటి ఆదా, పంటల మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అంశాలతో పాటు రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళకు సూచనలు మరియు సలహాలు అందజేస్తారు. ఒక్కో బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలతో పాటు, వ్యవసాయ విద్యార్థులు, అధికారులు, ఇతర స్థానిక ప్రభుత్వ అధికారులు, అభ్యుదయ రైతులు, సంఘాలు పాల్గొంటారని వెల్లడించారు.




పోలీసుల సాయంతో పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరిన అభ్యర్థిని

## హైదరాబాద్ శివార్లలో ప్రశాంతంగా నీట్ ప్రవేశపరీక్ష

### అభ్యర్థికి అండగా నిలిచిన పోలీసులు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మే 4, ప్రభాతవార్త:** వైద్య విద్యకు సంబంధించిన కోర్సుల్లో ప్రవేశాలకు కోసం చేపట్టే జాతీయ స్థాయి అర్హత పరీక్ష నీట్ ( నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్ టెస్ట్) పరీక్ష బాలాపూర్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాశారు. అయితే పరీక్షకు నిమిషాల తేడాలో ఆలస్యంగా వచ్చిన కొందరు విద్యార్థులను అధికారులు అనుమతించలేదు. పరీక్ష సందర్భంగా రాచకొండ పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

**పొరపాటున మరో కేంద్రానికి వచ్చిన అభ్యర్థికి పోలీసుల సాయం**

కాగా నీట్ పరీక్ష రాయడానికి వచ్చిన ఓ అభ్యర్థిని నిర్దేశించిన కేంద్రానికి బదులు పొరపాటున మరో కేంద్రానికి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా దేవహాసిని అనే అభ్యర్థిని బాలాపూర్ మల్లాపూర్ సమీపంలోని ఆర్‌సిఐ డిఫెన్స్ లాబొరేటరీ స్కూల్ వద్దకు ఒంటి గంట సమయంలో తండ్రితో కలిసి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆమె హాల్ టిక్కెట్‌ను పరిశీలించిన అక్కడి సిబ్బంది కంచన్‌బాగ్‌లోని డిఫెన్స్ లాబొరేటరీ స్కూల్‌లోని సెంటర్‌కు వెళ్ళాల్సిన సదరు అభ్యర్థిని పొరపాటున ఇక్కడి సెంటర్‌కు వచ్చినట్లు గ్రహించారు. ఈ మేరకు స్పందించిన బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్ మహేశ్వరం అడిషనల్ డిసిపి, ఎసిపిల సూచనల సూచనల మేరకు రక్షక్ వాహనంలో కంచన్‌బాగ్‌కు సదరు అభ్యర్థినిని తరలించారు. నిర్ణీత సమయంలో లోపు ఆమెను అక్కడికి చేర్చడంతో పరీక్ష రాయగలిగింది. అయితే పోలీసుల సాయంపై అభ్యర్థిని, ఆమె తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.

## త్యాగరాజస్వామి పంచరత్నాలు సదా స్మరణీయం

### ఎల్‌బి స్టేడియంలో ఘనంగా జయంతి వేడుకలు

### పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు




**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త :** కర్ణాటక సంగీత ప్రియులకు, సంగీతాన్ని ఊపిరిగా భావించే వారికి త్యాగరాజు పూజనీయుడని, ఆయన కర్ణాటక శాస్త్రీయ సంగీత సామ్రాజ్యాన్ని అధిరోహించడం తెలుగువారికి గర్వకారణమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఎల్బీ (ఇండోర్) స్టేడియంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రముఖ ముఖ వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. త్యాగయ్య రచించిన పంచరత్నాలను వింటూ త్యాగయ్యని స్మరించుకోవడం ఎంతో గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. గ్రామగ్రామాన త్యాగరాజస్వామి కీర్తనలకు బహుళ ప్రచారంకల్పించడానికి తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. నేటి యువత ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడికి గురవుతున్నారని, మానసిక ఒత్తిడి, అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీలకు, ఫోన్‌లకు అతుక్కుపోయి తనకు తాను సమయం కేటాయించుకోవడం లేదని అన్నారు. క్రీడలు, శారీరక వ్యాయమం, సంగీతం, డ్యాన్స్ వంటివి ఒత్తడిని తగ్గిస్తాయని, సాధనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ప్రముఖ సంగీత విద్వాంసులు ఆలపించిన త్యాగరాజ కీర్తనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య పుంజాల, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, పద్మశ్రీ శోభారాజు, పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వర రావు, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత అయ్యగారి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు

## వచ్చే ఖరీఫ్ నుండి తక్కువ ధరలకు ఎరువులు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** వచ్చే ఖరీఫ్ సీజను నుండి రైతులకు తక్కువకే ఎరువులను అందించేలా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందుకు గాను రూ.37,216 కోట్ల సబ్సిడీని మంజూరు చేసింది. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఫాస్ఫరస్, పొటాషియం తదితర ఆధారిత ఎరువులను రైతులకు తక్కువ ధరకే విక్రయించేలా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి నుండి సెప్టెంబర్ 31 వరకు పొటాషియం, ఫాస్ఫరస్ ఎరువులను సబ్సిడీ వర్తించనుంది. ఈ నేపథ్యంలో రైతులకు అతి తక్కువ ధరలోనే వారికి ఎరువులు లభిస్తాయి. ఇక కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ కేటాయింపులో రూ.1,91,836 కోట్లకు పైగా ఎరువుల శాఖకు కేటాయింపులు పెంచింది. ప్రధానంగా రైతులకు డిఏపి సజావుగా అందించేలా చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం కేంద్ర రసాయన ఎరువుల శాఖా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం డీఏపీ ఎరువుల ధరలను స్థిరంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అంతేకాకుండా రైతులకు పంట ఉత్పత్తిలో ఎరువులను అందుబాటులో ఉంచటంతో వారికి భారీ ఉపశమనం లభిస్తుందని భావిస్తోంది. తక్కువ ధరలోనే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ ఎరువుల వల్ల రైతులకు అధిక భారం పడకుండా ఉంటుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

## టిజి సెట్-2025 ఫేజ్-2 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన టిజి సెట్–2025 ఫేజ్–2 ఫలితాలను ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి, టిజి సెట్–2025 చీఫ్ కన్వీనర్ డాక్టర్ అలగు వర్షిణి ఆదివారం విడుదల చేశారు. 5వ తరగతి గురుకుల సెట్ 2025 ఫేజ్–2 ఫలితాలను విడుదల చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజీఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్) ఆధ్వర్యంలో ఎస్సీ గురుకులాలు, గిరిజన గురుకులాలు, బిసి గురుకులాలు, గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 5వ తరగతిలో ప్రవేశం కొరకు ఈ యేడాది ఫిబ్రవరి 23న రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారి ఫలితాలను మొదటి ఫేజ్‌లో రెండు దఫాలుగా విడుదల చేయడం జరిగింది. మిగిలిన వివిధ కేటగిరీలకు చెందిన 13,130 సీట్ల ఫలితాలను ఆదివారం విడుదల చేసినట్టు టిజి సెట్–2025 చీఫ్ కన్వీనర్ విఎస్ అలగు వర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థుల జాబితా కోసం ఎస్సీ గురుకుల అధికారిక వెబ్ సైట్‌నందు ఫలితాలను చూసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## అంబర్‌పేట్ ఎస్‌టిపిని సందర్శించిన సిఎస్

**తుదిదశకు మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలు**

**దుర్వాసన కట్టడికి సాంకేతికత వినియోగం**

**జూన్ నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు:**

**జలమండలి ఎండి అశోక్‌రెడ్డి**

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** ఎస్‌టిపి నిర్మాణ ప్రాజెక్టు ప్యాకేజ్–1లో భాగంగా అంబర్ పేట్‌లో నిర్మిస్తున్న 212.5 ఎంఎల్‌డి సివరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టిపి) నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సందర్శించారు. ఇటీవల భాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైదరాబాద్ నగరంలో పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పథకాలతో పాటు జలమండలి నిర్మిస్తున్న ఎస్‌టిపి పనుల పురోగతిని పరిశీలించారు. మొదటగా పిటియు (ప్రైమరీ ట్రీట్మెంట్ యూనిట్)ను సందర్శించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐఎన్‌డి, స్ప్లిటర్ బాక్స్, కనెక్టింగ్ చానెల్స్ ఎస్బిఆర్ బేసిన్స్, సిసిటి తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జల మండలి ఎండి అశోక్ రెడ్డి మురుగు శుద్ధి ప్రక్రియ, వివిధ దశలు వివరిస్తూ జూన్‌లో పనులను వేగంగా పూర్తి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని, ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే దేశంలో 98 శాతం సీవరేజి ట్రీట్‌మెంట్ చేస్తున్న ఏకైక నగరంగా హైదరాబాద్ నిలవనుందని తెలిపారు. జిహెచ్‌ఎంసిలోనే కాకుండా ఓఆర్ఆర్ పరిధిలో అమృత్ 2.0 ప్రాజెక్టు భాగంగా మరో 39 ఎస్‌టిపిలను నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికల సిద్ధం చేశామని ప్రస్తుతం టెండర్ దశలో ఉందని ఈ సందర్భంగా అశోక్ రెడ్డి సిఎస్ కు వివరించారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణరావు మాట్లాడుతూ ఎస్‌టిపిల్లో వెలువడే దుర్వాసన వాళ్ల ప్రజలకు ఇబ్బందిరాకుండా చర్యలు తీసుకోవాలి సూచించారు. ఎస్‌టిపిల చుట్టూ నివసించే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎస్‌టిపిల నుంచి దుర్వాసన రాకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అశోక్‌రెడ్డి చెప్పారు. దీనికోసం విదేశీ సాంకేతి కతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌టిపిల్లో మురుగు శుద్ధిలోని ప్రతిదశ జలమండలి ప్రధాన కార్యాలయానికి సానుసంధానం అనుసంధానం కావడంతో వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తామని పిసిబి సైతం ఆన్‌లైన్ వివరాలు అందుబాటులో ఉంటాయని సిఎస్‌కు అధికా రులు వివరించారు. సిఎస్ తో పర్యటనలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఈడి మయాంక్ మిట్టల్, హెచ్‌ఎండిఏ కమి షనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసి కమీషనర్ కర్ణన్‌లతో పాటు జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, సిజిఎంలు ప్రభు, వినోద్ భార్గవ, సుజాత, జీఎంలు సుబ్రహ్మణ్యం, శ్యాం సుందర్ నాయక్, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు punjab national bank
...the name you can BANK upon!
సాధారణ పరిపాలన విభాగం–జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ–కా–పూల్, హైదరాబాద్–500004. ఈ–మెయిల్: zohydgad@pnb.co.in ఫోన్: (040)-24475113/18
ఎంపానెల్‌మెంట్ నోటీసు
పంజాబ్ నేషనల్ బ్యాంక్, హైదరాబాద్ జోనల్ ఆఫీస్, "వివిధ కేటగిరీల పనుల కోసం ఆర్కిటెక్ట్‌లు/ఆర్కిటెక్చరల్ సంస్థలను ఎంప్యానెలింగ్ చేయడానికి దరఖాస్తులను" ఆహ్వానిస్తుంది.
అర్హత, నిబంధనలు & షరతులు మరియు దరఖాస్తు ఫారమ్‌ల వివరాలు బ్యాంక్ వెబ్‌సైట్ https://www.pnbindia.in/Tender.aspxలో అందుబాటులో ఉన్నాయి. వీటిని 05.05.2025న 10:00 గంటల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
మద్దతునిచ్చే అన్ని పత్రాలతో నిర్ణీత నమూనాలో పూర్తి చేసిన పత్రాలను "చీఫ్ మేనేజర్, GAD, పంజాబ్ నేషనల్ బ్యాంక్, జోనల్ ఆఫీస్: హైదరాబాద్, 6-1-73, రెండవ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ–కా–పూల్ - 500 004"కి 04.06.2025 నాటికి సాయంత్రం 5.00 గంటల లోగా పంపవలెను.
బ్యాంకు ప్రస్తుత ప్యానెల్‌లోని అన్ని ఆర్కిటెక్ట్/ఆర్కిటెక్చరల్ సంస్థలన్నీ ఈ జాబితా ప్రక్రియలో పరిశీలించబడుటకు తాజాగా దాఖలు చేసుకొనవలసి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్యానెళ్లు నూతన ప్యానెళ్లు ఆమోదం పొందిన తరువాత రద్దు అవుతాయి.
పైన పేర్కొన్న పనికి సంబంధించి ఏదైనా సవరణ/స్పష్టీకరణ పైన పేర్కొన్న బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే విడుదల చేయబడతాయి. కావున బ్యాంకు వెబ్ సైట్ ను తరచుగా సందర్శించగలరు.
చీఫ్ మేనేజర్

## టెట్ పరీక్షలపై టి-శాట్ స్పెషల్ క్లాసులు

### 50 రోజులు 200 ఎపిసోడ్లు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) పరీక్షలపై టి-శాట్ స్పెషల్ క్లాసులను ప్రసారం చేయనుంది. ఇందుకు సంబంధించి స్పెషల్ లైవ్‌ను నేడు(సోమవారం మే 6న) నిపుణ ఛానల్‌లో ప్రసారం చేయనున్నారు. టెట్ పరీక్షల కోసం మొత్తంగా 50 రోజులు 200 ఎపిసోడ్‌లు ప్రత్యేక ప్రసారాలు చేయనున్నట్టు టి-శాట్ సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జూన్‌లో నిర్వహించబోయే టెట్‌పై టి-శాట్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నేడు (సోమ వారం) ఉదయం 11 గంటలకు ప్రసారం చేయనున్నట్టు తెలిపారు. టి-శాట్ నిపుణ ఛానల్ ప్రత్యేక లైవ్ కార్యక్రమంలో ప్రధాన సబ్జెక్టులకు సంబంధించి నలుగురు నిపుణులు పాల్గొంటారని, పరీక్షలో ప్రధానంగా ఎదుర్కోబోయే సమస్యలు, సమయపాలన, పరీక్ష రాసే విధానం తదితర జాగ్రత్తలు సబ్జెక్టుల వారీగా వివరిస్తారన్నారు. జూన్ 15 నుంచి 30వ వరకు 15 రోజుల పాటు ప్రభుత్వం నిర్వహించే పరీక్షలపై అభ్యర్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు లైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ సందేహాలకు సమాధానాల కోసం 040-23540326/726.. టోల్‌ఫ్రీ 1800 4254039 నెంబర్లకు కాల్ చేయాలని సిఇఒ వేణుగోపాల్‌రెడ్డి అభ్యర్థులకు సూచించారు. టెట్ అభ్యర్థులకు టి-శాట్ అరగంట నిడివిగల ప్రత్యేక పాఠ్యాంశాలను సుమారు 200 ఎపిసోడ్‌లు సిద్ధం చేసి ప్రసారం చేస్తోందన్నారు.

టి-శాట్ విద్య ఛానల్‌లో ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు, నిపుణ ఛానల్ సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు ప్రసారాలు కొనసాగుతాయన్నారు. టెట్ పరీక్ష రెండు పేపర్లకు సంబంధించి లాంగ్వేజెస్‌తోపాటు పెడగాజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, చైల్డ్ డెవెలప్‌మెంట్ సబ్జెక్టులలో విడియో పాఠ్యాంశాలను ప్రసారం చేస్తున్నామన్నారు. అభ్యర్థులు టి-శాట్ అందించే కంటెంట్‌ను సద్వినియోగం చేసుకుని, డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలని సిఇఒ సూచించారు.

**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్** NIWAS HOUSING FINANCE
(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం-కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్టు చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద ప్రకటన
NHFPL ఈ క్రింది రుణగ్రహీతలకు నివాసిత గృహాల యొక్క తనఖా పై గృహ రుణం/తనఖా రుణం/నిర్మాణ రుణం మంజూరు చేసింది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్/RBI యొక్క మార్గదర్శకాలు మరియు ఆదేశాలను అనుసరించి సదరు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో వారి ఖాతాలను ఫైనల్‌గా నిరర్థక ఆస్తులుగా వర్గీకరించడమైనది. అందువలన NHFPL సర్ఫాసి చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద హక్కులను వినియోగిస్తూ వారికి చట్ట ప్రకారం నోటీస్ జారీ చేస్తూ ఆ రుణగ్రహీతలను రుణ బకాయి మొత్తాలను వారికి ఎదురుగా పేర్కొన్న రుణ బకాయి మొత్తం డిమాండ్ నోటీస్ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇవ్వడమైనది. ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు ఇందుమూలముగా ఈ ప్రచురణ ద్వారా పిలుపు ఇచ్చునది ఏమనగా వారికి ఎదుటగా పేర్కొన్న రుణ బకాయి మొత్తాలను తదుపరి ఛార్జీలు మరియు తిరిగి చెల్లింపు వరకు అయిన వడ్డీతో సహా సదరు డిమాండ్ నోటీస్ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఇందుమూలముగా పిలుపు ఇవ్వడమైనది. విఫలమైతే NHFPL చట్టప్రకారం బకాయి మొత్తం రికవరికి ఆస్తుల స్వాధీనం, డిస్పోజ్/అమ్మకం అన్నీ లేదా ఏదైనా తదుపరి చర్యలకు ఉపక్రమించి చెల్లించవలసిన రుణ బకాయి మొత్తాన్ని రుణ ఒప్పందం యొక్క చట్ట నిబంధనల ప్రకారం తిరిగి వసూలుకు ఉపక్రమిస్తుందని ఇందుమూలముగా హెచ్చరించడమైనది. రుణగ్రహీతలు ఆస్తుల యొక్క ఓనర్‌షిప్‌పై థర్డ్ పార్టీ ఆసక్తి సృష్టించడం లేదా పరాధీనం చేయడం వంటి చర్యలు చేపట్టవద్దని హెచ్చరిస్తూ అదుపు చేయడమైనది.

| క్ర. సం. | స్థానం / రుణ ఖాతా నంబర్ | రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీతలు/హామీదారు | డిమాండ్ నోటీస్ పంపిన తేది | డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం |
|---|---|---|---|---|
| 1 | హైదరాబాద్ LB నగర్ LNLBN0HL-12190012750, LNLBN0HL-12190012751 | సుభాష్ పి. (రుణగ్రహీత) రాజేశ్వరి పొట్లాబత్తిని (సహ-రుణగ్రహీత) | 18-ఏప్రిల్ 2025 | రూ.1199747/- (రూపాయలు పదకొండు లక్షల తొంభై తొమ్మిది వేల ఏడు వందల నలభై ఏడు మాత్రమే) |
| | ఆస్తి యొక్క వివరణ : వనస్థలిపురం, రిజిస్ట్రేషన్ ఉప-జిల్లా, బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీ క్రింద రంగారెడ్డి జిల్లా ప్రస్తుత అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండలం, పూర్వపు హయత్‌నగర్ రెవెన్యూ మండలం, H/O తొర్రూరు గ్రామంలో, బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న సర్వే నం.లు 341/A మరియు 341/Eలో ప్లాట్ నం.లు. 9, 10, 15 మరియు 14పై నిర్మింపబడిన (620 చ.గజాలలో నుంచి) 18 చ.గ" లేదా దాని సమానం 15.04 చ.మీ" కొలత భూమి యొక్క అవిభాజ్య వాటాతో 100 చ.అ"లో 4 వీలర్ పార్కింగ్ ఏరియా మరియు (కామన్ ఏరియా కలుపుకొని) 570 చ.అ" ప్లింత్ ఏరియా కలిగి JKV-10 హైట్‌లో ఉన్న రెండవ అంతస్తులోని సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ నం.204 కలిగిన ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు ఈ విధంగా: తూర్పు: ప్లాట్ నం.11, 12 మరియు 13, పడమర: పొరుగువారి భూమి, ఉత్తరం: 30 వెడల్పు రోడ్, దక్షిణం: 30 వెడల్పు రోడ్ ఫ్లాట్‌కు సరిహద్దులు: తూర్పు: 6 అ" కామన్ దారి/ఎంట్రన్స్, పడమర: బహిరంగం, ఉత్తరం: బహిరంగం, దక్షిణం: ఫ్లాట్ నం.203. | | | |
| 2 | బోడుప్పల్ LNBODLAP-11230037703 | మాచెన్‌దర్ రెడ్డి ముద్దసాని (రుణగ్రహీత) రామ ముద్దసాని (సహ-రుణగ్రహీత) | 18-ఏప్రిల్ 2025 | రూ.798620/- (రూపాయలు ఏడు లక్షల తొంభై ఎనిమిది వేల ఆరు వందల ఇరవై మాత్రమే) |
| | ఆస్తి యొక్క వివరణ : యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, మొగిల్లిపాక వద్ద ఉన్న గ్రామకంఠం, RCC గ్రౌండ్ ఫ్లోర్ యొక్క 540.0 చ.అ" యొక్క ప్లింత్ ఏరియా, 100.00 చ.గజాల కొలత (అసైన్‌మెంట్ నం.6) ఇ.నం.1–6 కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు ఈ విధంగా: తూర్పు: బహిరంగ ప్రదేశం సత్యం, పడమర: సిసి రోడ్, ఉత్తరం ముద్దసాని భూపాలరెడ్డి యొక్క బహిరంగ ప్లాట్, దక్షిణం: ముద్దసాని రఘుపతిరెడ్డి యొక్క ఇల్లు. | | | |
| 3 | సంగారెడ్డి LNSGRLAP-11230037964 | శ్రీనివాస్ చిన్నానగల్ల (రుణగ్రహీత) సంతోషా చిన్నానగల్ల (సహ-రుణగ్రహీత) | 18-ఏప్రిల్ 2025 | రూ.1166759/- (రూపాయలు పదకొండు లక్షల అరవై ఆరు వేల ఏడు వందల యాభై తొమ్మిది మాత్రమే) |
| | ఆస్తి యొక్క వివరణ : మెదక్ జిల్లా రిజిస్ట్రేషన్, రామాయంపేట S.R.O మరియు మెదక్ జిల్లా, శంకరంపేట మండలం, అంగరాయి వద్ద ఉన్న 651.61 చ.అ" బిల్టప్ ఏరియా RCC నిర్మించబడిన 115.98 చ.గ" లేదా 97.01 చ.మీ" విస్తీర్ణం ఏరియా మొత్తం 1-2/61 ఇ.నం. కలిగిన ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు: తూర్పు: గ్రామం యొక్క రోడ్, పడమర: చిన్నగల్ల రమేష్ ఇల్లు, ఉత్తరం: చిన్నగల్ల జయరాజ్ ఇల్లు, దక్షిణం: గ్రామ పంచాయతీ సిసి రోడ్. | | | |
| 4 | బోడుప్పల్ LNBODOHL-12230038430 | అజయ్‌కుమార్ నకర్కంటి (రుణగ్రహీత) ఉల్హార పల్లవి (సహ-రుణగ్రహీత) నకర్కంటి రమాదేవి (సహ-రుణగ్రహీత) | 18-ఏప్రిల్ 2025 | రూ.1529883/- (రూపాయలు పదిహేను లక్షల ఇరవై తొమ్మిది వేల ఎనిమిది వందల ఎనభై మూడు మాత్రమే) |
| | ఆస్తి యొక్క వివరణ : తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ క్రింద బాలాపూర్ రెవెన్యూ మండలం, నాదర్‌గుల్ గ్రామం వద్ద ఉన్న RCC పైకప్పుతో 574 చ.అ" మొత్తం ప్లింత్ ఏరియా 287 చ.అ" యొక్క ప్లింత్ ఏరియా 287 చ.అ" మరియు మొదటి అంతస్తు యొక్క ప్లింత్ ఏరియా గ్రౌండ్ ఫ్లోర్ కలిగిన 72 చ.గ" లేదా 60.19 చ.మీ" కొలత భూమిపై (Ptin No.1177003497) ఇ.నం.477 కలిగిన ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు: తూర్పు: 14 అ" వెడల్పు రోడ్, పడమర: 4-76 నం. కలిగిన ఇల్లు, ఉత్తరం: 10 అ" వెడల్పు రోడ్, దక్షిణం: 10 అ" వెడల్పు రోడ్. | | | |
| 5 | మేడ్చల్ LNMEDOHL-02240040289 | భాగ్యలక్ష్మి గోకుల (రుణగ్రహీత) MR శ్రీకాంత్ గోకుల (సహ-రుణగ్రహీత) | 18-ఏప్రిల్ 2025 | రూ.1604846/- (రూపాయలు పదహారు లక్షల నాలుగు వేల ఎనిమిది వందల నలభై ఆరు మాత్రమే) |
| | ఆస్తి యొక్క వివరణ : యాదాద్రి భువనగిరి Z.P.P, బీబీనగర్ M.P.P, GP కొండమడుగు, నల్గొండ జిల్లా రిజిస్ట్రార్, బీబీనగర్ ఉప జిల్లా రిజిస్ట్రార్, యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, కొండమడుగు గ్రామం వద్ద ఉన్న 150 చ.గ" లేదా సమానమైన 125.5 చ.మీ" ఏరియా కొలత (05 సం"ల బిల్డింగ్ వయసు మరియు 600 S.F.T యొక్క ACC షీట్ రూఫ్‌తో ఓపెన్ యార్డ్ మరియు రెండు గదులు కలిగినది) (అసెస్‌మెంట్ నం.1180) ఇ.నం.7-81 కలిగిన ఆస్తి యొక్క మొత్తం అదంతా. మరియు బ్లాక్ 7 మాధవరెడ్డి కాలనీ మొత్తం హద్దుగా కలిగినది. సరిహద్దులు ఈ విధంగా: తూర్పు: ఆదెపు కృష్ణ యొక్క ఇల్లు, పడమర: సిద్దుల కృష్ణ యొక్క ఇల్లు, ఉత్తరం: గండ్ల కృష్ణ యొక్క ఇల్లు, దక్షిణం: GP రోడ్. | | | |
| 6 | బోడుప్పల్ LNBODOHL-06240044681 | శ్రీరాములు పాస్నామ్ (రుణగ్రహీత) అనితా పాస్నామ్ (సహ-రుణగ్రహీత) | 18-ఏప్రిల్ 2025 | రూ.1560673/- (రూపాయలు పదిహేను లక్షల అరవై వేల ఆరు వందల డెబ్బై మూడు మాత్రమే) |
| | ఆస్తి యొక్క వివరణ : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం, పోచారం మునిసిపాలిటీ క్రింద పోచారం గ్రామం వద్ద ఉన్న 864.90 చ.గజాలు ఏరియా, మొత్తం బ్లాక్ ఏరియా యొక్క దానిలో 28.83 చ.గజాల భూమి యొక్క అవిభాజ్య వాటాతోసహా LIG కాలనీ AP హౌసింగ్ బోర్డ్ వద్ద పోచారం గ్రామం యొక్క పార్ట్ 10 సర్వే నం.లో 512 చ.అ" లేదా 47.50 చ" మీటర్లు కొలత Ptin No.1228304938, ఇ.నం.11-3/405, 3వ అంతస్తులో ఫ్లాట్ నం.405 కలిగి ఉన్న A3లో, LIG ఫ్లాట్ టైప్ A ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఈ విధంగా సరిహద్దులు: తూర్పు: అనుబంధ భూమి, పడమర: అనుబంధ భూమి బ్లాక్ నం.4A, ఉత్తరం: అనుబంధ భూమి, దక్షిణం: అనుబంధ భూమి మరియు 40-0 వెడల్పు రోడ్, 3వ అంతస్తులోని ఫ్లాట్ నం.405 యొక్క సరిహద్దులు: తూర్పు: ఫ్లాట్ నం.406, పడమర: బహిరంగం, ఉత్తరం: బహిరంగం, దక్షిణం: 6-0 వెడల్పు కారిడార్ మరియు ఫ్లాట్ నం.404. | | | |
| 7 | సంగారెడ్డి LNSGROHL-09240048020 | లింగంపల్లి ప్రకాశం (రుణగ్రహీత) లింగంపల్లి అనితా (సహ-రుణగ్రహీత) | 18-ఏప్రిల్ 2025 | రూ.744141/- (రూపాయలు ఏడు లక్షల నలభై నాలుగు వేల ఒక వంద నలభై ఒకటి మాత్రమే) |
| | ఆస్తి యొక్క వివరణ : తెలంగాణ రాష్ట్రం, వికారాబాద్ జిల్లా, మోమిన్‌పేట గ్రామం మరియు మండలం వద్ద ఉన్న మొత్తం విస్తీర్ణం 450 చ" అడుగుల లేదా 50 చ.గజాలు లేదా 41.80 చ" మీటర్లు ఓపెన్ ఏరియా కలుపుకొని, 358.32 చ.అడుగులు లేదా 39.81 చ.మీటర్లు ప్లింత్ ఏరియా గ్రౌండ్ ఫ్లోర్ RCCతో నిర్మించబడిన ఇ.నం.9-135/సి కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు ఈ విధంగా: తూర్పు: జి మల్లయ్య యొక్క ఇల్లు, పడమర: వెడల్పు రోడ్, ఉత్తరం: ఎల్.సత్యనారాయణ యొక్క బహిరంగ స్థలం, దక్షిణం: నజీర్‌పాషా యొక్క బహిరంగ స్థలం. | | | |

ప్రదేశం : హైదరాబాద్, బోడుప్పల్, మేడ్చల్, సంగారెడ్డి, తెలంగాణ
తేదీ : 05.05.2025
సం/- అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున

# ఇప్పుడిప్పుడే ముందుకెళ్తున్న ఆర్టీసి

### కార్మికులు ఎప్పుడు వచ్చినా చర్చలకు సిద్ధంగా ఉన్నా

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్




హుస్నాబాద్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, మే 4, ప్రభాతవార్త :** ఆర్టీసి సంస్థ, పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం మూడింటికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్ స్టాండ్‌ను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి కార్మికుల సమస్యలు ప్రభుత్వ దృష్టిలో ఉన్నాయని సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకుంటామన్నారు. ఆర్టీసి కార్మికులకు ఎలాంటి సమ స్యలు వచ్చిన తనతో మాట్లాడాలని సూచించారు.

ఆర్టీసి మా కుటుంబమని.. కుటుంబ పెద్దగా సమస్యలను పరిష్కారం చేసు కుంటామన్నారు. ఆర్టీసి కార్మికులు సైతం చర్చలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈనెల 5,6వ తేదీలలో తాను హైదరాబాద్‌లోనే ఉంటానని ఆర్టీసి ఉద్యోగులు ఎవరైనా ఎప్పుడైనా తనను కలిసి సమస్యలపై చర్చించవచ్చునని తెలిపారు. ప్రజా పాలన సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రవాణా వ్యవస్థ బాగుండాలని కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు నియామకాలు చేపట్టామని..బాండ్స్ ఇవ్వడంతో పాటు కారుణ్య నియామకాలు చేపట్టి డిఎలు ఇచ్చామన్నారు. గత 10 యేండ్లు ఆర్టీసి సంస్థను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఒక్క బస్సు కొనుగోలు చేయకుండా ఒక్క నియామకం చేపట్టకుండా పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఆర్టీసి సంస్థ ఇప్పుడిప్పుడే ముందుకు వెళ్తుండడంతో సమ్మె చేస్తే మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు ఉంటుందన్నారు. కష్టాల నుంచి ఆర్టీసి బయటపడుతుందన్నారు. ఆర్టీసి మన సంస్థ మనమే కాపాడుకోవాలన్నారు. కార్మికులు ఎప్పుడు వచ్చిన చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంతకు ముందు ప్రయాణికులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్టీసి కండక్టర్, డ్రైవర్ల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్టీసి అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు ఉన్నారు.

వార్త

సోమరిలా, బలహీనంగా నూరేళ్ళు బతకడం కన్నా దృఢసంకల్పంతో కొద్ది కాలమైనా జీవించడం ఉత్తమం.

-అరిస్టాటిల్

# మనిషి ద్రోహమే!


విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ,ఆస్తినష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్‌లో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తంచేస్తున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడంఅటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు చేస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనావాసాలు మార్చడం ఒకటేమిటి ఎన్ని రకాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్నిమార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత జనాభా నూటయాభై కోట్లకు చేరుకోవడానికి ఇంకెంతో సమయం పట్టదు. కానీ అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై పెరగనున్న ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే విషయంలో పటిష్టమైన ప్రణాళికలు లేకపోవడం దురదృష్టకరం. ప్రధానంగా అటవీ సంపద ఊహించని విధంగా హరించుకుపోతున్నది. భారతదేశంలో రోజుకు మూడువందల ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి గతంలో వెల్లడించింది. బొగ్గుగనులు, ధర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేకపోతున్నారు. ఇందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమైపోతున్నది. ఇక పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాల్ వాడకం గూర్చి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు రెట్టింపు స్థాయిలో వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ, ధుమ్ముధూళి, అన్ని కలిపి వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీరప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలుహెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతిగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకేసారి ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. ముఖ్యంగా భారతదేశంలో ఈ అకాల వర్షాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో గత ఎనిమిది వారాలుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈదురుగాలులు, వడగండ్ల వానలు, రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. చేతికి అందాల్సిన పంటలు నీటిపాలైపోతున్నాయి.పండ్ల తోటల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఒక్క తెలుగు రాష్ట్రాలకే ఈ అకాల వర్షాలు పరిమితం కాలేదు. దేశమంతా విస్తరిస్తూనే ఉన్నాయి. వీటితోపాటు వరదలు, తుఫాన్‌లు భూకంపాలు లాంటి ఉపద్రవాలు పర్యావరణానికి హాని కలిగించిన కారణంగా జనారణ్యాలపై దాడులు చేస్తున్నాయి. ఏటా సగటున దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయి. లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల కారణంగా ప్రాణ,ఆస్తుల నష్టం కొంత వరకు నియంత్రించలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి మానవుడు బయటపడలేకపోతున్నాడు. ఆర్థికంగా, సాంకేతికపరంగా ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు ప్రకృతి ముందు తల వంచక తప్పలేదు. మొన్న ఆ మధ్య చైనాలోని సెంట్రల్ వానన్ ప్రావెన్సీలో ఒక్కరోజే ఏకంగా 457.5 మిల్లీ మీటర్ల కుంభవృష్టి కురిసింది. ఎల్లో నది ఉగ్రరూపం దాల్చి ముంచెత్తింది. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. ఒక్క చైనాయేకాదు ప్రపంచంలోని అనేకదేశాలు ఈ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. చిన్నచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతున్నది. ముంబయి నగరానికి ప్రతి వర్షాకాలంలో వరద ముంపు తప్పడం లేదు. ఉత్తరాఖండ్ పరిస్థితి అంచనాలకే అందదు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. ప్రధానంగా ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదు.

నిస్వార్థత ఎంత అధికంగా ఉంటుందో, విజయం అంత అధికంగా లభిస్తుంది.



బెర్నార్డ్ షా

మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

# ప్రజావాక్కు



## మహిళల భాగస్వామ్యం అవసరం

దేశంలో జీడీపీ లెక్కల గొడవలో పడీ అసలైన అభివృద్ధికి కొలబద్దగా నిలిచే మహిళ భాగాస్వామ్యంలో రావాల్సిన లేదా పెరగాల్సిన వృద్ధిని పెంచలేకపోతున్నాం. సమానత్వంసాధించకుండావచ్చే అభివృద్ధి ఒకఅభివృద్ధేనా అన్నా అనుమానం రాకమానదు. ఇకపోతే మహిళలు పని చేయడానికి అనువైన పరిస్థితులు కల్పించాలి అని విశాఖ కేస్ లో చెప్పినప్పటికీ ఆదిశగా అడుగులు పడుతున్నాయా అనేదిపెద్దప్రశ్న. ఇకపోతే దేశంలో సమానత్వం అందించే ఏకీకృత చట్టం,ఉపాధిహామీ ఒకటే అయితే కేంద్రం మితి మీరిన పోకడలువల్ల రాష్ట్ర భౌగోళిక పరిస్థితిని ఆధారంగా పనుల ఎంపికచేసుకునే స్వేచ్ఛలేకపోవడం వల్ల ఆ చట్టం మహత్తర స్ఫూర్తిదెబ్బతింటున్నది.మహబూబ్‌నగర్ వలసలు నివారించేవిధంగా ఆజిల్లా భౌగోళికపరిస్థితికి తగ్గట్టు పనులరూప కల్పన జరగాల్సిన అవసరం ఉంది.

- భారత అవినాష్, జనగామ

## వృక్షో రక్షతి రక్షితః

శబ్ద, వాయుకాలుష్యంతో మానవుడు కకావికలం అవుతున్నాడు.ఇక పశుపక్ష్యాదుల సంగతిసరేసరి.ప్రకృతి అసమతుల్యత వైపు పయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడుమేలుకోలేదన్న విషయం ఆందోళనకరం. ఇదిముమ్మాటికి మానవతప్పిదం.మనం ఎంత భయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమి తల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అటవి సంపద, చెరువులు, భూగర్భజలాలు, ఇంకుడు గుంతలను పరిక్షించుకోవాలి. అభివృద్ధినెపంతో ఇష్టానుసారంగా పరిసరాలకు హాని తల పెట్టే పనులు ఇకనుంచి అయినా మానుకోవాలి.

- ఎం. రాజేష్ నల్గొండ

## మద్యంపై నియంత్రణ అవసరం

మద్యం, మాదకద్రవ్యాలుఊరూరా విచ్చలవిడిగా లభిస్తూ నవతరాన్ని దారితప్పిస్తున్నాయి. వీటిని అణచివేసేందుకు ఉక్కుపాదంమోపాలి. నవతరాన్నికాపాడాలి.మద్యం, మాదకద్రవ్యాలు యువతకు అందకుండా ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేయాలి. ఎవరైనా వీటిని అమ్మినట్లు తెలిసినా, చూసినా వారినివెంటనే అదుపులోకి తీసుకొనికఠిన శిక్షలు విధించాలి. తిరిగిఅలాంటి పనులు చేయకుండా చూడాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

## ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్లు కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పది నిమిషాలపాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగాఉండాలి.పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తి పలకాలి. భక్తి, భుక్తి మితంగా ఉండాలి.అప్పుడు వృత్తిలోకూడా ఎదగడానికి ఆస్కారంఎంతో ఉంది.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

## సీనియర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్లు చేయాలని ఒక చట్టం రూపొందించింది.అన్ని డిపార్ట్మెంట్లకు ప్రమోషన్ వస్తున్నాయి. కానీ టీచర్లకు ప్రమోషన్లు ఒక కలగానే మిగిలిపోతూ ఉన్నది. ప్రమోషన్లలోరిజర్వేషన్లు ఉండడం వలన సీనియారిటీకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కొంతమంది పుట్టిన తారీఖు నుండి ప్రమోషన్లు ఇచ్చేయమని అప్పీలుచేశారు. ఇంకొంతమంది సెకండరీ టీచర్లు డైట్ కాలేజీ లెక్చరర్‌గా, ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్లుగా ప్రమోషన్ లో తమకు కొంత శాతం ఇవ్వాలని అప్పీల్ చేశారు. డ్రిల్ మాస్టర్లు కూడా ఏకంగా డిగ్రీ కాలేజీల పీడీలుగా ప్రమోషన్లు ఇమ్మని అడుగుతున్నారు. ఎవరికి తోచిన అప్పీల్ వారు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెకండరీ టీచర్లు కొంతమంది హైస్కూల్లో జాయిన్ అయ్యి ,స్కూల్ అసిస్టెంట్స్ వర్క్ చేయవలసి వస్తుంది.

- వి. భాస్కర్ రావు, విజయనగరం జిల్లా

## డిప్యుటేషన్ రద్దు చేయాలి

గురుకులాలలో టీచర్స్ పోస్టులను గత సంవత్సరంలో భర్తీ చేయడం జరిగింది. సంవత్సరం పూర్తికాకముందే మళ్లీ డిప్యూటేషన్ అని అంటున్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలి. టీచర్స్ లెక్చరర్స్ ప్రస్తుతం పని చేస్తున్న గురుకులంలో కుటుంబ సమేతంగా క్వార్టర్స్‌లలో ఉండి విధులు నిర్వహిస్తున్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలి. డిప్యూటేషన్ విధానం వలన వికలాంగులైన టీచర్స్ లెక్చరర్స్, మహిళా టీచర్స్ లెక్చరర్స్ ఇబ్బందులు పడుతున్నారు.

-రాపాక, రవీందర్ జనగాం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశ భద్రతే 'ప్రయార్టీ ఐటమ్'

**అమెరికా, రష్యా, బ్రిటన్‌లు కూడా కంటితుడుపు చర్యగానే ఆ రిజల్యూషన్‌ను భావించారు. ఫ్రాన్స్ కోఆర్డినేట్ చేయాల్సిన పరిస్థితులలో సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లందర్నీ ఏకతాటిపై నడిపించి మతపరమైన చర్యగా పహల్గాం ఘటనను భావించి, ఉగ్రవాదులు న్యాయానికి పట్టుబడే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే యు.యన్.ఎస్.సి ప్రకటన సముచితంగా ఉండేది. ఉక్రెయిన్ హమాస్ సంఘర్షణలప్పుడు యు.యన్ జనరల్ బాడీసమావేశమై ఏవిధంగా స్పందించిందో ఆ విధంగానే పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండించే విధంగా స్పందింపచేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. భారత్ ఆ విషయంలో తగు చర్యలు తీసుకొని ఉగ్రవాదానికి, వెనుకుండి నడిపిస్తున్న పాకిస్థాన్‌కు గ్లోబల్ ఖండనను తెలియచేసినప్పుడే వెనకడుగు వేస్తుంది. భారత్ రక్షణ జాగ్రత్తల బాధ్యతను ప్రయారిటీ ఐటమ్‌గా పెట్టుకోక తప్పదు.**



రావులపాటి సీతారాంరావు

ప్రపంచంలోని అన్ని దేశాలూ అభివృద్ధి సాధనలో అహర్నిశలూ కృషి చేస్తూనే ఉన్నాయి.కానీ దేశాల భద్రత దృష్ట్యా అపరిమితంగా సైన్యాల పెంపుదల కోసం, ఆయుధాల ఉత్పత్తి, దిగుమతుల కోసం, మరీ ముఖ్యంగా అణ్వాయుధాల నిమిత్తం విపరీతంగా ఖర్చు చేస్తున్న మాట వాస్తవం. దేశ సంపదలో అభివృద్ధి కోసం కొంత భాగం వినియోగపడుతుంటే, మిలటరీ దళాల కోసం ఖర్చు ఎక్కువగా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న విషయాన్ని ఎవరూ కాదనలేని పరిస్థితి. నిజం మాట్లాడుతే ఈ పరిస్థితిని చాలా దేశాలు ఎదుర్కోక తప్పటం లేదు. అలాంటి గత్యంతరం లేని పరిస్థితినే ఇండియా ఎదుర్కోవాల్సి వస్తున్నది. పహల్గాం ఘటన ఈ సందర్భంగా ప్రస్తావించక తప్పదు. జమ్మూ,కాశ్మీరు ప్రాంతం ఈ మధ్యనే పెద్దగా అలజడులు లేకుండా ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా పయనిస్తున్న తరుణంలో ఈ సంఘటన కాశ్మీర్ టూరిజం మీద ఎదుర్కోలేని దెబ్బకొట్టింది. కాశ్మీర్ ఆర్థిక సంపద ఎక్కువ భాగం పర్యాటక వ్యవస్థ మీదనే ఆధారపడి ఉన్నది. అక్కడి ప్రకృతి సౌందర్యంతోపాటు సహజమైన ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించటానికీ, అనుభవించడానికి ఎంతో మంది యాత్రికులు ప్రపంచం నలుమూలల నుంచీ వస్తుంటారు. ఈ మధ్య వారి రాపిడి విపరీతంగా పెరిగింది. ఆర్థిక సంపద కాశ్మీర్‌లో కొత్త పంథాలో నడుస్తున్న సమయంలో ఈ దురదృష్టకర మారణకాండ కోలుకోలేనంతగా కాశ్మీర్ వ్యవస్థను దెబ్బతీసింది. దీనివల్ల ఒక్క కాశ్మీరే కాదు దేశంలోని ఆర్థిక వనరులు, రక్షణ భద్రత నిమిత్తం ఖర్చుపెట్టాల్సిన అగత్యం ఏర్పడింది. ఎన్ని మాటలు ప్రభుత్వాలు చెప్పినా, మిలటరీ సాయుధ సంపత్తి సమకూర్చలేకపోతే దేశానికి అన్ని వేళలా భద్రత కల్పించడం కష్టం. అభద్రత లోపాలులేకుండా ఉన్నప్పుడే సమగ్ర రక్షణ దేశానికి ఏర్పడుతుంది. ఒకసారి ప్రపంచంలోని ముఖ్య దేశాలు మిలటరీ వ్యవస్థ కోసం పెట్టిన ఖర్చును పరిశీలిస్తే సామాన్యులు ఆశ్చర్యానికి లోనుకాక తప్పదు. ఈ మధ్యనే స్వీడిష్ థింక్ ట్యాంక్ పేరిట మిలటరీ కోసం చేస్తున్న ఖర్చువిషయంలో చేసిన స్టడీ వెలుగులోకి వచ్చింది. 2024 సంవత్సరం బేస్‌గా పెట్టుకొని ఆ స్టడీ కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు బయటపెట్టింది. 2024లో భారతదేశం తొమ్మిదిరెట్లు పాకిస్థాన్ కంటే ఎక్కువగా మిలటరీ నిమిత్తం ఖర్చుపెట్టింది. పహల్గాం తరువాత అంటే 2025సంవత్సరం నుంచి సైనిక దళాలూ, ఆయుధ సంపత్తి కోసం మరింతగా ఖర్చుపెట్టక తప్పదు. మనదేశం ఈ ఖర్చు విషయంలో అయిదవ స్థానంలో ఉంది. 86.1 బిలియన్ డాలర్ల నుంచి 1.6 శాతం పెరిగింది. పాకిస్థాన్ 10.2 బిలియన్లు పెట్టిందని స్టాక్ హోం ఇంటర్ నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రి) కూడా తెల్పింది. యు.యస్.ఏ, చైనా, రష్యా, జర్మనీ, ఇండియా ఎక్కువగా రక్షణ నిమిత్తం ఖర్చుపెట్టే ప్రథమ ఐదుస్థానాల్లో వరుసగా ఉన్నాయి. మొత్తం గ్లోబల్ టోటల్‌లో ఈ అయిదు దేశాలు పెట్టే ఖర్చు కలుపుతే దాదాపు 60శాతం ఉంటుంది. ఈ అయిదు దేశాలు కలిసి 1.035 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టున్నాయి. చైనా దేశం తన భద్రత ఖర్చును ఏడు శాతం ఎక్కువ చేసింది. ఆసియా దేశాలతో పోలుస్తే చైనా చేసే ఖర్చు 50 శాతం ఉంటుంది. రష్యా కూడా ఖర్చు బాగానే ఎక్కువగా పెట్టున్నది. ఉక్రెయిన్ యుద్ధం వల్ల రష్యా మిలటరీ ఖర్చు దాదాపు 149 బిలియన్ డాలర్లకు 2024 చేరుకుంది. ఇది 8శాతం 2023 సంవత్సరం ఖర్చు కంటే ఎక్కువ. ఉక్రెయిన్ మొత్తం ఖర్చు (మిలటరీ కోసం) 2.9 శాతం పెరిగి 64.7 బిలియన్ల డాలర్లకు చేరుకుంది. ఈ ఖర్చుల విషయం



ప్రస్తావించడానికి కారణం ఒక్కటే. యుద్ధమేఘాలు దేశాల మధ్య కమ్ముకున్నప్పుడు ఏ దేశమూ భద్రత విషయంలో ఖర్చుపెట్టడానికి వెనుకాడదు. అభివృద్ధి తప్పక కుంటుపడ్తుంది. అది వేరే విషయం. కానీ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడవల్సిన బాధ్యత పదవిలో ఉన్న ప్రభుత్వానిదే! ఇవ్వాల పాకిస్థాన్ అస్తవ్యస్తంగా ఉండటానికి కారణం ఆర్థిక పురోభివృద్ధిని సాధించడానికి ప్రణాళికలను ఏర్పరుచుకొని తగు చర్యలు తీసుకోలేకపోవటమే. కేవలం మతపరమైన భావజాలంతో మిలటరీపరంగా బలాన్ని పెంచుకొని దాయాది ఇండియాను అన్నివిధాల దెబ్బతీయాలనే దురాలోచనే పాకిస్థాన్‌ను బలహీనపర్చింది. ఆర్థికాభివృద్ధి ప్రక్కన పెట్టి ఆర్మీ సహాయాంతో ఇండియాను జయించాలనుకుంటే కుదరదు. ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలు ఇచ్చి చైనాతో జట్టుకట్టి ఇండియా మీద పైచేయి సాధించాలనుకోవటం పాకిస్థాన్ చేసిన పెద్ద తప్పిదం. అందుకే ప్రస్తుత స్థితిని అనుభవించక తప్పటంలేదు. భారతదేశం మొదటి నుంచీ ఏ దేశం జోలికి పోలేదు. తగాదాలు పెట్టుకొని ప్రపంచ నాయకత్వాన్ని పొందాలని ఎన్నడూ ఆశించలేదు. అభివృద్ధి సాధించడంలో ఇతర దేశాలతో పోటీపడిన మాట వాస్తవం. అభివృద్ధి వరకే పోటీని పరిమితం చేయడం వల్ల ప్రపంచ దేశాల్లో గౌరవ ప్రధానమైన స్థానాన్ని పొందగలిగింది. చైనాతో కానీ, పాకిస్థాన్‌తో కానీ కావాలని ఇండియా ఎన్నడూ యుద్ధాలు తెచ్చుకోలేదు. ఆ రెండు దేశాలు తమ బలాలను నిరూపించుకోవడానికి సరిహద్దును తారుమారు చేసి పైచేయి సాధించాలని ప్రయత్నించినప్పుడు దీటుగా జవాబివ్వటమే కాదు. తిరుగులేని రీతిలో దాడులను త్రిప్పికొట్టింది. భద్రతకు సంబంధించినంత వరకు మిలటరీ పరంగా అన్ని అవసరాలను క్రమపద్ధతిలో తీర్చింది. ఆధునిక ఆయుధాలను, యుద్ధవిమానాలను అణ్వాయుధాలను సమకూర్చుకొని శాంతి సూత్రాన్ని పక్కనపెట్టలేదు. ఇండియా తన మీద దాడి చేసినప్పుడు మాత్రమే దేశ రోక్షణ కోసం తగువిధంగా జవాబిచ్చింది. మంచి ఊపులో దేశ ఆర్థిక పురోభివృద్ధి ఉన్నప్పుడు పాకిస్థాన్ పహల్గాం ఘటన ఆధారంగా ఆర్థికంగా బలహీనపర్చేందుకు వేసిన ఎత్తుగడ. యుద్ధం కొనసాగిస్తే పాకిస్థాన్‌కు మంచిది. ఇండియాకు కాదు. అగ్రదేశాలు భారతదేశంతో శత్రుత్వం కావాలని ఎన్నడూ తెచ్చుకోలేదు. కానీ భారతదేశం అగ్రదేశాల సరసన అణుశక్తిగా ఎదగటం ఒక విధంగా ఆ దేశాలకు ఇష్టం లేదు. అందుకే పాకిస్థాన్ వెనుకవుండి ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదాన్ని నిర్దాక్షణ్యంగా ఖండించి నిర్మూలించే పనికి అమెరికా,రష్యా లాంటి దేశాలు పూనుకున్నట్లయితే ఆఫ్ఘనిస్థాన్, బెలూచిస్థాన్, అంతెందుకు బంగ్లాదేశ్ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలు అసలు తలెత్తకనేపోయేవి. అమెరికా తన తప్పిదాన్ని ట్విన్‌టవర్ నిర్మూలనతో తెలుసుకోగలిగింది. వియత్నాం విషయంలో ఇతర చిన్నచిన్న దేశాలలో అవసరమున్నా, లేకపోయినా అమెరికా తలదూర్చిన తర్వాత తనే విచారించింది. అయినా తగురీతిలో యు.యస్ స్పందన ఇప్పుడు లేదన్నది వాస్తవం. ట్రంప్ సమాధానాలు ఎవరికీ అర్థంకాని పరిస్థితిలో చైనా, రష్యాలు ఎలాంటి విధానాలు అమలు చేస్తాయో ఎవరూ ఊహించలేకపోతున్నారు. ఉగ్రవాదాన్ని అన్ని దేశాలూ కలిసి కట్టుగా సమిసిపోయేట్లు చేస్తేనే ప్రపంచంలో శాంతికి విఘాతం ఉండదు.యునైటెడ్ సెక్యూరిటీ కౌన్సిల్ పహల్గాం విషయంలో కొన్ని రోజుల క్రిందట ఆమోదించిన ప్రకటన ఉండాల్సిన విధంగా ఉండకపోవడం వల్ల గ్లోబల్ సమస్యలు, ఉగ్రవాదం వల్ల మరింతగా పెరిగే అవకాశాన్ని అనవసరంగా కల్పించినట్లయింది. పాకిస్థాన్ సభ్యత్వం ఎన్.సిలో నాన్ పర్మినెంట్ మెంబరుగా (2025-2026) ఉండటం వల్ల లభించింది. చైనా పర్మినెంట్ మెంబర్ అవటం వల్ల ఆ రిజల్యూషన్‌ను పటిష్ట రీతిలో ఉగ్రవాదాన్ని నిర్మూలించే విధంగా తయారు చేయనివ్వలేదు. అమెరికా, రష్యా, బ్రిటన్‌లు కూడా కంటితుడుపు చర్యగానే ఆ రిజల్యూషన్‌ను భావించారు. ఫ్రాన్స్ కో ఆర్డినేట్ చేయాల్సిన పరిస్థితులలో సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లందర్నీ ఏకతాటిపై నడిపించి మతపరమైన చర్యగా పహల్గాం ఘటనను భావించి, ఉగ్రవాదులు న్యాయానికి పట్టుబడే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే యు.యన్.ఎస్.సి ప్రకటన సముచితంగా ఉండేది. ఉక్రెయిన్ హమాస్ సంఘర్షణలప్పుడు యు.యన్ జనరల్ బాడీ సమావేశమై ఏ విధంగా స్పందించిందో ఆ విధంగానే పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండించే విధంగా స్పందింప చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. భారత్ ఆ విషయంలో తగుచర్యలు తీసుకొని ఉగ్రవాదానికి,వెనుకుండి నడిపిస్తున్న పాకిస్థాన్‌కు గ్లోబల్ ఖండనను తెలియచేసినప్పుడే వెనుకడుగు వేస్తుంది. భారత్ రక్షణ జాగ్రత్తల బాధ్యతను ప్రయారిటీ ఐటమ్‌గా పెట్టుకోక తప్పదు. •

# అమరావతి ప్రగతి సంకేతం

తరిగోపుల నారాయణస్వామి

ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి, పాలనా సామర్థ్యానికి, భవిష్యత్ అభివృద్ధికి ఒక సమగ్ర రాజధాని అవసరమైంది. ఈ నేపథ్యంలో 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించడం జరిగింది. ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆశలు అమరావతిపై స్థిరపడ్డాయి. కృష్ణా నదీ తీరంలో, అభివృద్ధికి అనువైన ప్రదేశంగా భావించబడిన అమరావతి, భౌగోళికంగా మధ్యలో ఉండటం, తక్కువగా అభివృద్ధి చెందిన ప్రాంతం కావడం దీన్ని మరింత ప్రత్యేకంగా చేశాయి. అమరావతిని నిర్మించేందుకు 33,000 ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా సమర్పించారు. ఇది దేశంలోనే విశేషమైన ప్రజా భాగస్వామ్య ఉదాహరణగా నిలిచింది. రైతులు తమ భూములను ఇవ్వడమే కాక, భవిష్యత్తులో అక్కడ అభివృద్ధి జరగాలని ఆశతో ఎంతో నమ్మకంతో వ్యవహరించారు. వారి త్యాగం భారత ప్రజాస్వామ్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. అయితే 2019లో రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానులు ప్రకటించడంతో, అమరావతికి తీవ్ర అన్యాయం జరిగింది. ఇది రైతుల నమ్మకాన్ని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది. అప్పటి నుండి వేలాది మంది రైతులు నిరవధికంగా ఆందోళనలో పాల్గొంటూ, రాజధాని హక్కు కోసం పోరాటం కొనసాగించారు. ఇదిభారతదేశంలో ఒక అరుదైన ప్రజా ఉద్యమంగా చరిత్రలో నిలిచింది. ఈ నేపథ్యంలో 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతినే శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ కీలక తీర్పును వెలువరించింది. ప్రభుత్వ విధానాలు ప్రజలనమ్మకానికి విరుద్ధంగా ఉండకూడదన్న సందేశాన్ని కోర్టు స్పష్టంగా తెలిపింది. అయినప్పటికీ, అమలులో అసంపూర్ణత కొనసాగుతుండగా ఇప్పుడు కేంద్రం అడుగులు వేయడం రాష్ట్రప్రజలకు కొత్త నమ్మకాన్ని కలిగిస్తోంది. 2025 మే 2న, గౌరవ ప్రధాని నరేంద్ర



మోడీ అమరావతిలో పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది కేవలం పాలనా కార్యక్రమం మాత్రమేకాదు, రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి బలమైన సంకేతం. కేంద్ర ప్రభుత్వం ఈ దశలో అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించి, చట్టబద్ధతను కల్పించి రైతుల ఆశల్ని నిలబెట్టాల్సిన బాధ్యతను భుజాన వేసుకోవాలి. రైతులకు సరైన నష్టపరిహారం, పునరావాసం, జీవితాంత భరోసా కావాలి. భూములు ఇచ్చిన రైతులు అభివృద్ధిలో భాగస్వామ్యంగా మారేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా విధానాలు రూపొందించాలి. ఇది కేవలం ఓ భరోసా మాట కాదు, ఒక బాధ్యతగా మారాలి. ఇక అభివృద్ధి ప్రణాళికను చూస్తే, అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో తీర్చిదిద్దే దిశగా నడవాలి. విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యాసంస్థలు, పరిశోధన కేంద్రాలు ఏర్పాటుచేయాలి. ఐటి హబ్‌గా అభివృద్ధి చేసి, యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించాలి.అదేవిధంగా ఆటోమేషన్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం ఇవ్వాలి. అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా ప్రాంగణాలు, స్టేడియాలు ఏర్పాటు చేయడం ద్వారా క్రీడా అభివృద్ధికి మార్గం వేయవచ్చు. యువతలో స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు,క్రీడా పర్యాటనకు దోహదం చేయవచ్చు.అలాగే,ఆధునిక వైద్యశాలలు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించవచ్చు. ఈమౌలిక వసతులు అమరావతిని ఒక సమగ్ర జీవన కేంద్రంగా తీర్చిదిద్దతాయి. ఇవన్నీ కలిపిచూస్తే, అమరావతి అభివృద్ధి కేవలం రాజధాని నిర్మాణం మాత్రమే కాదు. అది ఒక రాష్ట్రం ఆత్మగౌరవానికి, ప్రజల భవిష్యత్తుకి నిలకడగా మారే మార్గం. ఇది రైతుల త్యాగానికి గౌరవంగా నిలవాలి. కేంద్రప్రభుత్వం చట్టబద్ధత, నిధులు, ప్రాజెక్టులు సమర్థంగా అందించాలి.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలతోకలిసి ముందుకు నడవాలి.అప్పుడు మాత్రమే అమరావతి ఒక అభివృద్ధి చిహ్నంగా నిలుస్తుంది. •

# భారత్‌కు సకల దేశాల మద్దతు

కనుమ ఎల్లారెడ్డి

పాక్‌కు ఎప్పటికి బుద్ధి వస్తుందో తెలియదు కాని ఉగ్రవాదంతో చెట్టా పట్టాల్ వేసుకుంది. భారత్ పై అంత అక్కసు ఉంటే పహల్గాం దాడి కాకుండా, అమాయక పర్యాటకుల ప్రాణాలు తీసి చాలా పెద్ద తప్పు చేసింది. భారత్ పై ఎందుకు దాయది దేశం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందో అర్థం కావడం లేదు. ఇప్పటికే భారత్ చాలా నిగ్రహంగా ఉంది. అది భారత్‌ను తక్కువ అంచనా వేస్తోందా! అన్న అనుమానాలు రేకెత్తుత్తున్నాయి. అగ్రదేశాలయిన అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు పాక్ పై గుర్రుమంటున్నాయి. ముఖ్యంగా ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం కూడా భారత్ పక్షాన ఉండటం, ఉగ్రవాదాన్ని తరిమికొడతాం అని చెప్పడం ప్రశంసనీయం. కాగా పహల్గాం దాడిని అల్ జిరియా, గ్రీస్, సియోర్ర లియాన్, గయాన, సోమాలియా, పనామా దేశాలు భారత్‌కు సంఘీభావం ప్రకటించాయి. చివరికి ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అంటోనియా గుటేర్రస్ కూడా ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ముందుగానే అంతత మాత్రాన ఉన్న భారత్, పాక్ సంబంధాలు ఈ దాడితో విపరీత పరిణామాలు చోటు చేసుకుంటాయి అని ఆందోళన వెలిబుచ్చారు. ఉగ్రవాదాన్ని ఖండించి భారత్‌కు మద్దతు ప్రకటించిన దేశాలకు భారత విదేశాంగా మంత్రి జై శంకర్ కృతజ్ఞతలు చెప్పారు. పాక్ లక్ష్యం ఒకటే భారత్‌ను ఎలాగైనా అస్థిర పరచాలానే తలంపుతో ఉంది. ఆ నేపథ్యంలో పర్యాటకులను లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌తో ఇప్పటికే డంకిలు, డెంకీలు తిన్న పాక్‌కు బుద్ధి రాకపోవటం శోచనీయం.పాక్‌పై దాడికి భారత్‌లోని సైనికులు అవసరం లేదు. భారత తల్లుల గర్భంలోని పసికందులు చాలు. వారి రక్తం సలాసలా కాగిపోతోంది. భారత్ ఇక ఎంత మాత్రం ఉపేక్షించరాదు. ఏ దేశం పాక్‌కు మద్దతు ఇవ్వదు. అందు నిమిత్తమే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా పహల్గాంలో 28మంది పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రమూకలకు కఠినంగా శిక్ష పడాల్సిందేనని, దానికి తాము పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టంచేశారు. మరో వైపు భారత్ మాపై దాడి చేస్తుంది అని, పహల్గాం దాడిని, భారత్ ఒక సాకుగా వాడుకోవాలని చూస్తుందని, పాక్ సమాచార, ప్రసార శాఖ మంత్రి తరార్ చెప్పడం విడ్డూరం. తప్పు చేసి దాన్ని ఒక



సాకు అని పాక్ చెప్పడం సహించరాని విషయం. పైగా తమపై దాడి చెస్తే భారత్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని చెప్పడం హేయం. తరర్ మతి ఉండి మాట్లాడుతున్నాడో లేదో అతనికే తెలియాలి. రుజువులు కళ్ల ముందు కనిపిస్తున్నా, పలు దేశాలు పాక్‌ను విమర్శిస్తున్నా పాక్ కు బుద్ధి రాకపోవడం ఆ దేశానికే సిగ్గు చేటు. భారత్‌తో, పాక్ యుద్ధం చెస్తే ఏదేశం కూడా పాక్‌కు మద్దతు ప్రకటించదు. భారత్‌పై పాక్ ఎన్ని ఆంక్షలు విధించినా ఆ దేశానికే నష్టం. ఇప్పటికే చీనాబ్ నది నీరు లేక పూర్తిగా అడగంటి పోయింది. ప్రధాన నీటి వనరు కనుమరుగు కావటం పాక్‌కు తొలి దెబ్బ. పాక్‌లో ఆర్థిక వ్యవస్థ కుదేలు అయింది. భారత్ దాడి చేస్తుంది అని ఆ దేశానికి భయం పుట్టుకుంది. అందుకే భారత్ పై తప్పుడు ప్రచారం చేస్తోంది. యుద్ధానికి భారత్ విముఖంగా ఉందని ఒక ఫేక్ వార్తను ప్రచారం చేస్తోంది. ఇది భారత్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయడానికే ఇటువంటి అసంబద్ధ వార్తలు ప్రచారం చేయడం పాక్ కే చెల్లింది. పాక్‌ను దెబ్బ కొట్టాల్సిందేనని భారత్ కృత నిశ్చయంతో ఉంది. ఈసారి దాడి చెస్తే పాక్‌కు మాములుగా ఉండదు. అసలు భారత్ అంటే ఏమిటో రుచి చూపిస్తుంది. మళ్లీ భారత్ వైపు కన్నెత్తి చూడకుండా గట్టి గుణపాఠం చెప్పే రోజు ముందుంది. అందుకే పాక్ వణికిపోతోంది. అమాయకులైన పర్యాటకులను పొట్టన బెట్టుకోవడం కాదు దమ్ము, ధైర్యం ఉంటే నేరుగా భారత్ ఆర్మీని ఎదుర్కోండి మీ సత్తా ఏమిటో, మా సత్తా ఏమిటో బయట పడుతుంది అని ప్రతి భారతీయుడు పిడికిలి బిగిస్తున్నాడు. ఇక ఎక్కడైనా పాక్ ఉగ్రవాదులు దాడి చెస్తే మాత్రం సహించలేదు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైన దరిమిళ భక్తులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామని భారత్ ఆత్మ విశ్వాసంతో చెప్పింది. భారత్‌కు వివిధ దేశాలు మద్దతు ప్రకటించడం పట్ల, పాక్ ఇప్పటికైనా భారత్‌కు క్షమాపణ చెప్పాలి. అయినా పర్యాటకుల ప్రాణాలు తీయడం ఏ దేశ సంస్కృతి కాదు. పర్యాటకులకు మర్యాద, గౌరవం, తగిన సహాయ, సహకారాలు ఇవ్వాలి. అది భారత్‌ను చూచి పాక్ నేర్చుకోవాలి. ఇంత వరకు భారత్ ఎంతో సంయనం ప్రకటించింది. పర్యాటకుల ప్రాణాలు పోవడంతో ఇక భారత్ వెనక్కి తగ్గదు. ఏ క్షణంలో నైనా పాక్ పై భారత్ దాడి చేయాల్సిందే. దానికి మిగతా దేశాలు కూడా కలసిరావాలి. అప్పుడు కాని పాక్‌కు బుద్ధిరాదు. ఇక ఎప్పటికి ఉగ్రదాడి చేయదు అనే విధంగా పాక్‌కు గట్టి హెచ్చరిక చేయాలి. అప్పుడే పాక్ అదుపులోకి వస్తుంది. •

# భారత్ నౌకలను అనుమతించబోం

## ప్రతీకార చర్యలకు దిగుతున్న పాకిస్థాన్



**లాహోర్, మే 4:** పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కూడా పెరుగుతున్నాయి. పొరుగు దేశంతో వాణిజ్య సంబంధాలను తెంచుకునే దిశగా భారత్ అడుగులు వేస్తున్నది. ఇప్పటికే పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, ఆ తర్వాత పొరుగు దేశ నౌకలను భారత్‌లోని ఓడరేవుల్లోకి అనుమతించకూడదని నిర్ణయించింది. అయితే కాస్త ఆలస్యంగా పాకిస్తాన్ మరో నిర్ణయం తీసుకుంది. భారత్‌కు చెందిన నౌకలను తమ ఓడరేవుల్లోకి అనుమతించవద్దని నిర్ణయించింది. పొరుగు దేశంతో సముద్ర సార్వభౌమత్వం, ఆర్థిక ప్రయోజనాలు, జాతీయ భద్రతను కాపాడటానికి పాక్ తక్షణమే పలు చర్యలను అమలు చేస్తుంది. భారత నౌకలను పాక్ ఓడరేవుల్లోకి వచ్చేందుకు అనుమతులు లేవు అంటూ సముద్ర వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలను జారీ చేసింది. భారత వాణిజ్య మంత్రిత్వశాఖ పాక్ నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. పాకిస్తాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్తాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. మర్చెంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. మరో వైపు ఆ దేశం నుంచి భారత్‌కు వివిధ మార్గాల్లో వచ్చే అన్నిరకాల ఉత్తరాలు, పార్శిళ్ల రవాణాను కూడా నిలిపివేస్తున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. 2019లో పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాక్ దిగుమతులపై 200% సుంకాన్ని కేంద్రం విధించింది. దాంతో అవి దాదాపుగా తగ్గిపోయాయి. పహల్గాం ఉగ్రదాడి, సరిహద్దుల్లో కవ్వింపు చర్యల నేపథ్యంలో ఇప్పుడు ఇతర దేశాల మీదుగా పాక్ నుంచి వచ్చే దిగుమతుల్ని సైతం నిలిపివేసింది. దీంతో భారత్‌కు ఎగుమతులపైనే ఆధారపడుతున్న పాక్‌లోని కొన్ని పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండడం వల్ల ఆ దేశం ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది.

# సింగపూర్ ప్రధానిగా మళ్లీ లారెన్స్ వాంగ్



**సింగపూర్, మే 4:** ప్రపంచంలో ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న సమయంలో సింగపూర్‌లో జరిగిన ఎన్నికల్లో అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) మరోసారి ఘన విజయం సాధించింది. అక్కడ జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని లారెన్స్ వాంగ్ నేతృత్వంలో భారీ గెలుపును సొంతం చేసుకుంది. దీంతో ప్రధానిగా మరోసారి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. సింగపూర్ పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ జరిగింది. దాదాపు 26 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ దేశంలో ఓటేయడం తప్పనిసరి. అనంతరం రాత్రి జరిగిన ఓట్ల లెక్కింపులో పీఏపీ తిరుగులేని విజయం సాధించింది. సింగపూర్ పార్లమెంటులో మొత్తం 98 సీట్లుండగా 5 చోట్ల ఇప్పటికే పీఏపీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికలు జరిగిన 93 సీట్లలో 82 చోట్ల ఆ పార్టీ విజయం సాధించి మొత్తం 87సీట్లను గెలుచుకుంది. ప్రతిపక్ష వర్కర్స్ పార్టీ 10 సీట్లలో గెలిచింది. 66 ఏళ్లుగా సింగపూర్‌లో పీఏపీనే అధికారంలో కొనసాగుతోంది. గత ఏడాది సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన లారెన్స్ వాంగ్ (52) తన నేతృత్వంలో జరిగిన తొలి ఎలక్షన్‌లో పట్టును నిరూపించుకున్నారు. అమెరికాలో శిక్షణపొందిన ఈ ఆర్థికవేత్త సింగపూర్ ఆర్థిక మంత్రిగానూ సేవలందిస్తున్నారు. సింగపూర్ సార్వత్రిక ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో విజయం సాధించిన లారెన్స్ వాంగ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆయనతో కలిసి పనిచేయడం కొనసాగించాలని ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారత్, సింగపూర్ మధ్య బలమైన, బహుముఖ భాగస్వామ్యాన్ని పంచుకుంటాయి అని అన్నారు. 97 పార్లమెంట్ టీ స్థానాల్లో 87 స్థానాలను గెలుచుకుంది పీఏపీ. సింగపూర్‌లో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది.



## పాక్‌కు రహస్య సమాచారం

# లీక్ చేసిన ఇద్దరి అరెస్టు

**అమృత్‌సర్, మే 4:** అమృత్‌సర్‌లో భారత ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతాలు, వైమానిక స్థావరాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారం, ఫొటోలను పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజాబ్‌లోని అమృత్‌సర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పాలక్ షేర్ మసిహ్, సూరజ్ మసిహ్‌లుగా గుర్తించారు. వీరు పాక్‌లోని ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తు సమాచారం ప్రకారం హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ పిట్టు అలియాస్ హ్యాపీ సూచనల మేరకు వీరు పని చేస్తున్నట్లు తేలింది. ప్రస్తుతం హర్‌ప్రీత్ సింగ్ అమృత్‌సర్ జైల్లో ఉన్నాడు. వీరి వద్ద అత్యంత సున్నితమైన విజువల్స్ తోపాటు, డేటా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అధికార రహస్యాల చట్టం కింద వీరిపై కేసులు పెట్టారు. దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ మరిన్ని విషయాలు బయటపడవచ్చని, ఇంకొన్ని అరెస్టులు ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు.

# ఇమ్రాన్, భుట్టోల ఎక్స్‌ఖాతాలు నిలిపివేత



**న్యూఢిల్లీ, మే 4:** పహల్గాం దాడి తర్వాత పాక్‌పై భారత్ అనేక చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా తాజాగా పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆ దేశ విదేశాంగ మాజీ మంత్రి పిపిపి చీఫ్ బిలావల్ భుట్టోల ఎక్స్‌ఖాతాలను నిలిపివేసింది. పహల్గాం ఉగ్ర దాడితర్వాత జమ్ముకాశ్మీర్‌పై వారు తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని కేంద్రం నిలిపివేతకు ఆదేశించింది. ఇటీవలే పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా మహ్మద్ ఆసిఫ్ ఎక్స్‌ఖాతాను భారత్ నిలిపివేసింది.పాక్ కేంద్రంగా నిర్వహిస్తున్న 16 యూట్యూబ్ ఛానళ్లపైనా వేటు వేసింది. పహల్గాం ఉగ్రదాడిపై ఇటీవల ఇమ్రాన్‌ఖాన్ మీడియాతో మాట్లాడుతూ ఇది చాలా విషాదకర సంఘటన అన్నారు. కాశ్మీర్‌పరంగా భారత్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రేలాపనలు చేసారు. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ పాక్‌పై దాడులకు దిగితే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. పాక్‌మాజీ విదేశాంగమంత్రి భిలావల్‌భుట్టో సైతం ఇదేవిధంగా నోరుపారేసుకున్నారు. సింధూజలాలు ప్రవహించకపోతే రక్తం పారుతుందని రెచ్చగొట్టే వ్యాఖ్యలుచేసారు. సింధూనది తమదేనని ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈదాడితో పాక్, భారత్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. పాక్ సీమాంతర ఉగ్రవాదం విడిచిపెట్టేవరకూ ఆదేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకొని పాక్ జాతీయులను దేశం నుంచి వెళ్లగొట్టింది.

## ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడి

# ఢిల్లీ-టెల్‌అవీవ్ విమానం అబుదాబీకి



**టెల్‌అవీవ్, మే 4:** ఇజ్రాయెల్‌లోని కీలక నగరమైన టెల్ అవీవ్ శివారులోని బెన్ గురియన్ విమానాశ్రయం సమీపంలో క్షిపణి దాడితో ఎయిరిండియా అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ నుంచి టెల్‌అవీవ్‌కు వెళ్తున్న ఎయిరిండియా విమానాన్ని అధికారులు అబుదాబీకి మళ్లించారు. ఎయిర్ ఇండియాబోయింగ్ 787 విమానం ఎఐ 139 టెల్‌అవీవ్‌లో ల్యాండ్ కావడానికి దాదాపు గంట ముందు ఈ దాడి జరగడంతో దారి మళ్లించినట్లు సమాచారం. ఈ విమానం తిరిగి ఢిల్లీకి వచ్చేస్తుందని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్ 24.కామ్ ప్రకారం అబుదాబీకి మళ్లించాలని నిర్ణయం తీసుకున్న సమయానికి ఈ విమానం జోర్డాన్ గగనతలంలో ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో టెల్‌అవీవ్ నుంచి ఢిల్లీకి ఆది వారం రావాల్సిన ఎయిరిండియా విమానం రద్దయింది.

**టెల్ అవీవ్‌కు ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు:** మరోవైపు, టెల్‌అవీవ్‌లో తాజా పరిణామాల నేపథ్యంలో మే 6 వరకు విమాన సర్వీసులు రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. వినియోగదారులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తమ ఉద్యోగులు కస్టమర్లకు సహాయం చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో వారికి సహాయం చేస్తున్నట్లు పేర్కొంది. మే 4 నుంచి 6 మధ్య ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని రిఫండ్ చేస్తా మని 'ఎక్స్'లో పేర్కొంది.ఇతర సమాచారం కోసం 011-69329333, 011-69329999 నంబర్లు లేదా తమ అధికారిక వెబ్‌సైట్ ఎయి రిండియా.కామ్‌ను సంప్రదించవచ్చని సూచించింది.

**అంతకు ఏడురెట్లు బలంగా దెబ్బ కొడతాం: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి:** యెమెన్ నుంచి హూతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన క్షిపణి ఆదివారం ఉదయం బెన్ గురియన్ విమానాశ్రయం ప్రధాన టెర్మినల్ సమీపంలో కూలినట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి దాడి సమీపంలో టెల్ అవీవ్ శివారులో ఉన్న విమానాశ్రయం సమీపంలో దట్టమైన పొగలు అలముకున్నట్లు ఉన్న వీడియో ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్షిపణి దాడి నేపథ్యంలో టెల్ అవీవ్‌లోని విమానాశ్రయానికి విమాన రాకపోకలు నిలిపివేశారు. ఈ క్షిపణి దాడిలో ఆరుగురికి గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ తమపై దాడిచేసిన వారికి.. అంతకు ఏడు రెట్లు బలంగా దెబ్బతీస్తామని హెచ్చరించారు.

# బలూచ్ ఆర్మీతో పాకిస్థాన్‌కు వణుకు



**ముజఫరాబాద్, మే 4:** భారత్ తమపై ఎక్కడ యుద్ధానికి దిగుతుందోనని భయపడిపోతున్న పాకిస్తాన్‌కు మరో షాక్ తగిలింది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడులతో పాకిస్తాన్ ఆర్మీ అల్లాడిపోతోంది. కొన్ని రోజుల క్రితం పాక్ సైనికులు వెళుతున్న ట్రైన్‌ని హైజాక్ చేసిన బలూచ్ లిబరేషన్ ఆర్మీ తాజాగా బలూచిస్తాన్‌లో ఓ టౌన్‌ని కూడా స్వాధీనం చేసుకుంది. బీఎల్‌ఏ వరుస దాడులతో బలూచిస్తాన్‌పై పాకిస్తాన్ నియంత్రణ కోల్పోతోంది. తాజా దాడిలో పాక్ సైనికులను బంధించి మంగుచోర్ పట్టణాన్ని బీఎల్‌ఏ స్వాధీనం చేసుకుంది. బలుచిస్తాన్‌ను ప్రత్యేక దేశంగా ప్రకటించాలని బీఎల్‌ఏ పోరాడుతోంది. ఇప్పటికే బీఎల్‌ఏ దాడుల్లో వందలాదిమంది పాక్ సైనికులు మృతి చెందారు. సొంతదేశంలో నిరసనకారుల నుంచి ఓ పట్టణాన్ని కాపాడుకోలేక పోయిన పాక్ భారత్‌పై మాత్రం దాడులకు వెనుకాడబోం అంటూ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. పాకిస్తాన్‌లోని నైరుతి ప్రాంతమే బలూచిస్తాన్. ఇది పాక్‌లో ఒక ప్రావిన్స్‌గా ఉంది. పాకిస్తాన్ మొత్తం విస్తీర్ణంలో 44 శాతం బలూచిస్తాన్ ఉంటుంది. విస్తీర్ణం పరంగా పాకిస్థాన్‌లో అతి పెద్ద ప్రావిన్స్‌గా బలూచిస్తాన్ ఉంది. అలాగే మిగతా అన్ని ప్రావిన్స్‌లో కెల్లా అతి తక్కువ జనాభా ఉన్న ప్రావిన్స్ కూడా బలూచిస్తానే. బలూచిస్తాన్‌లో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయు వు వనరులు పుష్కలంగా ఉన్నాయి. బ్రిటిష్ ఇండియాలో విలీనం చేయకముందు వరకు బలూచిస్తాన్ స్వతంత్ర దేశంగానే ఉండేది. బ్రిటిష్ వారి నుంచి మనకు స్వతంత్రం వచ్చిన తర్వాత దేశ విభజన తర్వాత పాకిస్తాన్‌లో భాగమైంది. ఆ తర్వాత కొంత కాలానికి స్వతంత్ర దేశం కోసం బలూచిస్తాన్ నుంచి డిమాండ్ పుట్టుకొచ్చింది. ఆ ప్రావిన్స్‌లో పాక్ సాగిస్తున్న మారణకాండ కూడా తిరుగుబాటుకు మరో కారణం. 2011 నుంచి 2024 జనవరి వరకు పాక్‌లో మొత్తం 10,078 మంది అదృశ్యం అయ్యారు. అదృశ్యమైనవారిలో 2,752 మంది బలూచ్ పౌరులే. 2001-2017 మధ్య 5,228 మంది బలూచ్ పౌరులు అదృశ్యం కావడం గమనార్హం. ప్రస్తుతం బీఎల్‌ఏ చురుకుగా వేర్పాటువాద కార్యకలాపాలు సాగిస్తోంది. బలూచిస్తాన్ స్వతంత్ర దేశం కావాలనే డిమాండ్‌తో బీఎల్‌ఏ ఏర్పాటైంది. దశాబ్ద కాలంగా పాకిస్తాన్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తోంది. అయితే పాకిస్థాన్ ప్రభుత్వం, అమెరికా బీఎల్‌ఏను ఒక ఉగ్ర సంస్థగా గుర్తించాయి. ప్రస్తుతం పాక్, ఇండియాతో యుద్ధం వస్తుందేమో అని భయపడుతున్న క్రమంలో బీఎల్‌ఏ పాకిస్థాన్‌తో పాటు చైనాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. వెంటనే బలూచిస్తాన్‌ను వదిలివెళ్లిపోవాలంటూ ఆ రెండు దేశాలను హెచ్చరించింది.




# భారత వాయుసేనతో ఘర్షణ జరగొచ్చు

## పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్

**ఇస్లామాబాద్, మే 4:** మాపై 36 గంటల్లో భారత్ దాడి చేయడం ఖాయం అంటూ గగ్గోలు పెట్టిన పాక్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్ ఇప్పుడు కొత్త పల్లవి అందుకొన్నారు. ఆయన 36 గంటలు అని చెప్పి నాలుగు రోజులు దాటినా భారత్ నుంచి ఎటువంటి ప్రతిదాడి లేకపోవడంతో కొత్త కోణం తెరపైకి తెచ్చారు. భారత్ వాయుసేనతో ఘర్షణ జరిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అంచనా వేశారు. ఆయన పాక్‌కు చెందిన ఎఆర్‌వై న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే తమ గగనతలంలోకి వచ్చేందుకు ప్రయత్నించిన రఫేల్ యుద్ధ విమానాలను అడ్డుకొన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇక ఇదే మంత్రి మరో ఛానెల్‌లో మాట్లాడుతూ సింధు నదిపై భారత్ నిర్మించే ఏ కట్టడాన్నిఅయినా దాడిచేసి కూల్చేస్తామని పేర్కొన్నారు. అసలు భారత్ దీనిపై నిర్మాణాలకు యత్నించడమే దౌర్జన్యంగా భావిస్తా మన్నారు. గత నెల చివరలో ఆసీఫ్ ఓ ప్రకటన చేశారు. భారత్ 24-36 గంటల్లో తమపై సైనిక చర్య చేపడుతుందని సంచలన ప్రకటన చేశారు. భారత్‌లో సిసిఎస్ సమావేశం ముగిసి ఉగ్రవాదులపై చర్యకు మిలటరీకి అధికారాలు ఇచ్చిన వేళ ఈ ప్రకటన వెలువడటం సంచలనం సృష్టించింది.కానీ అటువంటిది ఏమీ చోటుచేసుకోలేదు.

# భారత్-పాక్ సరిహద్దులో పాక్ రేంజర్

## అదుపులోకి తీసుకున్న బిఎస్‌ఎఫ్ జవాన్లు



**జైపూర్, మే 4:** భారత్ సరిహద్దులోకి చొరబడిన పాకిస్థాన్ రేంజర్‌ను బీఎస్‌ఎఫ్ జవాన్లు పట్టుకున్నారు. శనివారం రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో ఉన్న భారత్‌పాక్ బోర్డర్‌లోకి ఓ పాకిస్థాన్ రేంజర్ చొరబడ్డాడు. అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో బీఎస్‌ఎఫ్ జవాన్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. భారత్‌పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాకిస్థాన్ రేంజర్ భారత్‌లోకి ప్రవేశించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల అనుకోకుండా భారత్ సరిహద్దు దాటి పాక్‌లోకి ప్రవేశించిన ఓ బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌ను పాకిస్థాన్ ఆర్మీ నిర్బంధించింది. అతనిని విడుదల చేయాలని భారత్ సైనిక అధికారులు చర్చలు జరుపుతున్నప్పటికీ, ఫలితం కనిపించడం లేదు. ఉన్నతాధికారుల అనుమతి లేనిదే ఆయన్ను విడుదల చేయడం కుదరదని పాక్ ఆర్మీ వర్గాలు అంటున్నాయి. మరి ఇప్పుడు పాక్ రేంజర్‌ను అదుపులోకి తీసుకున్న భారత్ ఎలా స్పందిస్తుందో చూడాలి. పాక్ మహిళను పెళ్లాడిన విషయాన్ని రహస్యంగా ఉంచడమే కాకుండా, వీసా గడువు ముగిసినా ఆమెను ఇక్కడే ఉంచిన ఓ జవాన్‌ను సీఆర్పీఎఫ్ ఉద్యోగం నుంచి తొలగించింది. పహల్గాం ఉగ్రదాడి తరువాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ వ్యవహారం బయటకొచ్చింది. పాక్ జాతీయులు స్వదేశానికి వెళ్లిపోవాలని భారత్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆమె వివరాలు ఆరా తీయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సీఆర్పీఎఫ్ 41వ బెటాలియన్‌కు చెందిన మునీర్ అహ్మద్ అనే జవాన్ గతేడాది మే నెలలో పాక్‌కు చెందిన ఓ మహిళను వీడియో కాల్ మాధ్యమంలో పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత ఆమె వీసాపై భారత్‌కు చేరుకుంది. అయితే, ఈ విషయాన్ని సదరు జవాన్ ఉన్నతాధికారుల వద్ద దాచి ఉంచాడు. పైగా వీసా గడువు ముగిసినా ఆమెను ఇక్కడే ఉంచాడు. దీంతో ఉన్నతాధికారులు మునీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. పాక్ జాతీయురాలితో వివాహం జరిగిన విషయాన్ని మునీర్ అహ్మద్ దాచిపెట్టాడు. అంతేకాదు ఆమె వీసా గడువు ముగిసిందని తెలిసి కూడా ఆశ్రయం కల్పించాడు. అందుకే అతన్ని తక్షణం సర్వీసు నుంచి తొలగిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు జాతీయ భద్రతకు విఘాతం కలిగేలా ప్రవర్తించాడు. అందుకే ఈ మేరకు చర్యలు తీసుకున్నాం'అని ఆర్పీఎఫ్‌ప్రతినిధి వెల్లడించారు.



# జార్ఖండ్‌లో రోడ్డుపై వెళ్తున్న కారులో పేలుడు డ్రైవర్ సజీవ దహనం

**రాంచీ, మే 4:** రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు చెలరేగాయి. కొన్ని క్షణాల్లోనే ఆ కారులో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో కారులో వ్యాపించి మంటల్లో కాలి డ్రైవర్ సజీవదహనమయ్యాడు. ఇది చూసి అక్కడున్న జనం షాక్ అయ్యారు. జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. కద్మా ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు వ్యాపించాయి. దీంతో డ్రైవర్ కారును రోడ్డుపై ఆపాడు. అయితే ఆ కారు డిక్కీలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఆ మంటల్లో కారు కాలిపోయింది. కారు డ్రైవ్ చేసిన వ్యక్తి సజీవ దహనమయ్యాడు. ఈ సంఘటన చూసిఅక్కడున్న జనం షాక్ అయ్యారు. కాగా, ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫోరెన్సిక్ బృందం అక్కడకు చేరుకున్నారు. మృతుడిని సునీల్ అగర్వాల్‌గా గుర్తించారు. కారు పేలిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# 128 యేళ్ల యోగా గురువు స్వామి శివానంద కన్నుమూత



**వారణాసి, మే 4:** ప్రముఖ యోగా గురువు, పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వామి శివానంద (128) తుదిశ్వాస విడిచారు. వారణాసిలోని నివాసంలో ఆయన కన్నుమూసినట్లు సన్నిహితులు వెల్లడించారు. శివానంద మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి యోగా రంగానికి తీరని లోటుగా పేర్కొన్నారు. 1896 ఆగస్టు 8న అవిభాజ్య భారత్‌లోని సిల్హెట్ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న జిల్లాలో నిరుపేద కుటుంబంలో స్వామి శివానంద జన్మించినట్లు వారి శుష్యులు వెల్లడించారు. ఆరేళ్ల వయసులోనే శివానంద తల్లిదండ్రులు మరణించారు. దీంతో ఆయన బెంగాల్‌లోని ఓ ఆశ్రమంలో పెరిగారు. గురు ఓంకారానంద గోస్వామి ఆయనను పెంచి పెద్ద చేయడమేగాక, యోగా వంటి ఆధ్యాత్మిక విషయాలను బోధించారు. ఈ క్రమంలోనే తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేశారు.50 ఏళ్లుగా పూరిలో 4,00, 600 కుష్టు రోగులకు సేవ చేశారు. అయితే యోగా రంగానికి చేసిన కృషికి గాను 2022లో శివానంద, అప్పటి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఆ సమయంలో తెల్లని ధోవతి, కుర్తా ధరించి కాళ్లకు చెప్పులు లేకుండా అత్యంత సామాన్యంగా వచ్చి పురస్కారాన్ని స్వీకరించారు. దీంతో అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించారు.




# ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను వాడం: పుతిన్

**మాస్కో, మే 4:** ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ఉపయోగించే అవసరం తలెత్తదని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఆ పరిస్థితి ఏర్పడదని తాను ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు. రష్యా అధికారిక టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదానికి తాత్కాలిక ముగింపు తీసుకురావడానికి రష్యా వద్ద బలం ఉందన్నారు. మరోవైపు రష్యా నిర్వహిస్తున్న 'విక్టరీడే' కవాతుకు హాజరయ్యే విదేశీ ప్రముఖుల ప్రాణాలకు తాను హామీ ఇవ్వలేనంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ హెచ్చరిక జారీ చేశారు.

# తెరుచుకున్న బద్రీనాథ్ దేవాలయం

## ప్రధాని మోడీ పేరిట ఉత్తరాఖండ్ సిఎం మహాభిషేకం



**డెహ్రాడూన్, మే 4:** ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథుడి ఆలయ ద్వారాలు ఆరు నెలల తర్వాత తెరుచుకోగా, ప్రధాని నరేంద్ర మోదీ పేరిట సీఎం పుష్కర్ సింగ్ ధామి తొలి మహాభిషేక పూజను నిర్వహించారు. ఆ తర్వాత దేశ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. లక్ష్మీ దేవి, వినాయకుడు సహా ఆలయ ప్రాంగణంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆ సమయంలో ఆయనతోపాటు పలువురు పండితులు కూడా ఉన్నారు. కొన్ని నెలలపాటు ఉన్న కఠిన వాతావరణ పరిస్థితులు తగ్గడంతో ఆదివారం ఉదయం ఆరు గంటలకు భక్తుల జయ జయ ధ్వానాలు, అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య మత పెద్దల సమక్షంలో బద్రీనాథ్ ఆలయ ప్రధాన ద్వారాలను అధికారులు తెరిచారు. ఆ సమయంలో భారత సైనికులు ప్రత్యేక సంగీతాన్ని ఆలపించారు. అంతకుముందు 15 టన్నుల రకరకాల అందమైన పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. దేశం నలుమూలలతోపాటు నేపాల్ నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు బద్రీనాథుడిని దర్శించుకున్నారు. బద్రీనాథ్ ధామ్ తలుపులు తెరిచిన సందర్భంగా మానా, బామ్ని గ్రామానికి చెందిన మహిళలు ఆలయ ప్రాంగణంలో నృత్యం చేశారు. సీఎం పుష్కర్ సింగ్ ధామి బద్రీనాథ్‌లోని యాత్రికుల నుంచి ప్రయాణ ఏర్పాట్లపై అభిప్రాయాలను తీసుకున్నారు. సురక్షితమైన చార్‌ధామ్ యాత్ర, భక్తులకు సౌకర్యాల కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు.ఆలయ సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యా లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. గోవింద్ ఘాట్ వద్ద అలకనంద నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన నిర్మాణ పనుల గురించి ఆయన ఆరా తీశారు. జిల్లా మేజిస్ట్రేట్‌ను వంతెన నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. గతనెల 30న గంగోత్రి, యమునోత్రి ఆలయాల తలుపులు తెరవడం వల్ల చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైంది. ఈనెల 2న, భక్తుల కోసం కేదార్‌నాథ్ ధామ్ తలుపులు తెరుచుకోగా, బుధవారం బద్రీనాథ్ ధామ్ తలుపులు భక్తుల కోసం తెరుచుకున్నాయి. దీంతో ఛార్‌ధామ్ యాత్ర సంపూర్ణంగా ప్రారంభమైనట్లైంది.



# రాంబన్‌జిల్లాలో లోయలోకి పడిన ఆర్మీ వాహనం

## ముగ్గురు సైనికులు మృతి

**శ్రీనగర్, మే 4:** జమ్ము కశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో సైనిక వాహనం అదుపుతప్పి లోయలో పడింది. ఈ దుర్ఘటనలో వాహనంలో ఉన్న ముగ్గురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన సైనికులను అమిత్ కుమార్, సుజీత్ కుమార్, మన్ బహదూర్‌గా గుర్తించారు. ఆర్మీ వాహనం పడిన లోయ ఏకంగా 700 అడుగుల లోతు ఉండటం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. ప్రమాద స్థలిలో సైనికుల మృతదేహాలతో పాటు వారికి సంబంధించిన కొన్ని వస్తువులు కొన్ని పత్రాలు దొరికినట్లు సమాచారం. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న సైనిక వాహన శ్రేణిలో ఆవాహనం ఒక భాగమని సైనిక వర్గాలు తెలిపాయి. బ్యాటరీ చష్మా ప్రాంతంలో వాహనం లోయలో పడింది. వెంటనే అక్కడకు చేరుకున్న సైన్యం, జమ్ముకశ్మీర్ పోలీసులు, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కాన్వాయ్‌లో భాగమైన ఆర్మీ వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్ల ప్రమాదం జరి గింది. వాహనంలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. దురదృష్టవశాత్తు వారు ముగ్గురూ మరణించారు. పోలీసు బృందం, ఆర్మీ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు నిర్వహించాయి. మృతదేహాలను వెలికితీసి పైకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాం. ఘటనాస్థలానికి వెళ్లగా అక్కడ ఒక నట్‌బోల్ట్ కనిపించింది.

అది బహుశా స్టీరింగ్ వీల్స్ నుంచి వచ్చి ఉండవచ్చు. కాబట్టి ఆ నట్‌బోల్ట్ కార ణంగా డ్రైవర్ స్టీరింగ్ వీల్స్‌పై నియంత్రణ కోల్పోయాడని భావిస్తున్నాం. అదే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా తెలుస్తోంది. దర్యాప్తు తర్వాతే విషయాలు స్పష్టంగా తెలుస్తాయి అని రమ్బాన్ ఎస్ఎస్పీ కుల్బీర్ సింగ్ తెలిపారు.

# పర్యాటక ప్రదేశాల షోకేస్‌కు ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ

## రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను సందర్శించనున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు

## ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు దక్కనున్న విశేష ప్రచారం

## దేశీయ పర్యాటకులతోపాటు విదేశీ టూరిస్టులను పెద్దఎత్తున ఆకర్షించనున్న రాష్ట్రం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** అద్భుత చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం కలిగిన తెలంగాణను దేశంలో ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా రూపదిద్దడం, పర్యాటక రంగంలో రూ.15వేల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే తెలంగాణ తొలి టూరిజం పాలసీని రూపొందించింది. ఇందుకోసం మిస్ వరల్డ్ పోటీలను సరైన వేదికగా వినియోగించు కునేందుకు కార్యాచరణ రూపొందించింది. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ ఈవెంట్‌లో తెలంగాణకు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించి తెలంగాణ పర్యాటకంను ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు తద్వారా ప్రపంచ పర్యాటకంలో తెలంగాణను ప్రముఖంగా నిలిపేందుకు, పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. 2024 సంవత్సరంలో తెలంగాణను 1,55,113 మంది విదేశీ పర్యాటకులు సందర్శించారు. వీరి సంఖ్య గణనీయంగా పెరిగేందుకు ఈ మిస్ వరల్డ్ ఈవెంట్‌ను ఉపయోగించుకుంటోంది. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా హైదరాబాద్, వరంగల్ వెయ్యి స్తంభాల గుడి, ఖిలా వరంగల్, భద్రకాళి, రామప్ప, నాగార్జున సాగర్, పోచంపల్లి, పిల్లలమర్రి వృక్షం ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు.

ఈ నెల 12న హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వం గొప్పదనం ప్రపంచానికి తెలియజేసేలా చార్మినార్, లాడ్ బజార్‌లలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు 'హెరిటేజ్ వాక్' నిర్వహిస్తారు. 13న హైదరాబాద్‌కే తలమానికంగా నిలుస్తున్న చౌమల్ల ప్యాలెస్‌ను సందర్శించి ఓల్డ్ సిటీ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి తెలియ చేస్తారు.14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్ లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్ట్ ను సందర్శిస్తారు. ఇదే రోజు యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంను సందర్శిస్తారు. కాకతీయులు యుద్ధ రంగానికి వెళ్లే ముందు ప్రదర్శించే పేరిణి నృత్యంను రామప్పలో తిలకిస్తారు. 15న మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లు ఆధ్యాత్మిక టూరిజంలో భాగంగా యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్పీరియన్సల్ టూర్ లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీని, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు.ఈ నెల 16న మెడికల్ టూరిజం పరిచయ కార్యక్రమంలో భాగంగా మెడికల్ టూరిజంను చేపడతారు.

మహబూబ్‌నగర్ లోని పిల్లలమర్రి వృక్షాన్ని , హైదరాబాదు నగరానికే ప్రత్యేక ఆకర్షణగా ఉన్న ఎక్స్పీరియం పార్కును సందర్శిస్తారు. ఈ నెల 17న ప్రపంచంలోనే పెద్ద ఫిలిం సిటీలలో ఒకటిగా గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామోజీ ఫిలిం సిటీని మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ లు సందర్శిస్తారు. 18న మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ లు తెలంగాణ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించి తెలంగాణ ప్రభుత్వం పౌరుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను , ప్రభుత్వం సేఫ్టీ టూరిజం ఇనిషియేటివ్స్ ను పరిశీలిస్తారు.

ఇదే రోజు సాయంత్రం మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లకు అధికారులు తెలంగాణ రాష్ట్ర గ్రోత్ స్టోరీ, చరిత్రను తెలియజేస్తారు. ట్యాంక్ బండ్ పైన ప్రతి ఆదివారం ఏర్పాటు చేసే సండే ఫండే కార్నివాల్ ను సందర్శిస్తారు. ఈ నెల 20 లేదా 21న ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు కంటెస్టెంట్లు హాజర వుతారు. 21న శిల్పారామం లో తెలంగాణ కళాకారులచే నిర్వహించే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వర్క్ షాప్ హాజరవుతారు.

స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా తయారీ గురించి తెలుసుకుంటారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణతో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యత ను ప్రపంచానికి తెలుపడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో ఒక "మల్టీడైమెన్షనల్ టూరిజం హబ్"గా నిలిపే అవకాశం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# మెరుగైన కనెక్టివిటీ కోసం రూ.5,413 కోట్ల ప్రాజెక్టులు

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాల కల్పనకు అతిపెద్ద ముందడుగు పడిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 5 వ తేదీన రూ. 5,413 కోట్ల విలువైన వివిధ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారని, భూమిపూజ చేయనున్నారని తెలిపారు. ఈ రహదారి ప్రాజెక్టులు తెలంగాణ రాష్ట్రంలో కనెక్టివిటీని మెరుగుపరుస్తాయని, ఆర్థిక వృద్ధిని పెంపొందిస్తాయని, ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని వివరించారు. దృఢమైన, భవిష్యత్ అవసరాలను తీర్చగలిగే మౌలిక సదుపాయాల కల్పన ద్వారా నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిరంతర సహకారాన్ని అందిస్తూనే ఉంటుందని వివరించారు. సిర్పూర్‌కాగజ్‌నగర్ ప్రాజెక్టు విలువ రూ.3,862 కోట్లు ఉంటుందని తెలిపారు. రూ.3694 కోట్ల వ్యయంతో 123 కిలోమీటర్ల పొడవున నిర్మించిన రహదారుల ప్రారంభోత్సవం, రూ.168.47 కోట్ల వ్యయంతో 8.1 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న రహదారికి భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ప్రాజెక్టు విలువ రూ. 1,552.91 కోట్లు అని తెలిపారు. రూ.895.64 కోట్ల వ్యయంతో 22.57 కిలోమీటర్ల పొడవున నిర్మించిన రహదారుల ప్రారంభోత్సం, రూ.657.27 కోట్ల వ్యయంతో 20.87 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న రహదారికి భూమి పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు.



తల్లికి అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశానానికి వెళుతున్న కూతురు

# తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

**చిన్నశంకరంపేట, మే 4, ప్రభాతవార్త:** ఓ కుమార్తె తన తల్లికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన బాలమణి, నాగయ్య దంపతులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు ఒక కూతురు. కాగా బాలమణి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. బాలమణి, నాగయ్య దంపతులకు కుమారులు లేకపోవడంతో కూతురు సుజాత తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు పూర్తి చేసింది. కాగా నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# మురునీటి వ్యవస్థ మరింత బలోపేతానికి చర్యలు

## అధునాతన ఎస్‌టిపిల నిర్మాణాలు

## ప్రతిరోజు 1,650 మిలియల్ గ్యాలన్ల మురుగునీరు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరంలో మురుగు నీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజూ 1950 మిలియన్ గ్యాలన్ల మురుగు నీరు వస్తుంది. ఇందులో జిహెచ్ఎంసి ప్రాంతంలో 1650 మిలియన్ గ్యాలన్లు వస్తుంది. ఇప్పటికే 25 ఎస్‌టిపిల ద్వారా 772 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుద్ధి చేస్తున్నారు. ఇక మిగిలిన 878 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుభ్రం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 31 నూతన మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలు చేపట్టింది. వీటిని నిర్మించే బాధ్యతను జలమండలిపై పెట్టింది. రూ.3,866.21 కోట్ల వ్యయంతో 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణం ద్వారా 100 శాతం మురుగును శుద్ధి చేయడమే కాకుండా పరివాహక ప్రాంతాల్లో మురుగు ప్రవాహాన్ని నిరోధించడం, శుద్ధి చేసిన నీటిని మానవేతర అవసరాలకు వినియోగించవచ్చు. అంతేకాకుండా భూగర్భ జలాలు కలుషితం కాకుండా.. పర్యావరణం, ప్రజారోగ్యం పై ఎలాంటి దుష్ఫలితాలు ఉండవు. ఇవి పూర్తయి అందుబాటులోకి వస్తే రోజూ ఉత్పత్తయ్యే మురుగును 100 శాతం శుద్ధి చేసే తొలి నగరంగా దక్షిణాసియాలోనే హైదరాబాద్ ఖ్యాతికెక్కుతుంది. ఈ 31 ఎస్‌టిపిలు అందుబాటులోకి వస్తే నగరంలో మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుంది. వీటి ద్వారా రోజూ 1259.50 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయవచ్చు. అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్‌టిపిల నిర్మాణం జరుగుతుంది. జలమండలి ఎస్‌టిపి ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న వాటిల్లో ఇప్పటికే 11 ఎస్‌టిపిలు(దుర్గం చెరువు 7 ఎంఎల్‌డి, కోకాపేట15 ఎంఎల్‌డి, మిరాలం 141.5 ఎంఎల్‌డి, పెద్ద చెరువు 17.5 ఎంఎల్‌డి, నల్లచెరువు 86.5 ఎంఎల్‌డి, నాగోల్ 320ఎంఎల్‌డి, మియాపూర్ పటేల్ చెరువు7ఎంఎల్‌డి, సఫిల్‌గూడ 5.5 ఎంఎల్‌డి, ఖాజాకుంట 20ఎంఎల్‌డి, ఫతేనగర్ 133ఎంఎల్‌డి, వెన్నెలగడ్డ 10ఎంఎల్‌డి,) ప్రారంభమయ్యాయి. మరో 6 ఎస్‌టిపిలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో శివాలయనగర్14 ఎంఎల్‌డి, నల్లగండ్ల 7ఎంఎల్‌డి, ముల్లకతువ చెరువు 25ఎంఎల్‌డి, అత్తాపూర్ 164ఎంఎల్‌డి, అంబర్‌పేట్212.50 ఎంఎల్‌డి, పాలపిట్ట పార్క్ 7ఎంఎల్‌డి, ఎస్‌టిపిలున్నాయి. మిగిలిన 3 ఎస్‌టిపిలను రైన్బో విస్టా 43.5 ఎంఎల్‌డి, రామచెరువు 30 ఎంఎల్‌డి, అత్తాపూర్వార్ 240ఎంఎల్‌డి, ఎస్‌టిపిలను జూన్ 2025 నాటికి నిర్మాణం పూర్తి చేస్తారు. సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీ : అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్‌టిపిల నిర్మాణం జరుగుతోంది. మెట్రో నగరాల్లో స్థలాభావం ఉంటుంది కాబట్టి ఎస్బీఆర్ టెక్నాలజీతో నిర్మాణం అనువుగా ఉంటుంది. వీటి వల్ల ఒకే ఛాంబర్లో ఐదు స్టేజీల మురుగునీటి శుద్ధి ప్రక్రియ జరిగి తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నీటిని శుద్ధి చేయవచ్చు.

# అనుమానస్పదంగా నవవధువు ఆత్మహత్య

## పోలీసులు, పాత్రికేయులపై దాడి..

## గ్రామంలో తీవ్రఉద్రిక్త పరిస్థితులు

**చిన్నశంకరంపేట, మే 4,ప్రభాతవార్త:** పెళ్లయిన మూడు నెలలకే నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం అగ్రహారం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. వెల్దుర్తి మండలం శేరిలా గ్రామానికి చెందిన సాయిలు, మంజుల కూతురు పూజ(24)తో చిన్న శంకరంపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన వట్టెం రాజయ్య కుమారుడు మహేశ్‌తో ఫిబ్రవరి 2న వివా హం జరిగింది. పెళ్లయిన మూడు నెలలకే నవవధువు పూజ శనివారం అత్తింట్లో అనుమానస్పదంగా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో పూజ తల్లిండ్రులు, గ్రామస్తులు భర్త ఇంటిపై దాడికి పాల్పడి ఇంటిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని కుటుంబసభ్యులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించినప్పటికీ వినకుండా పోలీసులను, వార్త సేకరణకు వచ్చిన పాత్రి కేయులపై దాడి చేయగా ఒక పాత్రికేయునికి తీవ్రగాయాలయ్యాయి. తమ కూతురిని హత్యచేసి, ఆత్మహత్యగా చిత్రికరిస్తున్నారని మృతురాలి తల్లి దండ్రులు ఆరోపించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తపరిస్థితులు నెల కొనడంతో రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ సంఘటన స్థలానికి చేరు కొని బంధువులకు నచ్చచెప్పారు. మెదక్ నుండి వచ్చిన క్లూస్‌టీం సభ్యులు వివరాలను సేకరించారు. కుటుంబసభ్యులకు నచ్చచెప్పి తహశీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సంఘటన స్థలాన్ని తూప్రాన్ డిఎస్పీ వెం కటరెడ్డి పరిశీలించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పూజ (ఫైల్)

# విద్యుత్ డిమాండ్‌పై కార్యాచరణ

## ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా కార్యాచరణను రూపొందించాలని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ మేరకు హైదరాబాద్ విద్యుత్ సౌధలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అందుకు తగినట్లుగా రాబోయే ఐదు సంవత్సరాల వరకు పెరిగే డిమాండ్‌ను అంచనా వేయాలన్నారు. అంతేకాకుండా ఆమేరకు పెరిగే కరెంట్‌ను సమర్థవంతంగా సరఫరా చేసేందుకు వీలుగా నెట్వర్క్‌ను బలోపేతం చేయాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ 16877 మెగావాట్లకు చేరుకుంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనా వేసిందని తెలిపారు, కానీ వాస్తవంగా గరిష్ట డిమాండ్ 17162 మెగా వాట్లుగా అంచనాలకు మించి నమోదయ్యిందని తెలిపారు. అలాగే 2026 లో గరిష్ట డిమాండ్ 18138 మెగా వాట్లకు పెరుగుతుందని అంచనా వేసిందని వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక, ఇతర రంగాల అభివృద్ధి నేపథ్యంలో గరిష్ట డిమాండ్ 19000 19500 మెగావాట్లకు మించే అవకాశం ఉన్నందున అధికారులు దానికి తగినవిధంగా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు సైతం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సమర్ధవంతమైన ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణి సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కేంద్రం నిధులిచ్చినా మొండిచేయి ఆరోపణలు..

# కెసిఆర్, రేవంత్‌లకు అలవాటుగా మారింది

## మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** కేంద్రానికి ఎన్నిసార్లు నిధులు కావాలని విజ్ఞప్తులు చేసినా కేంద్రం మొండిచేయి చూపుతుందని ఆరోపించడం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు తెలంగాణకు మంజూరు చేసిందన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టర్మినల్ కోసం గతంలో మాజీ సిఎం కెసిఆర్‌ను భూమి కేటాయించాలని నేను పలుమార్లు కోరడం జరిగింది. అయినా భూములు ఇవ్వలేదన్నారు. అదే రైల్వే భూమిలో నిర్మాణం పూర్తయి ప్రజలకు అంకితమయిన తర్వాత కూడా ఈ నాలుగు నెలల కాలంలో అదనంగా కొత్తగా ఒక్క వీధిలైట్ కూడా వేయలేదని అన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించినా, అక్కడ స్తంభాలు మార్చడానికి, పైపులైన్లు మార్చడానికి గత బిఆర్‌ఎస్ సర్కారు ఆరు సంవత్సరాలు జాప్యం చేసిందన్నారు. కేంద్ర పథకాలు, ప్రాజెక్టుల అమలుకు సహకరించకుండా పనిచేయడం స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యాయి. కేంద్రం నిధులు ఇస్తుంటే కూడా రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించడంలో విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రభుత్వ పథకాల అమలుకు, వివిధ ప్రాజెక్టులకు సహాయనిరాకరణ చేస్తూ, అభివృద్ధి అడ్డంకిగా మారుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.



# పంట రుణాల్లో కోత.. రైతులకు గుండెకోత

## యేటా మారని బ్యాంకుల తీరు

## ఖరీఫ్, రబీలో రూ.90,715 కోట్ల లక్ష్యం..

## ఇచ్చింది రూ.67,183 కోట్లు

## పెట్టుబడి కోసం అన్నదాతల అవస్థలు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** వ్యవసాయంలో అత్యంత కీలకమైన వానాకాలం, యాసంగి సీజనుకు సంబంధించి రుణాల విషయంలో తెలంగాణ రైతుల పట్ల బ్యాంకులు ఉదాసీన వైఖరి అవలం బిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల మేరకు ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకులు ఘోరంగా విఫలమవుతున్నాయి. వార్షిక లక్ష్యాలను గొప్పగా ప్రకటిస్తున్నా వాటిని పూర్తి స్థాయిలో చేరుకోవడం లేదు. ఈ నేపథ్యంలో బ్యాంకుల నుండి అన్నదాతలకు సహకారం నామమాత్రంగానే ఉంటోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత యాసంగితో పాటు, వానాకాలం సీజనులో రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు మొండి చెయ్యి చూపించాయి. లక్ష్యాలు ఘనంగా ఉన్నా, వాటి ఆచరణలో మాత్రం వెనుకబడిపోతున్నాయి. ఈ సీజన్లలో కలిపి ఎస్ఎల్ బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) రూ.90,795.19 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యాలను నిర్థారించింది. ఇందులో వానాకాలంలో 60 శాతం, యాసంగిలో 40 శాతం చొప్పున రైతులకు పంట పంపిణీ చేయాలని బ్యాంకర్లకు నిర్దేశించింది. అయితే గడచిన వానాకాలంలో రూ.54,480 కోట్ల లక్ష్యం పెట్టుకోగా, బ్యాంకులు 24 లక్షల 5 వేల 419 మంది రైతులకు రూ.44,438 కోట్ల రుణాలు మాత్రమే అందించాయి. దీంతో ఆ సీజన్లో లక్ష్యాల కంటే రూ.10 వేల కోట్లను కోత పెట్టింది. ఇక ప్రస్తుత యాసంగి సీజనులో రూ.36,315.19 కోట్ల లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటి వరకూ 15 లక్షల 84 వేల 772 మంది రైతులకు రూ.22,744.92 కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చాయి. ఇలా 2 సీజన్లలో 39 లక్షల 90 వేల191 మంది రైతులకు రూ.67,182.92 కోట్ల రుణాలు(74 శాతం) అందించాయి. అయితే ఈ మేరకు రుణాలు ఇచ్చినట్లు బ్యాంకులు చెబుతున్నా, వ్యవసాయ పెట్టుబడికి కొత్తగా రుణాలు ఇవ్వక, వడ్డీలు కట్టించుకుని ఎక్కువగా బుక్ అడ్జిష్‌మెంట్లు చేయడం విశేషం.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పట్టాదారుల సంఖ్య సుమారు 65 లక్షలు ఉండగా, బ్యాంకులు మాత్రం 33.85 లక్షల మంది రైతులకు మాత్రమే పంట రుణాలు అందచేస్తున్నాయి. ఇంకా 31 లక్షల మంది రైతుల పంట రుణాలు దూరంగా ఉంటున్నారు. ఇక జనవరి చివరి నాటికే జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) కొత్త ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ ప్రణాళికను విడుదల చేస్తోంది. అయితే బ్యాంకర్ల కమిటీ రుణ ప్రణాళికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అలాగే రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ రాష్ట్ర రుణ ప్రణాళికను ఆలస్యంగా విడుదల చేస్తున్నా, జిల్లాల్లో లీడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో జిల్లా రుణ ప్రణాళికలు నఆమోదించడంలో మరింత తీవ్ర జాప్యమవుతోంది. దీంతో పంట రుణాలు ఇవ్వడం ఆలస్యంగా ప్రారంభమవడమే కాకుండా నిర్దేశించిన లక్ష్యాలను చేరక వెనుకబడి పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు సాగు పెట్టుబడి ఖర్చుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేటు అప్పులు చేయక తప్పడం లేదు. వరి, పత్తి లాంటి ఏ పంటలు సాగు చేయాలన్నా ఎకరానికి 40 వేల రూపాయలకు మించిన పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరానికి 12 వేల రూపాయలు మాత్రమే ఇవ్వడంతో సాగు పెట్టుబడి ఖర్చుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద అప్పులు చేస్తున్నారు. ఫలితంగా రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

# పెన్షనర్ల సమస్యలను తీర్చకుంటే ఉద్యమం ఉధృతం

## కార్యాచరణ ప్రకటించిన పెన్షనర్ల జెఎసి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సరాల కావస్తున్న కూడా తమకు సంబంధించిన పెండింగ్ సమస్యలను నేటికీ పరిష్కరించక పోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్య కార్యాచరణ సమితి ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సులో అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకున్న అనంతరం ప్రభుత్వంపై ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. 15న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాల వద్ద భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శ నలు చేయాలని, అదే విధంగా జూన్ 9న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా చేపట్టారు నిర్ణయించారు. ప్రభుత్వం గనుక స్పందించకపోతే రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ కార్యా లయాల్లో పని వేలల్లో మాత్రమే పని చేయడం, ప్రభుత్వ కార్యాలయం నుండి మానవహారాలు, సాంఘిక భోజనాలు చేయడం, పెండౌన్, సామూహిక సెలవులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కనిపిస్తుంది విస్తృత విశాల ఉద్యమాన్ని నిర్మించడానికి వెనుకాడే ప్రసక్తి లేదని, ప్రత్యక్ష కార్యచరణ ప్రకటించాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ సమాజం ఎల్లకాలం అణిచివేతను, సాచివేతను, అలచాట్లను, అవమా నాన్ని పరిచిన చరిత్ర లేదని చైర్మన్ జగదీశ్వర్ అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారం అవుతాయని భావించామని, కాని అవి అపరిష్కృతంగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఉద్యోగసంఘాల ప్రతినిధులు డిమాండ్లను ఆమోదించారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ బిల్స్‌ను క్లియర్ చేయాలని, 5 డిఎలను వెంటనే విడుదల చేయాలి, ఉద్యోగుల (ఈహెచ్ఎస్) ఆరోగ్యం రక్షణ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలుచేయాలి, సిపియస్ ను రద్దు చేయాలి, వేతన సవరణ కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకుని 51శాతం ఫిట్‌మెంట్ తో అమలు చేయాలి, స్థానికత ప్రాతిపదికగా అదనపు పోస్టులు సృష్టించి 317 జిఓ ను అమలు చేయాలి, అన్ని ప్రభుత్వ శాఖలలో పదోన్నతుల కమిటీలను సకాలంలో ఏర్పాటు చేసి పదోన్నతులను ఇవ్వాలి, ఎన్నికల సమయంలో నిర్వహించిన బదలీ చేసిన ఉద్యోగులను తిరిగి వారి పూర్వ స్థానాలకు చేర్చాలి, 2025 సంవత్సరానికి సాధారణ బదలీలు మే, జూన్ లోనే చేయాలి అని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సదస్సులో సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి పి దామోదర్ రెడ్డి, కో చైర్మన్లు చావా రవి, రవీందర్ రెడ్డి, జి సదానందం గౌడ్, దాస్య నాయక్, తిరుపతి, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగారెడ్డి, వైస్ చైర్మన్లు ఎస్ఏ హుసేని (ముజీబ్), చంద్రమోహన్, అంజిరెడ్డి, శ్రీధర్, నరహరి, చంద్రశేఖర్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, తిప్పర్తి యాదయ్య, దామోదర్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్ల జెఎసి సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ముఖ్యనాయకులు

## బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తారు..

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వరా?

## మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వారా అని ప్రశ్నించారు. విద్యార్థుల చదువును, వారి జీవితాలను కాంగ్రెస్ సర్కార్ ప్రశ్నార్థకం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిగ్రీ కాలేజీలకు ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ఆరు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన పథకాన్ని ఎలాంటి మార్పు లేకుండా కేసీఆర్ అమలు చేసి గొప్ప మనసు చాటుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయంలో కరోనా వంటి ఆర్థిక సంక్షోభ కాలం సహా, ఏనాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆపలేదని ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు.బడా కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించరా?. కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరి, విద్యార్థుల పాలిట శాపంగా మారింది. వారి చదువును, జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు. డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచడంలో పడింది. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు.

సకాలంలో పరీక్ష నిర్వహించకపోవడంతో పీజీసెట్, లా సెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారు. ఏప్రిల్ నెలలో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికీ నిర్వహించకపోవడం ప్రభుత్వ చేతగాని తనమే. మరోవైపు ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు డిగ్రీ పరీక్షలు నిర్వహించకుండా నిరసనలు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. కళాశాల యాజమాన్యాలు అప్పులు తెచ్చి బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్న పరిస్థితి. అద్దెలు, అప్పులు పెరిగిపోవడంతో ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లను నిలిపివేయగా, కొన్నిచోట్ల కళాశాలలకు తాళం వేసి ఇప్పటికే సెలవులు ప్రకటించారు.ఇంత జరుగుతుంటే తమకేమీ పట్టనట్లు సీఎం, మంత్రులు వ్యవహరిస్తుండడం సిగ్గుచేటు అని తప్పుపట్టారు. విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివంగత సీఎం వైఎస్ ప్రారంభించిన పథకాన్ని ఎలాంటి మార్పు లేకుండా కేసీఆర్‌అ మలు చేశారు. గొప్ప మనసు చాటుకున్నారు.

కరోనా వంటి ఆర్థిక సంక్షోభ కాలం సహా, ఏనాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆపలేదని తెలిపారు. ప్రతి ఏటా సగటున రూ. రెండు వేల కోట్లు, తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.19 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 17 నెలల్లో 17 పైసలు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేయలేదు.

ఈ ప్రభుత్వ ప్రాధాన్యాల్లో విద్య అనేది మిథ్య అని స్పష్టమవుతున్నదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఇంకా మెరుగైన రీతిలో కొనసాగిస్తామని మేనిఫెస్టోలో చెప్పి, పథకాన్ని మరుగునపడేలా చేశారని ఆరోపించారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని మొన్న నిండు అసెంబ్లీలో ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు గాలి మాటలే అయ్యాయి. రెండు నెలల్లో మొత్తం బకాయిలు క్లియర్ చేస్తామని, కళాశాల యాజమాన్యాలకు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క ఇచ్చిన హామీ నీటి మూటలే అయ్యాయి. మాటమీద నిలబడేది లేదు, ఇచ్చిన హామీలు నెరవేర్చేది లేదు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు అందరిదీ అదే దారిఅని దుయ్యబట్టారు.



టోల్‌గేట్ వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

## విరిగిపడిన టోల్‌గేట్.. నిలిచిపోయిన వాహనాలు

**కొండపాక, మే 4, ప్రభాతవార్త:** రాజీవ్ రహదారిపై దుద్దెడ శివారులోని టోల్‌గేట్ గాలివానకు విరిగిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లా కొండపాక మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై ఉన్న టోల్‌గేట్ రాత్రి బలంగా వీచిన గాలివానకు టోల్ గేట్‌కు ఇరువైపు ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్లపై వేసిన రేకులు, సిగ్నల్ బోర్డులు, ఈ ట్యాగ్ పరికరాలు విరిగి పడిపోయాయి. దాంతో వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు కొంత సేపు అంతరాయం ఏర్పడింది.

## రాష్ట్రంలో ఫార్మర్ ఐడి ప్రాజెక్టు

### ప్రతీ రైతుకు 11 అంకెల యూనిక్

### పిఎం కిసాన్, ఫసల్ బీమాకు తప్పనిసరి

### నేటి నుండి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ ఐడీ ప్రాజెక్టును తెలంగాణలో అమలు చేసేందుకు రాష్ట్ర సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టింది. ఇప్పటికే అగ్రికల్చర్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ల (ఏఈఓ)కు శిక్షణ ఇచ్చిన ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా ప్రారంభించనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలయ్యే ఈ పథకంతో వ్యవసాయ రంగంలో డిజిటల్ విప్లవం రానుందని వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ ఐడీ ప్రాజెక్ట్ కింద ప్రతీ రైతుకు 11 నెంబర్ల యూనిక్ ఐడీ కేటాయిస్తారు. వారికి ఉన్న భూమి రకం, సాగు, వ్యక్తిగత వివరాలను డిజిటల్ రూపంలో ప్రభుత్వం నమోదు చేస్తుంది. ఇది ఆధార్ కార్డుతో లింక్ అయ్యి ఉంటుంది. ఈ 11 అంకెల ఐడీలో రైతు పేరు, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, పట్టాదారు పాస్ బుక్ వివరాలు, భూమి రకం (ఎర్ర నేల, నల్ల నేల, తరి, మెట్ట), సర్వే నెంబర్లు, సాగు చేసిన పంటలు తదితర సమాచారం నమోదు చేస్తారు. ఈ ఐడీ కార్డు ద్వారా ఒక్క క్లిక్ తో రైతుల వివరాలు తెలుసుకోవచ్చు. ఫార్మర్ ఐడీ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. కేంద్రం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డ్, ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు ఇది తప్పనిసరి కానుంది. ఈ ప్రాజెక్టు కింద వివరాలు వ్యవసాయశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. యాప్ లో వివరాలు ఎంటర్ చేసిన తరువాత రైతు మొబైల్ కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని యాప్ లో నమోదు చేయగానే 11 అంకెల ఫార్మర్ ఐడీ జనరేట్ అవుతుంది. ప్రకృతి విపత్తుల సమయంలో ఐడీ నంబర్ ఎంటర్ చేస్తే రైతు సాగు వివరాలు తెలుస్తాయి. పేపర్ వర్క్ లేకుండా ఒకే ఐడీతో అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ ఐడీ ద్వారా రైతుల సాగు వివరాల చిట్టా అంతా ఒకే క్లిక్ తో తెలుసుకోవచ్చు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు ఈ ఫార్మర్ ఐడీ అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ స్పష్టం చేసింది.

## క్షణికావేశంలో ప్రేమజంట ఆత్మహత్య

**రాజాపూర్, మే 4, ప్రభాతవార్త:** క్షణికావేశంలో ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరేవల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఎస్సై శివానంద్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎట్టి జంగయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు ఎట్టి శివప్రసాద్ (17) గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరిద్దరికీ వయస్సు లేకపోవడంతో తల్లిదండ్రులు నచ్చజెప్పి, వచ్చే సంవత్సరం పెళ్లి చేస్తామని బుజ్జగించారు. ఆదివారం మధ్యాహ్నం ఏమైందో తెలియదు కానీ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎట్టి శివప్రసాద్ ఓ వ్యవసాయ పొలం పశువుల కొట్టంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాలను పోలీసులు జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. యువకుడి తండ్రి జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివానంద్ తెలిపారు.

## ఎల్ఆర్ఎస్ గడువు

## నెలాఖరు వరకు మళ్లీ పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) గడువు పెంపుపై కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ ఫీజుపై ఇస్తున్న 25శాతం రాయితీని మరో నెల రోజుల పాటు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి నెల నుంచి అమల్లో ఉన్న ఎల్ఆర్ఎస్ గడువును ఇప్పటికే ఒకసారి పెంచారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ గడువు పూర్తికావడంతో.. మళ్లీ మూడోసారి అదనంగా పెంచిన ప్రభుత్వం.. ప్రస్తుతం నెల రోజులు ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)లో 20లక్షల మంది ఫీజు చెల్లించాల్సిన దరఖాస్తుదారులు ఉన్నారు. వారిలో ఇప్పటి వరకు 6లక్షల మంది మాత్రమే ఫీజు చెల్లించేందుకు ముందుకు రావడంతో పురపాలక శాఖ అధికారులు గడువును పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి సూచనలు చేశారు. దీంతో ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు రాయితీ గడువు పెంపుతూ నిర్ణయించింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారిలో 40శాతం మందికి అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఎల్ ఆర్ఎస్‌పై ఇప్పటి వరకు ప్రభుత్వానికి సుమారు రూ.1900 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ నెలాఖరు వరకు రాయితీ గడువు పెంపుతో ప్రభుత్వానికి మరింత ఆదాయం చేకూరే అవకాశం ఉంది.

# గొర్రెల పంపిణీ స్కాంపై యేడాదిన్నరగా సాగుతున్న ఎసిబి విచారణ

### ఇంకా పట్టుబడని ఇద్దరు అసలు నిందితులు

### రూ.2.10 కోట్లతో మొదలై రూ.700 కోట్లకు చేరిన కుంభకోణం

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ సర్కారు ఏలుబడిలో వెలుగు చూసిన గొర్రెల పంపిణీ స్కాంపై ఎసిబి విచారణ ఏడాదిన్నరగా సాగుతున్నా పెద్దగా పురోగతి లేదనే విమర్శలు వున్నాయి. ఈ గోల్‌మాల్‌లో అసలు నిందితులు కాంట్రాక్టర్ మొయినుద్దీన్ అలియాస్ మొయిద్ అతని కుమారుడు ఇక్రముద్దీన్ ఇప్పటి వరకు పట్టుబడలేదు. రూ.2.10 కోట్ల రూపాయల స్కాంగా మొదలైన ఈ కుంభకోణం 700 కోట్ల రూపాయలకు చేరడం ఎసిబి అధికారులనే ఆశ్చర్యప రిచింది. ఈ కేసులో 15 మంది నిందితులు అరెస్టయినా అసలైన వారు ఇద్దరు ఇంకా దొరక్క పోవడంతో విచారణ ముందుకు సాగడం లేదని ఎసిబి అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో పెద్ద తలకాయలు వుండడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదనే విమర్శ బలంగా వుంది.

పెద్దపెద్ద కుంభకోణాలు కూడా చిన్నస్థాయిలో జరిగే పొరపాట్ల వల్లే వెలుగు చూస్తాయనడానికి గొర్రెల పంపిణీ స్కాం ఒక ఉదాహరణగా చెప్పాలి. రాష్ట్రంలో 2023 నవంబర్‌లో వెలుగు చూసిన గొర్రెల నిధుల గోల్‌మాల్ కేసులో కేవలం రెండు కోట్ల పది లక్షల రూపాయల చెల్లింపుల వద్ద జరిగిన పేచీ మొత్తం గోల్ మాల్‌ను రట్టు చేసింది. ఎపిలోని కొందరు రైతుల వద్ద గొర్రెలు ఖరీదు చేసి వారికి రెండు కోట్ల పది లక్షల రూపాయలను ఎగ్గొట్టినందుకు నమోదైన చీటింగ్ కేసు ఆ తరువాత భారీ స్కాంగా మారి గచ్చిబౌలి పోలీసు స్టేషన్ నుంచి ఎసిబికి బదిలీ అయ్యింది. అప్పటి సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం వాస్తవంలో గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఎంతగానో ప్రయోజనకరంగా వుందని రైతుల నుంచి ప్రశంసలు వచ్చాయి. రాష్ట్రంలో మాంసం వినియోగం పె రగడంతో దానికి తగినట్లుగా గొర్రెలు, మేకల ఉత్పత్తి పెరగాలని భావించి అప్పటి సర్కారు ఈ పథకాన్ని ప్రవేశపెట్టినా అధికారులు, కొందరు నాయకుల చేతివాటం వల్ల ఏకంగా 700 వందల కోట్ల రూపాయల స్కాంగా మారింది. 2024 జనవరిలో రట్టయిన గొర్రెల పంపిణీ నిధుల స్వాహా కేసు అంతకు ముందే గచ్చిబౌలి, నాంపల్లి పోలీసు స్టేషన్‌లలో వేరు వేరుగా నమోదయ్యాయి. తెలంగాణలో మంచి బ్రీడ్ గొర్రెలను రైతులకు అందించేందుకు ఈ పథకం ప్రవేశపెట్టగా ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు పశు సంవర్ధక శాఖ అధికారులు వెళ్లి మేలు రకమైన గొర్రెలను కొని ఇక్కడి రైతులకు సబ్సిడీగా అందించాల్సి వుంది. ఈ క్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు ఎపి సహా పలు రాష్ట్రాలకు వెళ్లి మేలు రకమైన గొర్రెలను కొనుగోలు చేసి వాటిని వాహనాలలో తెలంగాణ కు తరలించి ఇక్కడి రైతులకు సబ్సిడీ రూపంలో అందించామని అప్పట్లో అధికారులు ప్రచారం చేసుకున్నారు. అయితే ఇక్కడే స్కాంకు తెరలేచిందని ఎసిబి అధి కారులు గుర్తించారు. గొర్రెల కొనుగోలు సమయంలో ఆయా రాష్ట్రాలకు చెందిన అధికారులతో ఇక్కడి పశు సంవర్ధక శాఖ అధికారులు మాట్లాడకుండా మధ్యవర్తు లు, దళారులతో మాట్లాడి వారిని గొర్రెల రిసైక్లింగ్‌కు ముందుగానే ఒప్పించి కొంత కమీషన్ ఇచ్చి, వారి ద్వారా తమకు నచ్చిన జీవాలను కొన్నారు. ఇందులో మేలు రకం జీవాలు ఎన్నీ, సాధారణ రకం ఎన్నీ అనేదానిపై లెక్కలు లేవని ఎసిబి అధికారుల విచారణలో తేలింది. దీని తరువాత వీటిని తెలంగాణలో తాము ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇచ్చి ఫోటోలు దిగిన తరువాత వాటిని మరో బృందం లబ్దిదారులకు, ఆ తరువాత ఇంకో బృందం లబ్దిదారులకు ఇలా పది అంత కు ఎక్కువ సంఖ్యలో లబ్దిదారులకు ఇవ్వడం ద్వారా పశు సంవర్ధక శాఖ అధికారులు స్కాంకు పాల్పడినట్లు ఎసిబి అధికారులు తేల్చారు. ఈ క్రమంలో లబ్దిదా రులకు కొంతమేర నగదు ఇచ్చి వారు ఎవరికీ చెప్పకుండా చూసినట్లు తేలింది. గొర్రెల కోసం గట్టిగా కోరిన కొందరు లబ్దిదారులకు మాత్రమే గొర్రెలు, మేకలు ఇ చ్చారని, నగదుకు సరే అన్నవారికి కొంత మేర డబ్బులు ఇచ్చేసి ఎవరు మాట్లాడకుండా చేయగలిగారని, ఈ క్రమంలోనే దళారులు, మధ్యవర్తులతో పశు సంవర్ధ క శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని ఎసిబి గుర్తించింది. ఇందుకోసం సర్కారుకు ఇచ్చిన బిల్లులన్నీ నకిలీవని, వాహనాల నంబర్లు కూడా నకిలీవని ఎసిబి విచా రణలో తేలింది.

ఈ పథకం కోసం సర్కారు అప్పట్లో నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించగా ఇందులో 700 కోట్ల రూపాయలు దారి మళ్లినట్లు ఎ సిబి తేల్చింది. కొన్నిచోట్ల ముసలి జీవాలు, అనారోగ్యంతో వున్న జీవాలను లబ్దిదారులకు అంటగట్టారని ఎసిబి గుర్తించింది. ఈ వ్యవహారమంతా అప్పట్లో గొర్రె లు, మేకల కొనుగోలుకు సంబంధించి సర్కారు ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా వున్న పశు సంవర్ధక శాఖ సిఈఓ సభావత్ రాంచందర్ నాయక్‌తో పాటు ఆ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ కుమార్‌లకు తెలిసే జరిగిందని ఎసిబి అధికారులు తేల్చారు. రైతులకు గొర్రెలు, మేకలు అందించకు ండానే సరఫరా చేసినట్లు, సర్కారుకు తప్పుడు లెక్కలు ఇచ్చి 700 కోట్ల రూపాయల సర్కారు నిధులకు దళారులు, మధ్యవర్తులు, దళారులు, కొందరు పశు స ంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఈ స్కాంలో నిధులను వీరిద్దరితో పాటు కాంట్రాక్టర్ మొయినుద్దీన్, అతని కుమారుడు ఇక్రముద్దీన్‌లు కాజేశారని ఎసిబి అధి కారులు భావిస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా వున్న కల్యాణ్, రాంచందర్ సహా అప్పటి పశుసంవర్ధక శాఖ అధికారులు, దళారులు మొత్తం 15 మందిని ఎ సిబి అరెస్టు చేసింది. ఈ కేసులో పలువురు నాయకులను ఎసిబి అరెస్టు చేయనుందని వార్తలు వచ్చాయి. వారిని విచారించనున్నారని ప్రచారం జరిగినా అలా జరగలేదు. ఎసిబి విచారణలో ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తులను జప్తు చేయలేదు, నిందితుల బ్యాంకు ఖాతాలను కొన్నింటిని జప్తు చేసినా వాటిలో పెద్దగా నగ దు లేదని సమాచారం. ఈ కేసులో అసలు నిందితులుగా చెబుతున్న మొయినుద్దీన్, ఇక్రముద్దీన్‌లు అరెస్టయితే కానీ విచారణ ముందుకు సాగేలా లేదు. మరో వై పు ఇదే కేసులో మనీలాండరింగ్ కోణంలో ఈడీ కూడా విచారణ చేబట్టి పలువురిని విచారించి వాంగ్మూలం తీసుకుంది. మొత్తం మీద గొర్రెల పంపిణీ స్కాంపై ఏడాదిన్నరగా సాగుతున్న విచారణలో పెద్దగా పురోగతి లేదనే విమర్శలు వున్నాయి. ఈ కేసులో పెద్ద తలకాయలు వుండడం వల్లే విచారణ సవ్యంగా సాగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

# నగరంలో మొదలైన ప్రపంచ సుందరీమణుల సందడి

### మిస్ బ్రెజిల్ జెస్సికా, మిస్ సౌత్‌ఆఫ్రికా జోయలైజ్ రాక

### మిస్ వరల్డ్ పోటీలకు ముస్తాబవుతున్న హైదరాబాద్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** హైదరాబాద్‌లో ప్రపంచ సుందరీమణుల సందడి మొదలైంది. ఈ నెల 10న హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రపంచ అందగత్తెలు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న మిస్ బ్రెజిల్ జెస్సి కా స్కెన్డియుజ్క్ పెడ్రోసో శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు ఆదివారం ఉదయం చేరుకున్నారు. శంషాబాద్‌కు చేరుకున్న మిస్ బ్రెజిల్ కు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు. కాగా, మిస్ వరల్డ్ సీఈవో, చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి, మిస్ కెనడా మిస్ ఎమ్మా దయన్నా క్యాథరీన్ మొర్రిసన్ లు ఇప్పటికే చేరుకున్నారు. కాగా, మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు మిస్ సౌత్ ఆఫ్రికా జోయలైజ్ జన్సె న్ వాన్ రెన్స్ బర్గ్ ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇప్పటివరకు కెనడా, బ్రెజిల్, సౌత్ ఆఫ్రికా కు చెందిన ప్రతినిధులు హైదరాబాద్ వచ్చారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మిస్ సౌత్ ఆఫ్రికాకు తెలంగాణ ప్రభుత్వ అధికారుల బృందం స్వాగతం పలికింది. ఈ మిస్ వరల్డ్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6 వ తేదీ నుండి హైదరాబాద్‌కు మరింత మంది చేరుకుంటారు. మే 10 నుంచి 31 వరకు పోటీలు జరగనున్నాయి. మూడు వారాల పాటు 120 దేశాలకు చెందిన అందగత్తెలు హైదరాబాద్‌లో సందడి చేయనున్నారు. ఈ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. తొలిసారి హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి. గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. మే 31న ఫైనల్స్ ఉంటాయి. ఈ పోటీల్లో పాల్గొనే బ్యూటీలు మే 8లోపు హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో మహానగరం ప్రపంచ సుందరీమణుల పోటీలకు ముస్తాబవుతోంది. రహదారులు, కూడళ్లు, పర్యాటక కేంద్రాలు, ముఖ్యమైన భవాలను అందంగా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. అందాల భామలు,అతిథులు తిరిగే రహదారులపై గుంతల్లేకుండా చూసుకోవడం, లేన్ మార్కింగ్, కాలిబాటలు, కూడళ్ల సుందరీకరణ, పచ్చదనం ఏర్పాట్లను యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని కమిషనం ఆర్‌వి.కర్ణన్ ఆ దిశగా యంత్రాంగానికి ఆదేశాలు సైతం జారీ చేశారు. ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేవారు ఇప్పటికే నగరానికి చేరుకోవడం ప్రారంభించారు.పోటీదారులు, అతిథులు శంషాబాద్ విమానాశ్రయం నుంచి నగరంలోకి చేరుకునే అన్ని రోడ్లను బల్దియా చక్కదిద్దుతోంది.అటువైపు వెళ్లే రోడ్లు, చుట్టుపక్కల ప్రాంతాలను ముస్తాబు చేయాలని నిర్ణయం తీసుకుంది. రోజంతా పారిశుద్ధ్య నిర్వహణకు జోనల్, సర్కిళ్ల స్థాయిలో కమిటీలు వేసింది. 151 కి.మీ. రోడ్లను కేంద్ర కార్యాలయం మ్యాపింగ్ చేసి, పర్యవేక్షణకు ఉన్నతాధికారులను బాధ్యులుగా నియమించింది. ప్రపంచ సుందరి పోటీలకు సంబంధించిన ప్రచార కార్యక్రమాలను సైతం జీహెచ్ఎంసీ చేపట్టబోతోంది. నగరంలో ఉన్న 250 బస్టాపులపై ఫ్లెక్సీ బోర్డులు, పలు వారసత్వ కట్టడాలు, రహదారుల్లో రూ.1.8 కోట్లతో ఎల్ఈడీ విద్యుద్దీపాల ఏర్పాటు, సెల్ఫీ పాయింట్లు, ఇతరత్రా ఏర్పాట్లు పురోగతిలో ఉన్నాయి. పోటీదారులు, అతిథులు ఆ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో విహరించే అవకాశం ఉండటంతో రూ.1.89 కోట్లతో వంతెనలపై క్రాష్ బారియర్లు, రోడ్ల డివైడ్లు, కాలిబాటలకు రంగులు సైతం వేస్తున్నారు. యూటర్న్‌లు, రహదారులకు మరమ్మతులు, లేన్ మార్కింగ్ చేస్తున్నారు. చౌమహల్లా ప్యాలెస్,చార్మినార్, తదితర ప్రాంతాలనూ అతిథులు సందర్శిస్తారని అధికారులు చెబుతున్నారు. అక్కడా మరమ్మతులు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది.

**మిస్ వరల్డ్ బ్యూటీలపై టాలీవుడ్ కన్ను**

ప్రస్తుతం టాలీవుడ్ పాన్ వరల్డ్ సినిమాలు తీసే స్థాయికి ఎదిగింది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో జరగబోయే మిస్ వరల్డ్ పోటీలపై టాలీవుడ్ దర్శక నిర్మాతలు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పోటీల్లో తమ అందం, అభినయంతో అలరించే అందగత్తెలతో సినిమా ఒప్పందాలు చేసుకోవడానికి వారు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. టైటిల్ గెలవని అందమైన ముద్దుగుమ్మలను సైతం తమ సినిమాల్లో నటింపజేసేందుకు మేకర్స్ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

# స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు

### జూలైలో నిర్వహించేందుకు ముహూర్తం ఫిక్స్

### ఈలోగా పెండింగ్ బిల్లుల చెల్లింపులకు కసరత్తు

**హైదదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** స్థానిక సంస్థలకు ఎన్నికలు జులైలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కుల గణన కారణంగా ఎన్నికలు వాయిదా పడినప్పటికీ, నిధుల కొరతతో ప్రభుత్వం నష్ట పోతున్నందున ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. బిసి నాయకులతో సమావేశమై ముఖ్యమంత్రి తన నిర్ణయాన్ని చెప్పగా.. వారు కూడా సమ్మతించినట్లు తెలిసింది. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చిహ్నాల ఖరారు, బ్యాలెట్ పత్రాల ముద్రణ వంటి ముందస్తు ఏర్పాట్లను కూడా ఎన్నికల సంఘం పూర్తి చేసింది. ఇప్పటికే పదవీ కాలం ముగిసిన గ్రామీణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రెండు నెలల క్రితమే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసినప్పటికీ, కుల గణన, బీసీ రిజర్వేషన్ పెంపు ప్రక్రియతో స్థానిక ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ నియామకాల్లో విడివిడిగా 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీ తీర్మాన చేసి కేంద్రం ఆమోదం కోసం పంపింది. కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని ఇటీవల నిర్ణయించింది. ఈ సంవత్సరం చివరిలో జన గణన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జనాభా సర్వే పూర్తి కావడానికి కనీసం రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. పంచాయతీల పదవీ కాలం 2024 జనవరి 31వ తేదీన, జిల్లా, మండల పరిషత్‌ల గడువు 2024 జులైలో ముగిసింది. స్థానిక సంస్థలకు పాలక మండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. కాబట్టి, ఎన్నికలు ఇంకా ఆలస్యం అయితే ప్రభుత్వం ప్రతి సంవత్సరం 1,500 కోట్లు నష్టపోతుంది. కేంద్రం కుల గణనపై ప్రకటనతో తాజాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన బిసి నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించి ఎన్నికల గురించి చర్చించారు. పాలక మండళ్లు లేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోందని వివరించారు. పంచాయతీలకు నిధులు, సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి ఉందని. దీనిపై మరో మారు జరిగే సమావేశంలో చర్చించే అవకాశం ఉందని సమాచారం. జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ఈలోగా పెండింగ్ బిల్లుల బకాయిలు చెల్లించేందుకు కసరత్తు చేయనున్నట్లు తెలుస్తోంది. కుల గణన పూర్తయ్యే వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా వేచి ఉండలేమన్న సీఎం అభిప్రాయంతో చాలా మంది నాయకులు ఏకీభవించారు. తెలంగాణలో కుల గణనకు, స్థానిక సంస్థల ఎన్నికలకు ఎటువంటి సంబంధం లేదని, ఎన్నికలకు వెళ్లవచ్చని సిఎంవంత్ రెడ్డి చెప్పారు. అవసరమైతే ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు కూడా బిసి నాయకులు అంగీకరించారు. కాకపోతే స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం టిక్కెట్ల హామీ ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, చిహ్నాలను ఖరారు చేయడం, రాష్ట్రంలో బ్యాలెట్ పత్రాలను ముద్రించడం వంటి ముందస్తు ఎన్నికల కసరత్తులను రాష్ట్ర ఎన్నిక సంఘం ఇప్పటికే పూర్తి చేసింది. ఫిబ్రవరిలోనే మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించాలని జిల్లా ఎన్నికల అధికారులను కూడా కోరినట్లు తెలిసింది.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా విడుదల

### లబ్ధిదారుల ఎంపికలో ఎఐ టెక్నాలజీ

**హైదరబాద్, మే 4, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత కోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తోంది. అధికారులు తయారుచేసిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత, ఆన్‌లైన్‌లో కృత్రిమ మేధస్సు ద్వారా మరింత లోతుగా విశ్లేషిస్తున్నారు. అనర్హులను గుర్తించి, అర్హులైన వారికి మే 10లోగా ప్రొసీడింగ్‌లు జారీ చేసి, ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కొన్ని చోట్ల అర్హుల జాబితాలను ఆయా గ్రామాల్లో ప్రదర్శించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం పక్కాగా చర్యలు తీసుకుంటోంది. ఈ లక్ష్య సాధనలో భాగంగా.. అధికారులు రూపొందించిన లబ్ధిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇదివరకే ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందజేసిన జాబితాలను క్షత్రస్థాయిలో అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. అనర్హులను గుర్తించి తొలగించడంతోపాటు.. అర్హులను గుర్తించి వారి వివరాలను గ్రామ, వార్డు స్థాయిలో ప్రదర్శించారు. ఈ ప్రక్రియ మరింత పారదర్శకంగా.. కచ్చితత్వంతో ఉండాలనే ఉద్దేశ్యంతో.. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను నేరుగా ఆన్‌లైన్ ద్వారా గృహనిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపనున్నారు. అక్కడ అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) సహాయంతో ఈ వివరాలను మరింత లోతుగా విశ్లేషిస్తారు. లబ్ధిదారుల పేర్లు, ఆధార్ నంబర్లు, చిరునామాలు .. ఇతర సంబంధిత సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించిన తర్వాత, తుది జాబితాను తిరిగి జిల్లా స్థాయి అధికారులకు పంపుతారు. ఈపరిశీలన తర్వాత అర్హత సాధించిన వారికే ఇళ్ల నిర్మాణం కోసం తదుపరి ప్రక్రియలు ప్రారంభమవుతాయి. ముందుగా అనుకున్న దాని ప్రకారమే.. అధికారుల తుది పరిశీలన మే 2వ తేదీన ముగిసింది. అనంతరం అర్హులైన వారి జాబితాను ప్రదర్శించి.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో 5వ తేదీలోగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు జారీ చేయాలని భావించారు. అయితే.. ఆన్‌లైన్ పరిశీలన ప్రక్రియ మరింత సమయం తీసుకునే అవకాశం ఉండటంతో.. ప్రొసీడింగ్‌ల జారీకి రెండు మూడు రోజులు అదనంగా పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాల్లోని మున్సిపాలిటీలు.. మండలాల్లో ఆన్‌లైన్ డేటా నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది. శుక్రవారం నాటికి సుమారు పది మండలాల్లో ఈ ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో పూర్తయిన జాబితాల వివరాలు నేరుగా జిల్లా కలెక్టర్ లాగిన్‌కు చేరుతాయి. లబ్ధిదారులు కచ్చితంగా తమ ఇంటి నిర్మాణాలను 600 చదరపు అడుగల విస్తీర్ణంలోపే నిర్మించుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఇళ్లు మంజూరైన వారిలో ఎవరైనా అనర్హులని తేలితే వారికి కేటాయించిన ఇంటిని రద్దు చేస్తామని కూడా అధికారులు తెలిపారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని గృహనిర్మాణ శాఖలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సంస్థ సిబ్బంది ఆధునిక సాఫ్ట్‌వేర్‌లో కృత్రిమ మేధస్సును ఉపయోగించి లబ్ధిదారుల సమగ్ర వివరాలను పరిశీలిస్తారు. ముఖ్యంగా... ఎంపికైన వ్యక్తికి 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నా, పట్టణంలో సొంత ఇల్లు ఉండి గ్రామంలో ఇల్లు పొందుతున్నా.. లేదా నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండి కూడా లేదని తప్పుడు సమాచారం ఇచ్చినా.. అలాంటి వారిని కృత్రిమ మేధస్సు సహాయంతోగుర్తించి అనర్హులుగా ప్రకటిస్తారు. దీని కోసం.. ఆయా వ్యక్తులు వివిధ సందర్భాల్లో ప్రభుత్వ సంస్థలకు సమర్పించిన డేటాను ప్రామాణికంగా తీసుకుంటారు. మండలాల్లో ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యం అవుతున్నందున.. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి మరో రెండు మూడు రోజులు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తెలిపిన తర్వాత జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు జారీ చేస్తారు.



# వేసవి కాలం, పెళ్లిళ్ల సీజన్

### బాల్య వివాహాలపై పోలీసు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నజర్

### అలంకారప్రాయంగా మారిన గ్రామ కమిటీలు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు ముగిసి, వేసవి కాలం మొదలై వివాహాల సీజన్ జోరందుకోవడంతో బాల్య వివాహాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సమాచారం అందింది. దీనిపై ఈ రెండు శాఖలు తీవ్రంగా దృష్టి సారించాయి. గత ఏడాది వందకు పైగా బాల్య వివాహాలు జరిగినట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ గుర్తించగా ఈ వివాహాలన్నీ వేసవి సెలవుల్లోనే జరిగాయని నిర్ధారణ అయ్యింది. ఇందులో 70 వివాహాలపై సమాచారం అందగా వాటిని అడ్డుకోగలిగిన అధికారులు మిగతా వాటి గురించి సరైన సమాచారం లేకపోవడంతో ఏమీ చేయలేక పో యారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు బాల్య వివాహాలపై సమాచారం అందగా పోలీసులతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు రంగంలో దిగి వివాహాలను నిలిపివేసి బాలికలను బాలికల సదన్‌కు తరలించి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. మే నెలాఖరు వరకు మరిన్ని బాల్య వివాహాలు జరిగే వీలుందని అందిన సమాచారంపై మహిళా, శిశు సంక్షేమ శాఖ పోలీసు శాఖను అప్రమత్తం చేసింది.

దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మహిళలకు సంబంధించి అనేక రంగాల్లో పురోగతి సాధిస్తుండగా బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుండడం సర్కారీ విభాగాల పనితీరుకు మచ్చలా వుంది. అమ్మాయిలు పుట్టగానే ఎంత వేగంగా దించుకుందామనే భావన కలిగిన తల్లిదండ్రులు ఇప్పటికీ ఎక్కువ సంఖ్యలో వుండడం ఇందుకు కారణమని ఓ సర్వేలో తేలింది. పదవ తరగతి, ఇంటర్ పూర్తయిన అమ్మాయిలకు మైనారిటీ తీరకముందే వివాహాలు చేస్తున్న ఉదంతాలు రాష్ట్రంలో ఎక్కువగా వున్నాయని ఆ సర్వేలో తేలింది. ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల గ్రామీణ ప్రాంతాలలో ఈ పద్దతి ఎక్కువగా వుందని ప్రభు త్వ విభాగాల సర్వేలోనూ తేలింది. అమ్మాయిలకు 16 ఏళ్లలోపే వివాహాలు చేసే సంస్కృతి పోవాలని అధికారులు పదే పదే చెబుతున్నా చాలా చోట్ల తల్లిదండ్రులు దీనిని పట్టించుకోవడం లేదని బాల్య వివాహాలు తేటతెల్లం చేస్తున్నాయి. బాల్య వివాహాలకు ప్రధాన కారణం పేదరికం, అప్పుల కారణంగా చెబుతున్నా రు. దీంతో పాటు గ్రామాలలో అమ్మాయిలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేసే ఆనవాయితీ వుండడం మరో కారణం. ఇదే సమయంలో యుక్త వయస్సులో సోషల్ మీడియా ప్రభావం వల్ల ప్రేమలు, ఇతరుల పట్ల ఆకర్షితులవుతుండడం వంటి కారణాలు, వీటివల్ల కుటుంబ పరువు పోతుందనే భావనతో పదవ తరగ తి, ఇంటర్ పూర్తవగానే గ్రామీణ ప్రాంతాలలో అమ్మాయిలకు వివాహాలు చేస్తున్న ఉదంతాలు పెరుగుతున్నాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల పరిశీలన లో తేలింది. దీంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో వుండే ఆస్తులు, కుటుంబ బంధుత్వాలను చాలా మంది వదులుకోవడానికి ఇష్టపడడం లేదని, దీనివల్ల చిన్న వయస్సులోనే అమ్మాయిలకు వివాహాలు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల అబ్బాయిల వయస్సు పదేళ్లు పెద్దగా వున్నా ఆస్తి వుంటే పట్టించు కోవడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు అమ్మాయిలకు వేధింపుల వంటి చేదు అనుభవాలు ఎదురవక ముందే వివాహాలు చేయడం మంచిదనే భావన చాలామందిలో వుందని అధికారులు గుర్తించారు. ఈ తరహా వివాహాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసుల సహకారంతో అడ్డుకున్నారు. మరో ఘటనలో ఏడవ తరగతి చదివిన బాలిక వివాహం నిశ్చయమైనట్లు అందిన సమాచారంపై పోలీసులు రంగంలో దిగి దానిపై కేసు నమోదు చేశారు. పాల్వంచలో ఇది వెలుగు చూసింది

**అలంకార ప్రాయంగా మారిన గ్రామ కమిటీలు**

ఇదిలావుండగా గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాలను అడ్డుకునేందుకు గ్రామ కమిటీలకు అధికారాలు వున్నా ఇవి అలంకార ప్రాయంగానే మారిందనే విమ ర్శలు వున్నాయి. ఆయా గ్రామాలలో జరిగే బాల్య వివాహాలపై ఈ కమిటీలకు కచ్చితమైన సమాచారం వున్నా పెద్దగా స్పందించడం లేదనే ఆరోపణలు వున్నా యి. వేసవి కాలంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే వీలుండడంతో ఈ కమిటీలు మరింత శ్రద్ధతో పనిచేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

# 'లోర్వెన్ ఎఐ' స్టూడియో లాంచ్



'మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతున్న టెక్నాలజీని సినీ రంగంలోకి పరిచయం చేయాలనే దృఢ సంకల్పంతో దిల్ రాజు 'లోర్వెన్ ఎఐ' స్టూడియోని లాంచ్ చేయడం అభినందనీయం. 'లోర్వెన్ ఎఐ' స్టూడియో ఎంటర్‌టైన్‌మెంట్ వరల్డ్ ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను అన్నారు. తెలంగాణ ఐటీ మినిస్టర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు 'లోర్వెన్ ఎఐ' స్టూడియోని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ ఈవెంట్ కి తెలంగాణ ఐటీ మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ పరిశ్రమకు చెందిన అతిరథమహారథులు హాజరైన ఈ వేడుకు చాలా గ్రాండ్ గా జరిగింది.

'లోర్వెన్ ఎఐ' స్టూడియో లాంచ్ ఈవెంట్‌లో తెలంగాణ ఐటీ మినిస్ట శ్రీధర్ బాబు మాట్లాడుతూ,నా మిత్రుడు దిల్ రాజు మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతున్న టెక్నాలజీని సినీ రంగంలోకి పరిచయం చేయాలనే దృఢ సంకల్పంతో ఈరోజు 'లోర్వెన్ ఎఐ' స్టూడియోని లాంచ్ చేస్తున్న సందర్భంలో వారికి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. క్వాంటం నెక్స్ట్ లెవెల్ ఆఫ్ టెక్నాలజీ. వారు 'లోర్వెన్ ఎఐ' స్టూడియోలో భాగస్వామ్యం కావడం అభినందనీయం. టెక్నాలజీతో కొత్త అవకాశాలు తెరపైకి వస్తాయి. కొత్త కొత్త ఉద్యోగాలు వస్తాయి. దిల్ రాజు లాంటి కింగ్ ఆఫ్ మూవీ ప్రొడక్షన్ ప్రొడ్యూసర్ ఎఐలోకి రావడం శుభ పరిణామం. ఇది అద్భుతమైనటువంటి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.

నిర్మాత దిల్ రాజ్ మాట్లాడుతూ, ఎఐ గురించి గత రెండేళ్లుగా డిస్కషన్ స్టార్ట్ చేశాం. మా కంపెనీ నుంచి స్టార్ట్ అయిన టీం, క్వాంటంతో కలిసి సినిమా గురించి డెవలప్ చేయాలని నిర్ణయించుకున్నాం. 360 డిగ్రీస్ సినిమాని ఎలా చేయొచ్చు అనేది క్రియేటివ్‌గా డెవలప్ చేయడం జరిగింది. స్క్రిప్టు ఐడియా నుంచి స్క్రిప్ట్ ఫైనల్ అయ్యేవరకు ఒక స్టేజ్. న్యూ కమ్మర్స్‌కి ఇది చాలా యూజ్ ఫుల్‌గా ఉంటుందని డెవలప్ చేయడం జరిగింది. స్క్రిప్ట్ అయిపోయిన తర్వాత మేజర్‌గా ప్రీ ప్రొడక్షన్ గురించి ఎంత టెన్షన్ పడుతున్నామో సినిమా వాళ్లకి తెలుసు. సెకండ్ స్టేజ్ ప్రీ ప్రొడక్షన్. తర్వాత షూటింగ్ ప్రాసెస్, పోస్ట్ ప్రొడక్షన్. తర్వాత ప్రమోషన్స్. ఇలా స్టెప్ బై స్టెప్‌గా డెవలప్ డెవలప్ చేయడం జరిగింది. స్క్రిప్ట్ అయిపోయిన తర్వాత చేసే ప్రీ ప్రొడక్షన్‌ని ఎఐలో ఎలా చేయొచ్చు అనేది చేయడం జరిగింది. అది చాలా మిరాకిల్‌గా అనిపిస్తుంది. చాలామంది డైరెక్టర్స్‌కి ప్రొడ్యూసర్స్‌కి దీని గురించి చూపించడం జరిగింది. పోస్ట్ ప్రొడక్షన్లో డైరెక్టర్ ఏది అనుకుని సినిమాని తీశాడు ఫైనల్ కట్ సినిమా చూడొచ్చు. 'లోర్వెన్ ఎఐ' అనేది ఎమోషన్ లేని ఒక ఫస్ట్ ఎడిగా భావించవచ్చు. ఇది డైరెక్టర్స్‌కి క్రియేటివ్ సైట్ చాలా హెల్ప్‌ఫుల్‌గా ఉంటుంది. మా సంస్థలో రూపొందుతున్న విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన సినిమా తీస్తున్న డైరెక్టర్ రవికిరణ్ ఇందులో వర్క్ చేస్తు న్నాడు. అలాగే ఒక విఎఫ్ఎక్స్ సినిమాచేయబోతున్నాం. దాని వర్క్‌కూడా ఇందులోనే జరుగుతుంది. అలాగే ఒక స్క్రిప్ట్ ని కూడా ఇందులోనే డెవలప్ చేస్తున్నాం. మా కంపెనీ కాకుండా మిగతా ప్రొడ్యూసర్స్ ప్రొడక్షన్ హౌసెస్ 'లోర్వెన్ ఎఐ' కావాలనుకుంటే సంప్రదించొచ్చు. అందరికీ థాంక్యు వెరీ మచ్ అన్నారు.

నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ దిల్ రాజు పాతికేళ్లుగా నాకు తెలుసు. ఎంటర్టైన్మెంట్ ఇండస్ట్రీలోకి ఏఐ ని ప్రవేశ పెట్టడంలో ముందడుగు వేశారు. సినిమా ఇండస్ట్రీకి ఎఐ ఒక కోలాబరేటరీ అని భావిస్తున్నాను. తన ప్రతిష్టాత్మకమైన కంపెనీని లోగోని లాంచ్ చేసిన అవకాశం ఇచ్చిన దిల్ రాజుకి ధన్యవాదాలు. సినిమా రషెస్ చూపించి రిజల్ట్ ఏమిటని ఎఐని అడగాలని వుంది అన్నారు. వైఘా దిల్‌రాజు మాట్లాడుతూ, ఇది డ్రీమ్ కం ట్రూ మూమెంట్. మా ఇష్ట దైవం లార్డ్ వెంకటేశ్వర స్వామి పేరుతో ఈ కంపెనీకి 'లోర్వెన్ ఎఐ' అనిపెట్టడం జరిగింది. 'లోర్వెన్ ఎఐ' ఫ్యూచర్‌గా భావిస్తున్నాము. థాంక్యూ సో మచ్ క్వాంటం గ్లోబల్ ఎఐ. 'లోర్వెన్ ఎఐ' ఆలోచన మా హస్బెండ్ దిల్ రాజుది. ఆయన విజన్ మహా అద్భుతం అన్నారు.



కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీవిష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ 'సింగిల్'తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతాఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు 'సింగిల్' మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఇవానా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?**

డైరెక్టర్ కార్తీక్ ఒకరోజు కాల్ చేసి ఈ సినిమా గురించి చెప్పారు.

## 'సింగిల్' నాకు చాలా స్పెషల్ మూవీ: ఇవానా

కథ విన్నాను. చాలా నచ్చింది. శ్రీ విష్ణు. వెన్నెల కిషోర్, కేతిక ఇలా చాలా అద్భుతమైనటువంటి నటులు ఉన్నారు. గీత ఆర్ట్స్ లాంటి గొప్ప సంస్థ ఉంది. నేను తెలుగులోకి రావడానికి ఇదే యాప్ట్ అనిపించి చేశాను.

**ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?**

ఇందులో హారిణి అనే పాత్రలో కనిపిస్తాను. నాది చాలా జోవియల్ అండ్ ప్లజెంట్ క్యారెక్టర్. హారిణి డాన్సర్. తన క్యారెక్టర్‌లో చాలా ఎమోషన్ ఉంటుంది. ఫ్యామిలీ అటాచ్మెంట్ ఉంటుంది. తాను ఎవరినైనా ఇష్టపడితే వాళ్లకోసం ఏదైనా చేయడానికి సిద్ధపడుతుంది. ఈ క్యారెక్టర్‌ని ప్లే చేయడం చాలా ఎంజాయ్ చేశాను.

**ఇది ఎలాంటి సినిమా?**

ఇది చాలా ఫన్ మూవీ, ఫ్యామిలీ అందరితో కలిసి థియేటర్స్‌లో చాలా ఎంజాయ్ చేయొచ్చు. లాఫ్ రైడ్ లా ఉంటుంది. ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా. కచ్చితంగా చాలా మంచి స్టార్ట్ అవుతుందని భావిస్తున్నాను. ఈ సినిమా నా కెరియర్‌లో చాలా స్పెషల్ ప్లేస్ ఉంటుంది. నాకు డాన్స్ అంటే చాలా ఇష్టం. నా క్యారెక్టర్ డాన్సర్ అని తెలిసినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే సబ్జెక్టు. ఈ సినిమాలో నా క్యారెక్టర్ విన్న వెంటనే నాకు చాలా ఎక్సైటింగ్ అనిపించింది. ఆ ఎక్సైట్ మెంట్ ఆడియన్స్‌లో కూడా ఉంటుందని నా నమ్మకం.

**శ్రీవిష్ణుతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

శ్రీవిష్ణు చాలా కూల్ పర్సన్. ఆయన చాలా సైలెంట్‌గా ఉంటారు. కాస్త ఇంట్రోవర్ట్ అనిపిస్తారు. కానీ కిషోర్‌తో కలిసినప్పుడు మాత్రం చాలా హిలేరియస్‌గా ఉంటారు. శ్రీవిష్ణు నాకు డైలాగ్స్ రాసి ఇవ్వడం వెరీ మెమరీబల్ ఎక్స్పీరియన్స్. అలాగే కేతిక శర్మతో కూడా వర్క్ చేయడం వెరీ ఫన్ ఎక్స్పీరియన్స్.

**డైరెక్టర్ కార్తీక్ గురించి?**

కార్తీక్ తమిళ్ పర్సన్. ఆయనతో నేను తమిళ్‌నే మాట్లాడేదాన్ని. ఆయన చాలా క్లియర్ విజన్ ఉన్న డైరెక్టర్. ఆయనతో వర్క్ చేయడం రియల్లీ వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్.

**సినిమా మ్యూజిక్ గురించి?**

సినిమాలో చాలా బ్యూటిఫుల్ సాంగ్స్ ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన రెండు పాటలు చాలా మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. మిగిలిన పాటలు కూడా చాలాబ్యూటిఫుల్ గా ఉండబోతున్నాయి.

## విశ్వంభరలో 'అవని'గా త్రిష

మెగాస్టార్ చిరంజీవి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ విశ్వంభర. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఈ సంవత్సరం మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రాలలో ఒకటి. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన పోస్టర్లు, విజువల్ వండర్ టీజర్, ఆధ్యాత్మికంగా నిండిన ఫస్ట్ సింగిల్‌రామరామతో భారీ అంచనాలను పెంచింది. యువి క్రియేషన్స్ విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రంలో త్రిష కృష్ణన్ హీరోయిన్ పాత్ర పోషిస్తున్నారు.



త్రిషకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, విశ్వంభరలోని ఆమె పాత్ర అవనిగా పరిచయం చేశారు. రాజసం ఉట్టిపడే చీరకట్టులో మెరిసిపోతు కనిపించారు త్రిష. ఈ పోస్టర్‌కి ట్రమండస్ రెస్పాన్స్ వస్తోంది. వశిష్ట విజన్, యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో రూపొందుతున్న విశ్వంభర పురాణ గాథలను మోడరన్ సినిమాతో బ్లెండ్ చేస్తోంది. హై క్వాలిటీ విఎఫ్ఎక్స్ భారీ సిజిఎస్ బడ్జెట్, అద్భుతమైన కథ ప్రేక్షకులకు విజువల్ వండర్ ఎక్స్ పీరియన్స్‌ని అందించబోతోంది. ఈ చిత్రంలో ఆశికా రంగనాథ్ మరో హీరోయిన్‌గా నటిస్తుండగా, కునాల్ కపూర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి డీవోపీ చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్. తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, త్రిషకృష్ణన్, ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్. సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, బ్యానర్: యువి క్రియేషన్స్, సంగీతం: ఎంఎం కీరవాణి, డిఓపి: చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఎఎస్ ప్రకాష్, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.

## 'శుభమ్' ప్రమోషనల్ సాంగ్ విడుదల

ప్రముఖ నటి సమంత నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టారు. సమంత నేతృత్వంలోని వస్తున్న తొలి చిత్రం 'శుభమ్'. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత నిర్మిస్తున్న ఈ చిత్రాన్నికి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ చిత్రం మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన 'శుభమ్' ట్రైలర్‌కు విశేషమైన స్పందన వచ్చింది. మేకర్స్ ఈ క్రమంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా మొదటి సింగిల్ 'జన్మ జన్మల బంధమ్'ను విడుదల చేశారు. ఇది ప్రమోషనల్ వైబ్ కోసం రూపొందించి ఓ ఎనర్జిటిక్ రీమిక్స్ పాట. నిర్మాతతో పాటు ప్రధాన తారాగణం ఈ ప్రమో షనల్ సాంగ్‌లో కనిపిస్తారు. ఈ సాంగ్ లో



సమంత అందరి దృష్టిని ఆకర్షించేలా ఉన్నారు. టీం అంతా కూడా ఫుల్ వైబ్‌లో ఉన్నట్టుగా కనిపిస్తోంది. ఈ ప్రమోషనల్ సాంగ్ బీట్ చాలా హుషారుగా ఉంది. నవ్వు, భయం ఇలా అన్ని రకాల ఎమోషన్స్‌ను 'శుభమ్'లో పొందు పర్చారని ట్రైలర్ చూస్తేనే తెలుస్తుంది. ఈ సినిమాకు వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ వంటి వారు నటించారు. మే 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోన్న 'శుభమ్' ఈ వేసవికి ప్రేక్షకులను పూర్తిగా సంతృప్తిపరిచే చిత్రం కానుంది.

## 'పాంచ్ మినార్' నుంచి సాంగ్ రిలీజ్

యంగ్ ట్యాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పాంచ్ మినార్'. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై మాధవి, ఎమ్ఎస్ఎమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ ఫస్ట్ సాంగ్, టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ జాను మేరి జాను సాంగ్‌ని రిలీజ్ చేశారు. స్టార్ కంపోజర్ శేఖర్ చంద్ర ఈ సాంగ్ ని క్యాచి ట్యూన్ గా కంపోజ్ చేశారు. వినాయక్ ఈ పాటని ఎనర్జిటిక్‌గా పాడారు. శ్రీహర్ష ఈమని రాసిన లిరిక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సాంగ్ లో రాజ్ తరుణ్, రాశి సింగ్ కెమిస్ట్రీ ఇంట్రస్టింగ్‌గా వుంది. ఈ సాంగ్ ఇన్స్ంట్ హిట్ గా నిలిచింది. ఈ చిత్రంలో రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఆదిత్య జవ్వాది డీవోపీ కాగా ప్రవీణ్ పూడి ఎడిటర్. 'బేబీ' సురేష్ భీమగాని ఆర్ట్ డైరెక్టర్.

నటీనటులు: రాజ్ తరుణ్, రాశి సింగ్,అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ, సుదర్శన్, కృష్ణ తేజ, నంద గోపాల్, ఎడ్విన్ లక్ష్మి మీసాల, జీవా, అజీజ్ తదితరులు. సాంకేతిక సిబ్బంది: బ్యానర్: కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పి, సమర్పణ: గోవింద రాజు, రచన, దర్శకత్వం: రామ్ కడుముల, నిర్మాతలు: మాధవి, ఎమ్ఎస్ఎమ్ రెడ్డి, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ: ఆదిత్య జవ్వాది, ఎడిటర్: ప్రవీణ్ పూడి, ఆర్ట్ డైరెక్టర్: 'బేబీ' సురేష్ భీమగాని, డైలాగ్స్: గొరిజాల సుధాకర్, కోడైరెక్టర్స్: పుల్లారావు కొప్పినీడి, టి రాజా రమేష్, పీఆర్వో: వంశీశేఖర్.



## మే 16న రిలీజ్ కానున్న '23'

మల్లేశం, 8 ఎ.ఎమ్. మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ '23'తో వస్తున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. మే 16న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సినిమాని స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. ఇటీవల విడుదలైన టీజర్ సెన్సేషనల్ రెస్పాన్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. కోసి కోయ్యంగానే సాంగ్ వైరల్ అయి సినిమాపై ఎక్స్పెక్టేషన్‌ని పెంచింది. ఈ చిత్రానికి మార్క్‌కె రాబిన్ మ్యూజిక్ అందిస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అనిల్ ఆలయం ఎడిటర్, లక్ష్మణ్ ఏలే ఆర్ట్ డైరెక్టర్.



తారాగణం: తేజ, తన్మయి, ఝాన్సీ, పావోన్ రమేష్, తాగుబోతు రమేష్, ప్రణీత్


సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: రాజ్‌ఆర్, బ్యానర్: స్టూడియో 99, విడుదల: స్పిరిట్ మీడియా, సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి, సంగీతం: మార్క్ కె రాబిన్, ,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకట్ సిద్దారెడ్డి, ప్రొడక్షన్ డిజైన్: లక్ష్మణ్ ఏలే, ఆర్ట్ డైరెక్షన్: విష్ణువర్ధన్ పుల్లా, కాస్టింగ్ డైరెక్షన్: మహేష్ గంగిమల్ల, డైలాగ్స్: ఇండస్ మార్టిన్, కాస్ట్యూమ్ డిజైన్: శ్రీపాల్ మాచర్ల, సాహిత్యం: చంద్రబోస్, రెహమాన్, సింధు మార్టి.




## వరల్డ్స్ బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి

ప్రపంచంలోనే బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్‌తో నాగపూర్‌లో మొదటిసారిగా నిర్మించబోయే ఈ సినిమా థియేటర్ భారతీయ సాంకేతిక రంగానికి ఒక మార్గదర్శకంగా నిలవనుంది. ఎంటర్ టైన్మెంట్‌లో మోడరన్ ఇండియాకి ఇది ఒక గర్వకారణంగా మారబోతోంది. వరల్డ్స్ బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్ నిర్మించేందుకు అవకాశం దక్కడం నాకు గర్వకారణం. ఇండియన్ ఎంటర్ టైన్మెంట్ ప్రపంచ స్థాయిలోకి తీసుకెళ్లాలని ప్రధాని లక్ష్యం. అదే ప్రేరణగా ఈ ప్రయత్నం మొదలైంది. మా విజన్‌ని అర్థం చేసుకుని ఈ కలను నిజం చేసేందుకు మమ్మల్ని నమ్మిన ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు, అని అభిషేక్ అగర్వాల్ అన్నారు.


"సినిమాను మరింత గొప్పగా మార్చడమే మా గీజు క్రియేషన్స్ లక్ష్యం. గొప్ప సినిమాలు తీయడమే కాదు, అద్భుతమైన థియేటర్లు కూడా నిర్మించడమే మా ధ్యేయం. ప్రపంచపు అతిపెద్ద స్క్రీన్‌ని నాగపూర్‌లో నిర్మించబోతున్నాము. మా పరిశ్రమ సామర్థ్యాలపై నమ్మకం ఉంచిన ప్రధాని మోదీకి మా కృతజ్ఞతల్లు అని విక్రమ్ రెడ్డి అన్నారు.



## జూలై 4న రానున్న 'తమ్ముడు'

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ "తమ్ముడు". ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ రోజు దర్శకుడు శ్రీరామ్ వేణు పుట్టిన రోజు సందర్భంగా "తమ్ముడు" మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేశారు. జూలై 4న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ఓ స్పెషల్ వీడియో క్రియేటివ్‌గా, ఎంటర్ టైనింగ్‌గా ఉండి ఆకట్టుకుంటోంది.

'తమ్ముడు' మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ డిఫరెంట్‌గా ప్లాన్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో నటించిన వివిధ భాషలకు చెందిన యాక్టర్స్ స్వసిక విజయన్, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, లయ, బేబి శ్రీరామ్ దీత్య ఒక్కొక్కరుగా డైరెక్టర్ శ్రీరామ్ వేణు దగ్గరకు వస్తారు. వీళ్ల తనకు బర్త్ డే విషెస్ చెప్పేందుకు వచ్చారని శ్రీరామ్ వేణు అనుకోగా...వాళ్ల మాత్రం 'తమ్ముడు' సినిమా రిలీజ్ ఎప్పుడు?, ప్రమోషన్ ఎప్పుడు బిగిన్ చేస్తారు? అని అడుగుతారు. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న లయ. తన పోస్టర్ కూడా రిలీజ్ చేయలేదు, రిలీజ్ డేట్ చెప్పడం లేదు అని అడుగుతుంది. చివరలో బేబి శ్రీరామ్ దీత్య కూడా నేను థర్డ్‌క్లాస్‌లో ఉన్నప్పుడు మూవీ స్టార్ట్ చేశారు, ఇప్పుడు నేను ఫిఫ్త్ క్లాస్ చదువుతున్నా, మూవీ రిలీజ్ డేట్ ఎప్పుడు? అని అడుగుతుంది. దీంతో డైరెక్టర్ శ్రీరామ్ వేణు వాళ్లకు ఏం చెప్పాలో తెలియక మీకు ఇన్ఫామ్ చేస్తానంటూ పంపిస్తారు. చివరలో ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ శ్రీరామ్ వేణు బర్త్ డే కేక్ కట్ చేయడంతో పాటు జూలై 4న 'తమ్ముడు' మూవీ రిలీజ్ అంటూ ప్రకటిస్తారు. మంచి ఫన్ తో డిజైన్ చేసిన ఈ వీడియో క్రియేటివ్‌గా ఉండి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి మూవీస్ చేయగా.. దర్శకుడు శ్రీరామ్ వేణు నాని హీరోగా ఎంసీఏ, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా వకీల్ సాబ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్ లో 'తమ్ముడు' సినిమా వస్తుండటం సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను "తమ్ముడు" సినిమాతో అందించబోతున్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు.



# దుస్తుల శుభ్రతలో మెళకువలు

బ్రాండెడ్ దుస్తులకు ప్రత్యేకంగా ట్యాగ్ ఉంటుంది. అందులో వాటిని శుభ్రపరిచే విధానం నుంచి ఆరబెట్టడం , ఇస్త్రీ తదితర విషయాల్లో తీసుకోవాల్సి న జాగ్రత్తలన్నీ పొందుపరచి ఉంటాయి. వాటిని పాటిస్తే ఎక్కువకాలం ఆ వస్త్రం మన్నుతుంది. ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ చేసిన దుస్తులైతే నాణ్యత తగ్గకుండా జాగ్రత్తపడితే మరిన్ని రోజులు ఆకర్షణగా కనిపిస్తాయి. చిన్న మరక పడినా ఘాటైన రసాయనాలున్న లిక్విడ్స్ తో మొత్తం డ్రస్‌ను శుభ్రపరిస్తే కాలక్రమేణా అది కళను కోల్పోతుంది. కొన్నిరకాల వస్త్రాలైతే త్వరగా చిరిగిపోయే ప్రమాదమూ ఉంది. దీనికి బదులుగా మరకలు పడిన ప్రాంతంలో మాత్రం సున్నితమైన డిటర్జెంట్ లేదా సహజమైన స్టెయిన్ రిమూవర్‌ని ఉపయోగించి శుభ్రపరచి ఆరనివ్వాలి. ఆ తర్వాత వస్త్రం మొత్తాన్ని సాధారణంగా ఉతికితే సరిపోతుంది.

దుస్తులను చల్లనినీటిలో శుభ్రపరచాలి. ముదురు వర్ణంలో ఉన్నవాటిని మొదటిసారి ఉతికే ముందు అరబకెట్ నీళ్లలో రెండుచెంచాల కల్లుప్పు వేసి అయిదు నిమిషాలపాటు నాననివ్వాలి.



దాంతో రంగు దిగకుండా ఉంటుంది. ఆ తర్వాత తేలికపాటి డిటర్జెంట్‌తో శుభ్రపరిచి ఆరనిస్తే చాలు. కొన్ని డ్రెస్‌లకు అదనంగా బొత్తాలుంచిన చిన్న కవర్ అటాచ్ చేసి ఉంటుంది. బయటపడేయ కుండా దాన్ని భద్రపరచాలి. బటన్ ఊడినప్పుడు ఆ డ్రెస్‌ను పక్కన పడేయకుండా, ఆ చోట కొత్తదాన్ని కుట్టుకోవాలి. చిన్నగా కుట్టు ఊడినప్పుడు లేదా మరేదైనా మరమ్మతు ఉంటే నేర్చుకుని బాగు చేసుకోవాలి. ఇస్త్రీకి ముందుగా ఆ వస్త్రానికి తగ్గ వేడిని చెక్ చేయాలి. అలాగే అలమరలో కుక్కేయకుండా మడిచి వరసగా సర్దడం లేదా హ్యాంగర్లకు వేయడం అలవరుచు కుంటే దుస్తులు ఎక్కువ కాలం మన్నుతాయి. అలమరలలో దుస్తుల స్థానాన్ని అప్పుడప్పుడు మార్చుతూ ఉండాలి. లేదంటే కంటికి కనిపించేవాటిని మాత్రమే ధరిస్తాం. మిగతావన్నీ అడుగుకు వెళుతుంటాయి. నెలకొకసారి లేదా సీజన్ మారినప్పుడల్లా దుస్తులను బయటకు తీసి వినియోగించేవీ లేదా అనవసరమైన వాటిని విడదీసి తిరిగి సర్దాలి. కొన్నింటిని రీసైకిల్ చేయొచ్చు. అలాగే వాడనివాటినివిరాళంగా ఎన్జీవోలకు అందించడం అలవరచుకోవాలి.

# సిజేరియన్ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సిజేరియన్ తర్వాత తల్లులు ఎంత విశ్రాంతి తీసుకుంటే అంత త్వరగా కోలుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. కుట్లపై ఒత్తిడి పడకుండా అవి త్వరగా మానిపోవడానికి ఇది దోహదం చేస్తుందట! అయితే కొత్తగా తల్లైన వారికి రోజులో చాలా సమయం పాపాయితోనే సరిపోతుంది. వారికి పాల్విడం, డైపర్లు/దుస్తులు మార్చడం, వారిని నిద్రపుచ్చడం, ఇలా వారు నిద్రపోయినప్పుడు ఇంటిపని ఏదైనా ఉంటే చేసుకోవడం.. ఇలా ఈ పనులతోనే రోజంతా బిజీబిజీగా గడిచిపోతుంది. ఇక నిద్రపోవడానికి సమయమెక్కడిది? అని చాలామంది తల్లులు ఆందోళన చెందుతుంటారు. దీంతో వారిలో మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఇది ఇటు బాలింతలకు, అటు శిశువుకు.. ఇద్దరికీ మంచిది కాదు. కాబట్టి తల్లైన తొలినాళ్లలో నిద్రలేమిని, ఒత్తిడిని జయించాలంటే ఇతర పనులు పక్కన పెట్టి పాపాయి నిద్రపోయినప్పుడే తల్లులూ నిద్రకు ఉపక్రమించాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఇలా ఈ సమయంలో ఎక్కువ సమయం విశ్రాంతి తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో నడుం నొప్పి సమస్య కూడా రాకుండా జాగ్రత్తపడచ్చట!

**పాలిస్తే కోలుకుంటారు...** పాలిచ్చే ప్రక్రియ కొత్తగా తల్లైన మహిళలకు ఎంతో ప్రయోజనకరం అంటున్నారునిపుణులు. ప్రసవానంతరం పెరిగిన బరువు తగ్గడం దగ్గర్నుంచి కుట్లు త్వరగా మానిపోవడానికి, తిరిగి సౌందర్యాన్ని పెంపొందించుకోవడానికి, వెంటనే మళ్లీ గర్భం ధరించకుండా ఉండడానికి.. ఇలా ఎలా చూసినా బ్రెస్ ఫీడింగ్ బాలింతలకు ఎంతో మేలు చేస్తుంది.

అయితే పిల్లలకు పాలిచ్చే క్రమంలో తల్లులు కూర్చునే పొజిషన్ కూడా ఇక్కడ కీలకమే అంటున్నారు నిపుణులు. ఇందులో భాగంగా ముందుకి, వెనక్కి వంగిపోకుండా నిటారుగా కూర్చొని చిన్నారికి పాలివ్వాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల సిజేరియన్ కారణంగా దీర్ఘకాలంలో నడుంనొప్పి రాకుండా జాగ్రత్తపడచ్చట! ఇక ఈ క్రమంలో మీకు, మీ చిన్నారికి సౌకర్యవంతంగా ఉండడం కోసం నిపుణుల సలహా మేరకు ఫీడింగ్ పిల్లోను కూడా వాడచ్చట!

**పోషకాహారం కావాల్సిందే...** సిజేరియన్ తర్వాత ఇది తినకూడదు. అది తాగకూడదు. అన్న నియమనిబంధనలు ఇప్పటికీ చాలా ఇళ్లలో ఉండడం మనం చూస్తూనే ఉంటాం. అయితే పాలిచ్చే తల్లులకు ఎలాంటి పథ్యాలు అవసరం లేదని డాక్టర్లు చెబుతున్నారు. గర్భిణిగా ఉన్న సమయంలో సంపూర్ణ పోషకాలు లభించే పదార్థాలన్నీ ఎలాగైతే తీసుకుంటారో ప్రసవానంతరం కూడా అవే ఆహార నియమాలు పాటించాలని, తద్వారా సిజేరియన్ నొప్పుల నుంచి త్వరగా కోలుకోవచ్చని సలహా ఇస్తున్నారు. అలాగే పాలు ఎక్కువగా ఉత్పత్తి కావడం కోసం

ఆకుకూరలు, వెల్లుల్లి, కోడిగుడ్లు, పాలు, పాల పదార్థాలు, మాంసం, ఓట్‌మీల్, సోంపు.. వంటివన్నీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ముఖ్యం.

ఇక సిజేరియన్ కారణంగా శరీరం కోల్పోయిన నీటి స్థాయుల్ని తిరిగి భర్తీ చేసుకోవడానికి పాల ఉత్పత్తికి బాలింతలు రోజుకు రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగడం మంచిదట!

# సోంప్ షర్బత్

ఇది వేసవిలో చల్లని పానీయంగా చాలా మందికి ఇష్టమైనది. సోంపు గింజలను నీటిలో నానబెట్టి, ఆ నీటిని షుగర్ లేదా తేనెతో కలిపి షర్బత్ తయారు చేస్తారు. ఇది జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. అంతేగాక శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. ఒక గ్లాసు నీటిలో రెండు టేబుల్ స్పూన్ సోంపు గింజలను వేసి రాత్రంతా నానబెట్టాలి. నానిన సోంపు గింజలను నీటిని వడకట్టి గింజలను పక్కన పెట్టాలి. వడకట్టిన సోంపు నీటిలో రుచికి తగినంత షుగర్ లేదా తేనె కలపాలి. సోంపు షర్బత్ చల్లగా తాగడానికి ఐస్ వేసుకోవచ్చు. లేదా ఫ్రిజ్‌లో పెట్టి అయినా తాగవచ్చు. జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. వేసవిలో డీహైడ్రేషన్ నివారించడానికి సహాయపడుతుంది. వేసవి ఎండ నుంచి ఉపశమనం పొందడానికి చల్లని రుచికరమైన జ్యూస్ తీసుకోవాలనిపిస్తే సోంపు షర్బత్ తీసుకోవచ్చు.



## ఆధ్యాత్మికం

# పాంచజన్యం

దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధ్యేయంగా తన భక్తులని కాపాడే భగవానుడు శ్రీకృష్ణభగవానుడు ఉపయోగించే శంఖం పేరు పాంచజన్యం. మహాభారత యుద్ధంలో ఈ శంఖం పాండవులకు విజయాన్ని తెచ్చి పెట్టింది. కౌరవులకు ఘోర పరాజయం చవి చూసాయి. పాంచజన్యం అనే శంఖం పూరిస్తేచాలు ముల్లోకాలు దద్దరిల్లుతాయి. ఈ పాంచజన్యం శంఖం శ్రీ కృష్ణుడికి ఎలా లభించిందో మనం తెలుసుకుందాం. తమ విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత బలరామకృష్ణులు తమ గురువు శాందీపని మహాముని వద్దకు వెళ్లారు. తమకి విద్యాబోధన గావించిన శాందీపని మునికి గురుదక్షిణ ఇవ్వాలనుకున్నారు. అది గ్రహించిన శాందీపని మునికి శ్రీకృష్ణుడు సాక్షాత్తు దేవ దేవుడు అని కూడా తెలుసు. అందుకే ఈ కోరిక కోరాడు.

చాలకాలం క్రితం సముద్రంలో తన పుత్రుడుని తిరిగి తీసుకు రమ్మని కోరాడు గురదక్షిణగా, అప్పుడు శ్రీ కృష్ణ, బలరాములు నేరుగా సముద్రుడి వద్దకు వెళ్లి ఈ విషయం వివరాంచారు.కొంత కాలం క్రితం మా గురుపుత్రుడు ఈ సముద్రంలో పడి మరణించాడు అతన్ని వెంటనే వెనక్కి తీసుకురా! అని అడిగారు. దానికి బదులుగా సముద్రుడు మీ గురుపుత్రున్ని నేను తీసుకుపోలేదు. పంచజునుడు అనే రాక్షసుడు ఆ పిల్లవాడిని పట్టుకెళ్లాడు. వాడు శంఖం రూపంలో సముద్రం నీటి అడుగున ఉండవచ్చును. అని సమాధానం ఇచ్చాడు. శ్రీకృష్ణుడు వెంటనే సముద్రంలోకి వెళ్లి అక్కడ దాగున్న పంచజనుడు అనే రాక్షసున్ని పట్టుకున్నాడు. వాడి కడుపులో గురుపుత్రుడు కనిపించలేదు. అప్పుడు రాక్షసుడి శరీరం నుండి పుట్టిన 'పాంచజన్యం' అనే శంఖాన్ని తీసుకుని యమపురికి చేరుకున్నారు. అక్కడ ఈ శంఖం శ్రీ కృష్ణుడు పూరించగా ఆ శబ్దానికి యమలోకం తలకిందులైంది. అది విని యమధర్మరాజు వెంటనే బయటకు వచ్చి శ్రీ కృష్ణుడికి అభివాదము చేసి, 'స్వామీ ఆజ్ఞపించండి' అని అడిగాడు.

# సమ్మర్‌లో సన్‌స్క్రీన్

సన్‌స్క్రీన్ లోషన్ వాడడం సర్వసాధారణం. ప్రధానంగా రెండు రకాల సన్‌స్క్రీన్‌లు ఉంటాయి. మినరల్ రెండోది కెమికల్. మినరల్ సన్‌స్క్రీన్‌లో జింక్ ఆక్సైడ్, టైటానియం డయాక్సైడ్‌లాంటి క్రియాశీల ఖనిజ పదార్థాలు ఉంటాయి. ఇవి యువి కిరణాలను నిరోధిస్తాయి. ఇక కెమికల్ సన్‌స్క్రీన్‌లు అధికశక్తి గల యువి కిరణాలను గ్రహిస్తాయి. చర్మాన్ని దెబ్బతీయ కుండా నిరోధిస్తాయి. ఇవేకాకుండా మా ర్కెట్‌లో కాంబినేషన్ సన్‌స్క్రీన్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. సన్‌స్క్రీన్‌లోని ఇన్‌గ్రేడియెంట్స్ థైరాయిడ్ హార్మోన్లు, టెస్టోస్టెరాన్, ప్రొజెస్టెరాన్ స్థాయులను దెబ్బతీస్తాయని సూచిస్తున్నాయి. అయితే ఇవి తక్కువస్థాయి ఆధారాలతో కూడిన అధ్యయనాలు మాత్రమే.

# వ్యాధుల నుండి రక్షణ కల్పించే స్ట్రాబెర్రీస్

స్ట్రాబెరీ, మల్బరీ, బ్లూబెరీ వంటి బెర్రీ జాతికిచెందిన పండ్లలో యాంథోసెనిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, కొన్నిరకాల క్యాన్సర్లు, బీపీ, డయాబెటీస్ లాంటి జీవన శైలి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని శాస్త్రీయ పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఈ బెర్రీ పండ్లలో కూడా బ్లూబెరీలు అధిక మెత్తంలో యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. కానీ మన ప్రాంతాల్లో పండవు కాబట్టి, వీటిని ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల వీటి ఖరీదు అధికం. స్ట్రాబెరీలు, మల్బరీలు కొంతమేరకు దేశీయంగా లభించినప్పటికీ ఇవి కూడా తక్కువ ఖరీదు కాదు. కానీ, ఈ పండ్లలో లభించే విటమిన్ సి, పీచు పదార్థాలు, కొన్ని యాంటీ ఆక్సిడెంట్లు మనకు వేరే ఆహారం నుంచి కూడా లభిస్తాయి. ముఖ్యంగా కాలానుగుణంగా తాజాగా, మన దగ్గర చవకగా దొరికే అన్ని పండ్లలోనూ ఈ



పోషకాలు ఉంటాయి. విటమిన్ సి. పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇక యాంథోసయానిన్స్ విషయానికొస్తే ముదురు రంగులో ఉండే రేగు పళ్ల నేరేడు పళ్ల అలుబుఖరా పండ్లలో కూడా ఇవి అధికంగా లభిస్తాయి. యాంథోసయానిన్స్ లాగానే, యాంటీ ఆక్సిడెంట్లని పని చేసే మరెన్నో పదార్థాలు తాజాగా లభించే బత్తాయి, కమలా, నారింజ, జామ, సపోటా, సీతాఫలం, అరటి పండు, యాపిల్, నల్ల ద్రాక్ష, బొప్పాయి, పుచ్చకాయ, వంటి అన్నిరకాల పండ్లలోనూ ఉంటాయి. కేవలం ప్రత్యేకమైన పండ్లు తీసుకొంటేనే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అన్న అపోహ. అందుబాటులో ఉండే ఏ పండ్లేవేనా రోజుకు రెండు రకాలు ఆహారంలో భాగం చేసుకొంటే చాలు.

## నేటి నుంచి విశాఖ-తిరుపతి మధ్య మరికొన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,మే 4,ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ నేటి నుంచి విశాఖపట్నం–తిరుపతి–విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విశాఖ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 08583ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5నుంచి జూన్ 30వరకు ప్రతి సోమవారం విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08584ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6నుంచి జులై 1వరకు ప్రతి మంగళవారం తిరుపతి నుంచి బయలుదేరుతుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో దువ్వాడ,అనకాపల్లి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ,తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి,రేణిగుంట స్టేషన్లలో నిలుస్తాయి.

## రైళ్ల నిర్వహణకు అంతరాయం ఏర్పడకుండా చూడండి

### రైల్వే సిబ్బందికి ఉన్నతాధికారుల ఆదేశం

**గుంతకల్లు రైల్వే,మే 4,ప్రభాతవార్త:** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైళ్ల నిర్వహణకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా నిత్యం అప్రమత్తంగా ఉంటూ రైల్వే సిబ్బంది విధులు నిర్వర్తించాలని గుంతకల్లు రైల్వే డివిజనల్ ఉన్నతాధికారులు సూచించారు. రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని నంద్యాల–ఎర్రగుంట్ల సెక్షన్‌లో విద్యుత్ రైలు మార్గానికి చెందిన (ఓహెచ్ఇ) విద్యుత్ శక్తిని అందించే పరికరాలు(పాంటోగ్రాఫ్)లు కిందకు జారిపోవడం,వైర్లు కిందకు వేలాడటం వంటి వాటివల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అలాగే రైళ్ల ట్రాఫిక్‌కు సైతం భారీ నష్టం వాటిల్లుతుందని వారు ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్ మాస్టర్లు, లోకో పైలట్‌లు,రైల్వే సిబ్బంది అందరు నిత్యం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించడం ద్వారా ముందస్తు సమాచారంతో తగు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి నష్టాన్ని నివారించవచ్చు అన్నారు.

## భగీరథునికి ఎపి సిఎం చంద్రబాబు నివాళి



భగీరథ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలం ఉన్నచోటే సంస్కృతి, నాగరికతల వికాసం జరుగుతుంది. ప్రజల శ్రేయస్సుకోసం గంగను భూమిపైకి తీసుకువచ్చిన మహర్షి భగీరథుని త్యాగం, దృఢనిశ్చయం మన భారతీయ సంప్రదాయానికి గొప్ప ముద్ర వేసాయి. ఆయన స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం సాగునీటి రంగాన్ని ప్రాధాన్యతగా తీసుకుంది. పోలవరం ప్రాజెక్టును సాకారం చేసి భగీరథుని కలను నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నాం.శ్రీ భగీరథ మహర్షి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడం మన సంస్కృతిపై గౌరవానికి నిదర్శనమన్నారు. గంగను భువికి తెచ్చిన ఆ మహనీయుడిని స్మరించడం, పూజించడం మనందరి కర్తవ్యమని తెలిపారు. ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఒక స్ఫూర్తి అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భగీరథుని త్యాగం మరువలేనిది ప్రజల శ్రేయస్సు కోసం గంగను భూమిపైకి తీసుకువచ్చిన మహర్షి భగీరథుని త్యాగం, దృఢనిశ్చయం మన భారతీయ సంప్రదాయానికి గొప్ప ముద్ర వేశాయని మంత్రి నారా లోకేష్ అభివర్ణించారు.భగీరథుని స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం సాగునీటి రంగాన్ని ప్రాధాన్యతగా తీసుకుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టును సాకారం చేసి భగీరథుని కలను నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. భగీరథ మహర్షి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడం మన సంస్కృతిపై గౌరవానికి నిదర్శనమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

**కఠోర శ్రమతో ఎంతటి ఆశయాన్నైనా సాధించవచ్చు: మాజీ సిఎం జగన్**

నేడు భగీరథ మహర్షి జయంతి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నగర కులస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. "ఎక్స్'వేదికగా ఈ మేరకు చేసిన పోస్టులో కఠోర శ్రమ, పట్టుదలతో ఎంతటి ఆశయాన్ని అయినా సాధించగలమని నిరూపించిన మహనీయులు భగీరథుడు అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా కఠోర తపస్సుతో గంగను భువికి తీసుకువచ్చి ప్రజలకు వరంగా అందించిన మహా రుషి భగీరథ మహర్షి. కఠోర శ్రమ పట్టుదలతో ఎంతటి ఆశయాన్ని అయిసా సాధించగలమని సగర కులస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కఠోర తపస్సుతో గంగను భువికి తీసుకువచ్చి ప్రజలకు వరంగా అందించిన మహా రుషి భగీరథ మహర్షి, కఠోర శ్రమ, పట్టుదలతో ఎంతటి ఆశయాన్ని అయినా సాధించగలమని నిరూపించిన మహనీయులు భగీరథుడు. నేడు భగీరథ మహర్షి జయంతి సందర్భంగా నగర కులస్తులకు శుభాకాంక్షలు.

## భారీ వర్షాల వల్ల ఇబ్బంది కలుగకుండా చర్యలు

### ఎపి రెవెన్యూ మంత్రి అనగాని

**విజయవాడ మే4 ప్రభాతవార్త ప్రతినిధి:** భారీ వర్షాల వలన ఎవ్వరికి ప్రాణ నష్టం,ఆస్తి నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్,స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేసారు.. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ఆయన అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు.ఈ విషయంలో రెవెన్యూ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండా లన్నారు. భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈదురు గాలులతో చెట్లు పడిపోయినందున వాటిని తొలగించి ప్రజల రవాణాకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు. భారీ వర్షాల వల్ల మంచినీరు, విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవాలని సూచన. వర్షాలతో నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలని ఆదేశించారు. స్ధానిక సంస్ధలతో సమన్వయం చేసుకుంటూ, మురుగు కాల్వలులో నీరు నిల్వడం లేకుండా పారుదల మెరుగుపర్చాలన్నారు.వర్షం నీరు ముంపుకు గురయ్యే అవకాశాలు ఉండే ప్రాంతాల్లో సహాయచర్యలు తీసుకోవాలన్నారు.

భారీ వర్షాలు,ఈదురుగాలుల కారణంగా విద్యుత్తు సరఫరాలో ఇబ్బందుకులు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.ఆయనసంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఆయా జిల్లాలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడానని మంత్రి గొట్టిపాటి తెలిపారు. గాలివానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించి విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు.

## రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిల చెల్లింపు: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వ పాలనలో రైతులకు ఇవ్వాల్సిన రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలను చెల్లించినట్లు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.గత ప్రభుత్వం రైతుల జీవితాలతో ఆడుకుందన్నారు.ధాన్యం కొనుగోళ్ళలో అక్రమాలకు పాల్పడిందన్నారు.బకాయిలు చెల్లించని కారణంగా రైతులు భారీగా నష్ట పోయారన్నారు.తమ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతగా చెల్లించిందని . ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 5.65 లక్షల మంది రైతుల నుంచి 35.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లోనే రూ.8,277.59 కోట్లు వారి ఖాతాల్లో జమచేసినట్లు మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. ఈ రబీ సీజన్‌లో 1,16,627 మంది రైతుల నుంచి 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లో రూ.2,722.81 కోట్లు జమ చేశామన్నారు.ఏపీ రాజధాని నిర్మాణ పనులకు ప్రధాన మంత్రి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఇక ఎటువంటి అడ్డంకులు ఉండవన్నారు.

## ఎపిలో 3 రోజుల పాటు భిన్నమైన వాతావరణం

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు భిన్నమైన వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ఆర్.కూర్మనాధ్ వెల్లడించారు. కొన్ని చోట్ల ఎండ,మరి కొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలో అక్కడక్కడ సోమ, మంగళవారాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. అలాగే రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.నిన్న తిరుపతి జిల్లా మంగ నెల్లూరులో 42.9 డిగ్రీలు, ప్రకాశం జిల్లా బొట్లగూడరూరులో 41.5, పల్నాడు జిల్లా క్రోసూరులో 41 చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు.ఈ క్రమంలో ఆదివారం రాష్ట్రంలో ఉదయం ఉక్కపోత ప్రజలను బాగా ఇబ్బంది పెట్టింది.ఉన్నట్లుండి ఆకాశం మేఘా వృతమై భారీ వానలు పలు ప్రాంతాల్లో కురిసాయి.అయితే ఆదివారం వేసవి ఉష్ణోగ్రతలు తక్కువగానే ఉన్నాయి.35డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## బిసి గురుకుల డిగ్రీ కాలేజీల్లో 15 వరకు దరఖాస్తులు

### తెలంగాణ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బిసి సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న బిసి గురుకుల డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 15 వరకు అవకాశం కల్పించినట్టు బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి బిసి రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో సీటు కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 15వ వరకు పెంచామని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లి దండ్రుల వినతి మేరకు గడువు తేదీని పొడిగించామని కార్యదర్శి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బిసి రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలలో (ఇంగ్లీష్ మీడియం) మొదటి సంవత్సరంలో బిఎస్‌సి(ఫిజికల్ అండ్ లైఫ్ సైన్సెస్), బికామ్, బిఎ, బిబిఎ, బిఎఫ్‌టి, యానిమేషన్ అండ్ విఎఫ్ఎక్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో బిసి గురుకుల సొసైటీ అధికార వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని సొసైటీ కార్యదర్శి సైదులు ప్రకటనలో స్పష్టం చేశారు. ఇప్పటికే ఎంజెపి జూనియర్ కళాశాలలో చదివిన ఇంటర్మీడియట్ విద్యార్థులు దరఖాస్తు చేయనవసరం లేదని వారు సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 040-23328266 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సొసైటీ కార్యదర్శి సైదులు పేర్కొన్నారు.



## జైలులో వల్లభనేని వంశీకి అస్వస్థత

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** జైలులో వల్లభనేని వంశీ అస్వస్థతకు గురయ్యారు. జిల్లా జైలు నుండి ప్రభుత్వాసుపత్రికి జైలు సిబ్బంది తీసుకొచ్చారు.గుండెసంబంధిత టెస్టులతో పాటు, బ్లడ్ టెస్ట్‌లను ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు చేశారు. వైద్యపరీక్షల అనంతరంజిల్లాజైలుకు తరలించారు.

सड़क परिवहन एवं राजमार्ग मंत्रालय, भारत सरकार | भारतीय राष्ट्रीय राजमार्ग प्राधिकरण

# ₹6100 కోట్ల విలువైన ప్రాజెక్టులతో తెలంగాణ సాధికారత




## శంఖుస్థాపన మరియు జాతికి అంకితం

### ఆసిఫాబాద్

**జాతికి అంకితం**

**NH-363** మంచిర్యాల - తెలంగాణ/మహారాష్ట్ర సరిహద్దు వరకు 4 వరుసల రహదారి నిర్మాణం
పొడవు : 94.6 కి.మీ., వ్యయం: ₹3526 కోట్లు

**NH-61** నిర్మల్ - ఖానాపూర్ సెక్షన్‌లో 2 వరుసల పేవ్డ్‌షోల్డర్‌తో రహదారి నిర్మాణం
పొడవు : 17.79 కి.మీ., వ్యయం: ₹127 కోట్లు

**NH-44** నాగ్‌పూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం
పొడవు : 1 కి.మీ., వ్యయం: ₹29 కోట్లు

**NH-44** నాగ్‌పూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో సర్వీస్‌రోడ్లు మరియు జంక్షన్‌ల అభివృద్ధి
పొడవు : 2 కి.మీ., వ్యయం: ₹18 కోట్లు

**శంఖుస్థాపన**

**NH-44** నాగపూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో 4 అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు మరియు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
పొడవు : 8 కి.మీ., వ్యయం: ₹173 కోట్లు

**NH-63** ఆర్మూర్ - జగిత్యాల - మంచిర్యాల సెక్షన్‌లో 4 వరుసల రహదారి విస్తరణ
పొడవు : 3 కి.మీ., వ్యయం: ₹29 కోట్లు

### హైదరాబాద్

**జాతికి అంకితం**

**NH-44** ఆరాంఘర్ - శంషాబాద్ సెక్షన్లో 6 వరుసల రహదారి విస్తరణ
పొడవు : 10 కి.మీ., వ్యయం: ₹301 కోట్లు

**NH-202** అంబర్‌పేట్ x రోడ్డు వద్ద 4 వరుసల ఫ్లై ఓవర్ నిర్మాణం
పొడవు : 1.66 కి.మీ., వ్యయం: ₹266 కోట్లు

**NH-65** పూణే - హైదరాబాద్ సెక్షన్‌లో BHEL జంక్షన్ వద్ద 6 వరుసల ఫ్లై ఓవర్ నిర్మాణం
పొడవు : 1.65 కి.మీ., వ్యయం: ₹173 కోట్లు

**NH-44** నాగ్‌పూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో 5 అండర్‌పాస్‌లు నిర్మాణం
పొడవు : 7.8 కి.మీ., వ్యయం: ₹148 కోట్లు

**NH-163** హైదరాబాద్ - వరంగల్ సెక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం
పొడవు : 1.7 కి.మీ., వ్యయం: ₹36 కోట్లు

**శంఖుస్థాపన**

**NH-930P** గౌరెల్లి - వలిగొండ సెక్షన్‌లో రెండు వరుసల పేవ్డ్‌షోల్డర్ రహదారి విస్తరణ
పొడవు : 42 కి.మీ., వ్యయం: ₹683 కోట్లు

**NH-65** హైదరాబాద్ - విజయవాడ సెక్షన్‌లో ఫ్లైఓవర్, 12 అండర్‌పాస్‌లు మరియు సర్వీస్ రోడ్ల నిర్మాణం
పొడవు : 12 కి.మీ., వ్యయం: ₹397 కోట్లు

**NH-163** హైదరాబాద్ - యాదగిరి సెక్షన్‌లో ఫ్లైఓవర్ మరియు 3 అండర్‌పాస్‌లు నిర్మాణం
పొడవు : 5 కి.మీ., వ్యయం: ₹125 కోట్లు

**NH-44** నాగపూర్ - హైదరాబాద్ సెక్షన్‌లో అండర్‌పాస్ మరియు సర్వీస్ రోడ్ల నిర్మాణం
పొడవు : 3 కి.మీ., వ్యయం: ₹41 కోట్లు

## ప్రయోజనాలు

- తెలంగాణ, మహారాష్ట్ర మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అవాంతరం లేని, సురక్షితమైన మరియు వేగవంతమైన ప్రయాణం.
- రామగుండంలోని NTPC ప్లాంట్, సింగరేణి బొగ్గు గనులు, కాళేశ్వరం దేవాలయం (దక్షిణ కాశి) లకు మెరుగైన అనుసంధానం.
- ప్రయాణికులకు ఇబ్బంది లేని రాకపోకలు, సరుకు రవాణా సులువు మరియు వేగవంతం.
- ఆరాంఘర్ - శంషాబాద్ ప్రాంతంలో వాణిజ్య/పారిశ్రామిక ఆర్థికాభివృద్ధి వేగవంతం.
- నిర్మల్-జగిత్యాల్ సెక్షన్ మధ్య ప్రయాణ సమయం మరియు వ్యయం తగ్గింపు
- శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయం & వారసత్వ ప్రదేశాలను అనుసంధానించడం ద్వారా పర్యాటక రంగానికి ప్రోత్సాహం.
- అంబర్‌పేట & BHEL జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, పారిశ్రామిక కారిడార్ మరియు ఆర్థిక మండలాలకు సులభమైన మరియు వేగవంతమైన అనుసంధానం
- మహబూబాబాద్, కొత్తగూడెం యొక్క ఆకాంక్షిత మరియు గిరిజన జిల్లాల్లో సామాజిక-ఆర్థిక అభివృద్ధి.
- భద్రాచలం దేవాలయము, పోచంపల్లి మొదలైన పర్యాటక ప్రదేశాలు అనుసంధానం ద్వారా ప్రయాణం వేగవంతం.
- అండర్‌పాస్‌ల నిర్మాణం ద్వారా మెరుగైన రహదారి భద్రత మరియు వివిధ పట్టణాలలో ట్రాఫిక్ రద్దీ తగ్గింపు.
- ఇంధనం ఆదా, కాలుష్యం మరియు వాహన నిర్వహణ వ్యయం తగ్గింపు.

## నితిన్ గడ్కరి

కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల శాఖ మంత్రి

**వారి అమృత హస్తాల మీదుగా**

**సోమవారం 05 మే, 2025**

**ఉదయం 10:00 గంటలకు, కాగజ్‌నగర్ X రోడ్, (ఆసిఫాబాద్) | సాయంత్రం 05:00 గంటలకు, అంబర్‌పేట GHMC గ్రౌండ్స్ (హైదరాబాద్)**

**వీరి ఘనమైన సమక్షంలో**

### జి. కిషన్ రెడ్డి

కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి, భారత ప్రభుత్వం

**అజయ్ టమ్టా**
కేంద్ర సహాయ మంత్రి, రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం

**హర్ష్ మల్హోత్రా**
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు రహదారి రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి, భారత ప్రభుత్వం

**బండి సంజయ్ కుమార్**
హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి, భారత ప్రభుత్వం

**కోమటిరెడ్డి వెంకటరెడ్డి**
రోడ్లు & భవనాల శాఖ మంత్రి, సినిమాటోగ్రఫీ, తెలంగాణ ప్రభుత్వం

**పార్లమెంట్ సభ్యులు**

గోడం నగేశ్ | ధర్మపురి అరవింద్ | సురేష్ కుమార్ షెట్కర్ | వంశీ కృష్ణ గడ్డం | చామల కిరణ్ కుమార్ రెడ్డి

కుందూరు రఘువీరారెడ్డి | ఎం. రఘునందన్ రావు | కొండా విశ్వేశ్వర్ రెడ్డి | అనిల్ కుమార్ యాదవ్ | కేశినేని శివనాథ్

CBC 37107/15/0003/2526

सड़कें ही नहीं, राष्ट्र का निर्माण भी

FOR LIVE STREAMING : www.facebook.com/nitingadkary | https://twitter.com/nitin_gadkari | www.youtube.com/c/NitinGadkariOfficial

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.